ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

శుక్రవారం 13.11.2026 | సంపుటి:13 సంచిక:113 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



శాంతియుత నిరసనలపై

క్రిమినల్ విచారణ సరికాదు

- అలా చేస్తే ప్రజాస్వామ్యానికి దురదృష్టకరమైన రోజు అవుతుంది
- బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు

ముంబై(జనంసాక్షి):నిరసనలు సంబంధిత కేసులపై విచారణకు సంబంధించి బాంబే హైకోర్టు నాగ్‌పుర్ బెంచ్ కీలక వ్యాఖ్యలు చేసింది. శాంతియుత నిరసనలను అణచివేయడానికి క్రిమినల్ విచారణలను ఉపయోగిస్తే అది 'ప్రజాస్వామ్యానికి దురదృష్టకరమైన రోజు' అవుతుందని పేర్కొంది. ఈ క్రమంలో రహదారుల దుస్థితిపై జరిగిన ఆందోళనలో పాల్గొన్నారనే కారణంతో ఓ వ్యక్తిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోనంత వరకు, హింసకు పాల్పడనంత వరకు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కలిగించనంత వరకు.. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు వారికి ఉందని స్పష్టం చేసింది. చంద్రాపుర్ జిల్లా నందగావ్‌లో ఈ ఏడాది జనవరిలో ఓ వాహనం ప్రమాదానికి

మిగతా 2లో..



నాంపల్లి ప్రజాప్రతినిధుల

కోర్టుకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి

2లో



డిసెంబర్ నాటికి 'ఉస్మానియా' పూర్తి కావాలి

జూన్ 2 నాటికి అన్ని టిమ్స్‌లు అందుబాటులోకి రావాలి

- టిమ్స్ హౌస్ కీపింగ్‌ను పూర్తిగా ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వాలి
- నిమ్స్,టిమ్స్ ఆస్పత్రుల మధ్య సమన్వయం ఉండాలి
- ఆరోగ్యశాఖపై ఆయన సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి):
డిసెంబర్ నాటికి ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తికావాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆరోగ్యశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు.జూన్ 2 నాటికి అన్ని టిమ్స్‌లు అందుబాటులోకి రావాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. డిసెంబర్ వరకు ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తి కావాలని సూచించారు. మూడు టిమ్స్‌లకు ఒకేసారి నియామకాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. వాటి ఉద్యోగుల బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. టిమ్స్ హౌస్ కీపింగ్‌ను పూర్తిగా ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వాలన్నారు. నిమ్స్ లో బెడ్స్ ఖాళీ లేక పోతే రోగులను సనత్ నగర్ టిమ్స్ కు తరలించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. నిమ్స్,టిమ్స్ మధ్య సమన్వయం ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. సనత్ నగర్ టిమ్స్ లో డాక్టర్ల నియామకమయ్యే వరకు బయట నుంచి నియమించుకోవాలని అధికారులకు సూచించారు. టిమ్స్, ప్రభుత్వ వైద్య కళాశాలలకు అదనంపు నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమని తెలిపారు.

మిగతా 2లో..

జూన్ 2 నాటికి అన్ని టిమ్స్ లు అందుబాటులోకి రావాల్సిందే..డిసెంబర్ నాటికి ఉస్మానియా హాస్పిటల్ నిర్మాణం పూర్తి కావాలి. వైద్యులు,సిబ్బంది హాజరు విషయం లో సాంకేతికత ను వినియోగించాలి. మూడు టీమ్స్ లకు ఒకే రిక్రూట్మెంట్ చేయాలి. ఉద్యోగుల బదిలీలు మూడు టీమ్స్ మధ్య జరిగేలా ఉండాలి హౌజ్ కీపింగ్ ను పూర్తి గా అవుట్ సోర్సింగ్ కు ఇవ్వాలి..డాక్టర్స్ పూర్తి వైద్యం పైనే దృష్టి సారించేలా చూడాలి.నిమ్స్ లో బెడ్స్ ఖాళీ లేక పోతే రోగులను సనత్ నగర్ టిమ్స్ కు తరలించాలి.టిమ్స్ లు.ప్రభుత్వ వైద్య కళాశాలల కి అదనం గా కావాల్సిన నిధులని మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధం గా ఉంది

- సీఎం రేవంత్ రెడ్డి

22ఏ దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు

- ఆ భూములకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించండి
- యూఎల్‌సీ భూములపై నివేదిక అందించాలి • మంత్రి పొంగులేటి ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి):
ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 22ఏ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. ఆ దిశగా సర్కారు తీసుకున్న నిర్ణయాలను వేగవంతంగా, క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఫలితంగా దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పిస్తున్నట్లు వివరించారు.22ఏ సమస్యల పరిష్కారానికి ఇటీవల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, రిజిస్ట్రార్లతో మంత్రి పొంగులేటి చర్చించారు.

దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి

22ఏ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా కీలక చర్యలు తీసుకున్నట్లు మంత్రి వివరించారు. జీవో 118, జీవో 76లకు సంబంధించి మెమోలు జారీచేసినట్లు తెలిపారు.

మిగతా 2లో..



ఎన్విడియాకు జెన్సన్ బైబై

ప్రేమవ్యవహారం, గూఢచర్యం ఆరోపణ నేపథ్యంలో సీఈవో జెన్సన్ రాజీనామా

వాషింగ్టన్(జనంసాక్షి):
ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. చైనా గూఢచారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అలిస్ హువాంగ్‌తో వివాహేతర సంబంధమున్నట్లు ఆయన ఇటీవల వెల్లడించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో



భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

హైదరాబాద్ సీపీగా మహేశ్‌భగవత్

సజ్జనర్ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ డీజీగా బదిలీ

ఎస్పీఎఫ్ డీజీగా ఆయనకు అదనపు బాధ్యతలు





- ఏసీబీ డీజీగా చారుసిన్హానియామకం
- లా అండ్ ఆర్డర్ డీజీపీగా అకున్ సబర్వాల్
- 21 మందిని బదిలీ చేస్తూ సీఎస్ ఉత్తర్వులు

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో 21 సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి మహేశ్ మురళీధర్ భగవత్ నియమితులయ్యారు. ఇప్పటివరకు సీపీగా బాధ్యతలు నిర్వహించిన వీసీ సజ్జనర్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డీజీగా బదిలీ చేశారు. దీంతోపాటు ఎస్పీఎఫ్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు జారీ చేశారు.

ఏసీబీ డీజీగా చారుసిన్హా

సౌమ్య మిశ్రాను మహిళా భద్రత, షీటీమ్స్, భరోసా డీజీగా నియమించిన ప్రభుత్వం, అదనంగా డీజీపీ ఆర్గనైజేషన్, లీగల్ బాధ్యతలను అప్పగించింది. స్వాతిలక్రాను జైళ్ల శాఖ డీజీపీగా బదిలీ చేసి, హోంగార్డ్స్ అదనపు బాధ్యతలు అప్పగించారు. చారు సిన్హాకు ఏసీబీ డీజీగా నియామకంతోపాటు సీఐడీ డీజీ బాధ్యతలు అప్పగించింది. అనిల్‌కుమార్‌ను తెలంగాణ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. ఇప్పటి వరకు ఆర్టీసీ బాధ్యతలు చూసిన వై.నాగిరెడ్డిని పౌరసరఫరాల కమిషనర్‌గా నియమించింది. సంజయ్‌కుమార్ జైన్‌కు డీజీపీ ట్రైనింగ్ అదనపు

మిగతా 2లో..

కల్పిత కథలకు చెక్‌పెట్టారు

ఇప్పుడైనా నిజాలు తెలుసుకున్నారు..

తన గురించి తాను చెప్పుకొనే హక్కు మా అమ్మకు ఉంది : ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ తన తల్లి సోనియా గాంధీ ఇటీవల విడుదల చేసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'ను గట్టిగా సమర్థించారు. తన గురించి తాను చెప్పుకొనే హక్కు ఆమెకు ఉందని అన్నారు. భాజపా, ఆర్ఎస్ఎస్‌లు గత కొన్నేళ్లుగా సోనియా గాంధీపై అబద్ధాలు ప్రచారం చేస్తూ.. కల్పిత కథలు అల్లాయని మండిపడ్డారు. ఇప్పుడు వారంతా ఆ పుస్తకాన్ని చదువుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. వయనాడ్ పర్యటనకు వెళ్లిన ప్రియాంక

మిగతా 2లో..

నాగర్‌కర్నూల్ ఇరిగేషన్ డీఈఈకి

రూ.కోట్లలో అక్రమ ఆస్తులు



- ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలతో ఏసీబీ సోదాలు
- ఇరిగేషన్ కార్యాలయంతోపాటు, బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో తనిఖీలు



నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో (జనంసాక్షి):
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్, క్యాడ్ శాఖ కార్యాలయంలో గురువారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు విస్తృత స్థాయిలో సోదాలు నిర్వహించారు. ఇరిగేషన్, క్యాడ్ శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ)గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ గౌడ్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు.జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్న డీఈఈ సత్యనారాయణ గౌడ్ ఛాంబర్‌తో పాటు కార్యాలయంలోని పలు విభాగాల్లో ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఆయనకు సంబంధించిన ఆస్తులు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వ్యయాలకు సంబంధించిన వివరాలను పరిశీలించినట్లు సమాచారం సత్యనారాయణ గౌడ్‌కు సంబంధించిన

మిగతా 2లో..



తమిళనాడులో భారీ చోరీ

జ్యువెలరీ షాప్ నుంచి రూ. 25కోట్ల విలువైన 16 కిలోల బంగారు ఆభరణాలు,వజ్రాలు మాయం

2లో



రూ.7కోట్లు ఇవ్వండి.. లేకుంటే చంపేస్తాం

కేజ్రీవాల్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు



మొన్న అదృశ్యమై.. నిన్న విగతజీవులుగా మారి..

- అడవిలో బుల్లెట్ గాయాలతో అనుమానాస్పద స్థితిలో పోలీసుల మృతదేహాలు..
- ఆయుధాలు మిస్సింగ్..!
- కిశ్త్వాడ్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఘటన

శ్రీనగర్(జనంసాక్షి):జమ్మూకశ్మీర్‌లో ఇద్దరు స్పెషల్ పోలీసు ఆఫీసర్లు అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపింది. కిశ్త్వాడ్ జిల్లాలో నవంబరు 11 విధులు నిర్వర్తిస్తూ అదృశ్యమైన వీరు.. గురువారం ఉదయం అటవీ ప్రాంతంలో విగతజీవులుగా కన్పించారు. వారి శరీరంపై బుల్లెట్ గాయాలున్నట్లు

మిగతా 2లో..

మహిళా రిజర్వేషన్ బిల్లుకు

కేంద్రం కసరత్తు


మెజారిటీ సాధించేందుకు ఎన్డీయే సర్కారు మల్లగుల్లాలు

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు రంగం సిద్ధం!

లోక్‌సభ సీట్ల పెంపు బిల్లు ఆమోదంపై కేంద్రం ధీమా

న్యూఢిల్లీ(జనంసాక్షి):
పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందేందుకు కసరత్తు చేస్తున్నట్లు

మిగతా 2లో..





తూచ్..ఇరాన్‌తో ఒప్పందం లేదు

మాట మార్చిన ట్రంప్

దీనిని ముగిసిన కథగా అభివర్ణించిన అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్(జనంసాక్షి):
ఇరాన్‌తో ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట మార్చారు. ఆ దేశంతో ఒప్పందం కుదుర్చుకునే అవకాశమే లేదన్నారు. దీనిని ముగిసిన కథగా అభివర్ణించారు. టెహ్రాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవాల్సిన అవసరం అమెరికాకు లేదన్నారు. ఇప్పటికే కీలకమైన హర్మూజ్ జలసంధిపై పట్టు సాధించామని, ఆ దేశానికి చెందిన వందల బిలియన్ల డాలర్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.మరోవైపు డెమోక్రాట్ల పాలనలో ఉన్న ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో అవినీతి జరుగుతోందని, దీనిపై ఓ కన్నేసి ఉంచాలని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఆదేశించారు. మిన్నెసోటా, కాలిఫోర్నియా, ఇల్లినోయా.. తదితర రాష్ట్రాల్లోనూ అవినీతి ఎక్కువగా ఉందని ట్రంప్ అన్నారు. డెమోక్రాట్ల రక్తంలోనే అవినీతి ఉందని విమర్శించారు. డెమోక్రటిక్ పార్టీ పాలిత రాష్ట్రాల్లో ప్రతినెలా బిలియన్ డాలర్ల మేర అవినీతి జరుగుతోందని, దానిని అరికడితే.. దేశ బడ్జెట్‌ను సమతుల్యం చేయడానికి అవకాశం ఏర్పడుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు.

భూగర్భంలో 'మిసైల్ సిటీ'

అమెరికా, ఇజ్రాయెల్‌లతో ముప్పు వేళ ఇరాన్ ఆయుధ సంపత్తికి సంబంధించి కీలక విషయం బహిర్గతం

2లో


మీడియాతో నాది సుదీర్ఘ అనుబంధం

ఈ రంగానికి ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ లేదు

దేశ విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ(జనంసాక్షి):
దేశ విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మీడియా మరింత కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. వివిధ రంగాల్లో భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రజలకు వివరించాలని సూచించారు. ఇప్పటికే ఈ దిశగా చాలా పని జరుగుతోందని అన్నారు. భారత్ తప్పకుండా అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. గురువారం భాజపా ప్రధాన కార్యాలయంలో పాత్రికేయుల కోసం నిర్వహించిన దీపావళి మిలన్ కార్యక్రమంలో



మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
13.11.2026

శాంతియుత నిరసనలపై క్రిమినల్ విచారణ సరికాదు

గుర్రైంది. అధ్వానమైన రహదారి కారణంగా ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, కాంట్రాక్టర్‌తోపాటు సంబంధిత ప్రభుత్వ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానికులు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన నిష్కర్ష్ నిమ్‌గాడేపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆందోళనకారులు చట్టవిరుద్ధంగా రోడ్డుపై గుమిగూడి, రహదారిని దిగ్బంధించారని పోలీసులు అభియోగాలు మోపారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌తోపాటు ఛార్జిషీట్‌ను కొట్టివేయాలని కోరుతూ నిష్కర్ష్ హైకోర్టును ఆశ్రయించాడు. విచారించిన బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్.. అతడిపై ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

మీడియాతో నాది సుదీర్ఘ అనుబంధం

మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రస్తావించారు. దేశంలో పేదరిక నిర్మూలన దిశగా తమ ప్రభుత్వం కీలక పురోగతి సాధించిందని ప్రధాని మోదీ అన్నారు. గతంలో పేదరికాన్ని తొలగిస్తామంటూ నినాదాలు మాత్రమే వినిపించేవని, తమ ప్రభుత్వం పేదరికాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం, గత 12 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరిక రేఖకు దిగువ నుంచి బయటకు వచ్చారని వెల్లడించారు. 'గరీబీ హటావో' అంటూ గతంలో నినాదాలు ఇచ్చేవారని, కానీ తమ ప్రభుత్వం పేదరిక నిర్మూలన దిశగా పనిచేసిందని అన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా ఈ పురోగతి సాధ్యమైందని వివరించారు. మరోవైపు మీడియాతో తనకు చాలా కాలంగా అనుబంధం ఉందని మోదీ గుర్తుచేసుకున్నారు. పండుగ సమయంలో కుటుంబ సభ్యులతో గడిపేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపుతారని, అయినప్పటికీ నిరంతరం బ్రేకింగ్ న్యూస్ కోసం పనిచేసే పాత్రికేయులు ఈ కార్యక్రమానికి సమయం కేటాయించడం అభినందనీయమని అన్నారు. పత్రికా ప్రకటనల కాలం నుంచి ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వరకు మీడియా రంగంలో వచ్చిన మార్పులను తాను దగ్గరగా చూశానని పేర్కొన్నారు. అలాగే ఒకప్పుడు కార్యక్రమాల్లో కుర్చీలు సర్దడం, అతిథులను చూసుకోవడం వంటి పనులు చేసిన రోజులను గుర్తుచేసుకున్నారు. 1990లో దేశవ్యాప్తంగా రెండు ప్రధాన యాత్రల బాధ్యతలను తనకు అప్పగించారని మోదీ తెలిపారు. అప్పట్లో ఒక పత్రికా ప్రకటన పంపాలన్నా ఫ్యాక్స్ మెషీన్ కోసం వెతకాల్సి వచ్చేదని అన్నారు. ఢిల్లీకి మారిన తర్వాత కూడా ఆ బాధ్యతలు కొనసాగాయని చెప్పారు.
అంతే కాకుండా ఆ రోజుల్లో జరిగే దీపావళి మిలన్ కార్యక్రమాల్లో కుర్చీలు సర్దడం, అతిథులకు ఏర్పాట్లు చేయడం తన పని అని మోదీ వివరించారు. అప్పట్లో కెమెరాలు తక్కువగా ఉన్నప్పటికీ మీడియా ప్రతినిధులతో తన అనుబంధం బలంగా ఉండేదన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా తన నియామకం గురించి పార్టీలోని చాలామందికంటే ముందే మీడియాకు తెలిసిందని మోదీ వెల్లడించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్నట్లు తెలుసుకున్న పాత్రికేయుల బృందం ఒకసారి తన గదికి వచ్చి స్వీట్లు ఇవ్వాలని అడిగిందని గుర్తుచేసుకున్నారు. అప్పట్లో మహిళా పాత్రికేయుల బృందం తన వద్దకు వచ్చి, 'మీరు గుజరాత్‌కు వెళ్తున్నారు, ముఖ్యమంత్రి కాబోతున్నారు. మాకు స్వీట్లు ఇవ్వండి' అని అడిగినట్లు చెప్పారు. మీడియాతో తనకున్న అనుబంధం నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, అప్పటి అనుభవాలు ఇప్పటికీ ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ అధిపతిగా తనకు 25 ఏళ్లు పూర్తయ్యాయని కూడా గుర్తుచేశారు.

మొన్న అదృశ్యమై.. నిన్న విగతజీవులుగా మారి..

అధికారులు వెల్లడించారు. స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్‌నకు చెందిన బాబీ చాంద్ (57), రశ్‌పాల్ కుమార్ (45).. బుధవారం మధ్యాహ్నం తమ క్యాంప్ నుంచి ధర్నా-మర్వా ప్రాంతంలోని ఆర్మీ పోస్ట్‌కు బయల్దేరారు. మార్గమధ్యంలో మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో వీరికి దచన్ అటవీ ప్రాంతం నుంచి శబ్దాలు వినిపించాయి. దీంతో అటుగా వెళ్లిన వీరిద్దరూ మళ్లీ తిరిగిరాలేదు. అదే సమయంలో మొబైల్ నెట్‌వర్క్ సర్వీసులు కూడా పనిచేయకపోవడం గమనార్హం. వీరు అదృశ్యమైనట్లు నిర్ధరించుకున్న ఆర్మీ బలగాలు అటవీ ప్రాంతంలో ముమ్మర గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలోనే గురువారం ఉదయం వీరి మృతదేహాలను భద్రతా సిబ్బంది గుర్తించారు. ఘటనాస్థలంలో పోలీసు ఆఫీసర్ల సర్వీసు తుపాకులు కన్పించలేదని అధికారులు వెల్లడించారు. దీంతో ఉగ్రకోణం ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఉగ్రవాదులు వీరిని కిడ్నాప్ చేసి హత్య చేసి ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నిర్బంధ తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో నిన్న సీఆర్పీఎఫ్ శిబిరంపై ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మోటార్ సైకిళ్లపై వచ్చిన ఇద్దరు ఉగ్రవాదులు చెక్‌పోస్ట్ వద్ద ఉన్న సీఆర్పీఎఫ్ సిబ్బందిపై కాల్పులు జరిపి పరారయ్యారు. దాదాపు అదే సమయంలో కిశ్త్‌వాడ్‌లో పోలీసులు అదృశ్యమై ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. ఈ రెండు ఘటనలకు ఏదైనా సంబంధం ఉందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తమిళనాడులో భారీ చోరీ

ప్యారీస్ (తమిళనాడు): తమిళనాడు మదురైలోని ఓ జ్యువెలరీ షాప్‌లో భారీ చోరీ జరిగింది. కలవాసల్ బైపాస్ రోడ్డులో కొత్తగా ప్రారంభమైన 'తనిష్క్' షోరూమ్‌లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. సుమారు 16 కిలోల బంగారం, వజ్రాభరణాలను దోచుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.25 కోట్ల వరకు ఉంటుందని అంచనా. పది రోజుల క్రితమే ఈ షోరూమ్ కార్యకలాపాలు మొదలైనప్పటికీ.. అధికారికంగా ప్రారంభించలేదని తెలిసింది. ఇంటీరియర్ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే నవంబర్ 10న రాత్రి సిబ్బంది యథావిధిగా దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయారు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా.. వెనుక వైపు తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. బంగారం, వజ్రాభరణాలు ఉన్న పెట్టెలు మాయమైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన ఎస్ఎస్ కాలనీ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన అధికారులు భవనం వెనుకభాగం నుంచి ఓ దుండగుడు లోనికి ప్రవేశించినట్లు గుర్తించారు. వేలిముద్రలు సహా ఇతర ఆధారాలను సేకరించడంతోపాటు జాగిలాలతో గాలింపు చేపట్టారు. దుకాణంలో నిల్వ ఉన్న మొత్తం బంగారంలో సుమారు 30శాతం చోరీకి గురైనట్లు మదురై సిటీ పోలీస్ కమిషనర్ రాజేంద్రన్ వెల్లడించారు.

రూ.7కోట్లు ఇవ్వండి.. లేకుంటే చంపేస్తాం..

కేజ్రీవాల్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను చంపేస్తామంటూ బెదిరింపులు రావడం కలకలం రేపింది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా పేరుతో ఈ బెదిరింపు ఫోన్ కాల్ రావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యుడినంటూ ఇటీవల తనకు ఓ వ్యక్తి ఫోన్ చేశారని ఢిల్లీలోని తిలక్ నగర్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.7కోట్లు ఇవ్వాలని.. లేదంటే కేజ్రీవాల్, ఆయన కుమార్తెను హత్య చేస్తానంటూ ఆ వ్యక్తి బెదిరించినట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం వాట్సప్ సందేశాలు కూడా పంపినట్లు తెలిపారు. కేజ్రీవాల్, ఆయన కుటుంబానికి భద్రత కల్పించాలని కోరారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎమ్మెల్యే కాల్ రికార్డులు, నిందితుడి ఫోన్ లొకేషన్‌ను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు కాల్పులకు పాల్పడిన ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత పలువురు హిందీ నటులకు కూడా ఈ ముఠా నుంచి బెదిరింపులు వచ్చాయి. బాలీవుడ్ నటుడు తుషార్ కపూర్‌కు ఇటీవల ఆ గ్యాంగ్ సభ్యుడు 'హ్యారీ బాక్సర్' పేరిట ఓ వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. తమకు రూ.5 కోట్లు ఇవ్వాలని, లేదంటే హత్య చేస్తామని అతడు బెదిరింపులకు దిగాడు.



డిసెంబర్ నాటికి 'ఉస్మానియా' పూర్తి కావాలి

సనత్ నగర్, అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌ల్లో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ఏకీకృత విధానం పాటించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా మూడు టిమ్స్ మధ్య వైద్యులు, సిబ్బంది బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. ఆసుపత్రుల నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిని ఔట్ సోర్సింగ్ విధానంలో చేపట్టాలని సీఎం సూచించారు. టిమ్స్ ల పర్యవేక్షణకు గ్రూప్-1 అధికారులను నియమిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హౌస్ కీపింగ్ సిబ్బందిపై పర్యవేక్షణకు విశ్రాంత సైనికాధికారులను నియమిస్తామన్నారు. నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలకు వేరే సిబ్బంది ఉంటే, వైద్యులు పూర్తిగా వైద్య సేవలపైనే దృష్టి సారించే అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. నిమ్స్ లో శస్త్రచికిత్సలకు సమయం ఎక్కువ తీసుకుంటున్నందున సనత్ నగర్ టిమ్స్‌ను పూర్తి స్థాయిలో వినియోగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిమ్స్‌లో బెడ్స్ లేకపోయినా, శస్త్రచికిత్సలకు ఆలస్యమైనా సనత్ నగర్ టిమ్స్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ విషయంలో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నిమ్స్, టిమ్స్ డైరెక్టర్లు నిత్యం సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. టిమ్స్ లో వైద్యుల నియామకం పూర్తయ్యే వరకు బయటి నుంచి వైద్యులను నియమించుకోవాలని, అందుకు అవసరమయ్యే మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. తాము అధికారంలోకి వచ్చాక కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్నమరో 79 డయాలసిస్ సెంటర్ల పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. టిమ్స్ తో పాటు బోధన కళాశాలలు, నర్సింగ్ కళాశాలల పనులు, పరికరాల కొనుగోలు ప్రక్రియ ఏకకాలంలో పూర్తవ్వాలని, అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది హాజరైన సమయం, విధుల నుంచి వెళ్లే సమయాన్ని నమోదు చేయాలని, హాజరు విషయంలో బయోమెట్రిక్ విధానం అమలయ్యేలా చూడాలని, ఏఐతో పర్యవేక్షణ చేయాలని సీఎం శాఖాధికారులను ఆదేశించారు. మూడేళ్లలోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్ల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచిన విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్ల (ఓపీ) సంఖ్య 7 కోట్ల నుంచి సుమారు 9 కోట్లకు పెరగడం, ఇన్ పేషెంట్ల (ఐపీ) సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు పెరగడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి గతంలో సగటున 3.9 శాతం కేటాయించగా, గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం నిధులు కేటాయిస్తున్న విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు.

ఎన్విడియాకు జెన్సన్ బైబై

సంస్థకు చెందిన మహిళతోనూ సంబంధాలున్నాయని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో జెన్సన్ పదవి నుంచి వైదొలగాలనే డిమాండ్లు మొదలయ్యాయి. తాజా పరిణామాలు జాతీయ భద్రతపై ఆందోళనలు రేకెత్తించడంతో రాజీనామా చేస్తున్నట్లు జెన్సన్ ప్రకటించారు. జెన్సన్ రాజీనామా నేపథ్యంలో తాత్కాలిక సీఈవోగా కొలెట్ క్రెస్‌కు బాధ్యతలు అప్పగించినట్లు ఎన్విడియా ప్రకటించింది. ప్రస్తుతం ఆమె సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా ఉన్నట్లు తెలిపింది. తాజా పరిణామాలతో ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థల్లో ఒకటైన ఎన్విడియా షేర్లు ప్రీమార్కెట్ ట్రేడింగ్‌లో 10 శాతం పతనం కావడం గమనార్హం.

కల్పిత కథలకు చెక్‌పెట్టారు

గాంధీ.. అక్కడ మీడియాతో మాట్లాడారు. విదేశీ మహిళ అంటూ భాజపా, ఆర్ఎస్ఎస్‌లు నిరంతరం విమర్శిస్తున్నా సోనియా మాత్రం ఇప్పటి వరకూ నోరెత్తలేదన్న అంశాన్ని గుర్తుచేశారు. "భారత్‌లో నా తల్లి జీవితం గురించి భాజపా, ఆర్ఎస్ఎస్ నోటికొచ్చినట్లు మాట్లాడాయి. అబద్ధాలు ప్రచారం చేస్తూ.. కల్పిత కథనాలు రాశారు. అయినా, ఆమె ఇన్నాళ్లూ మౌనంగా ఉండిపోయారు. ఇప్పుడు వాస్తవాలను పుస్తకం రూపంలో ఆమే స్వయంగా చెప్పారు. అందులో తప్పేముంది. అది ఆమె హక్కు. ఇన్నాళ్లూ భాజపా అబద్ధాలు చెబితే.. ఇప్పుడు నిజమేంటో ప్రజల ముందుకు నా తల్లి తీసుకొచ్చారు." అని ప్రియాంక గాంధీ అన్నారు.

నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన రేవంత్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):కరోనా నిబంధనల ఉల్లంఘన కేసులో సీఎం రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజరయ్యారు. నాగార్జునసాగర్ ఉప ఎన్నికల ప్రచార సమయంలో కరోనా నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనపై కేసు నమోదైంది. ఆ కేసు విచారణలో భాగంగా గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. అప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి.. 2021 ఏప్రిల్ 11న నల్గొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామంలో నిర్వహించిన ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్కులు ధరించకుండా, తగిన జాగ్రత్తలు తీసుకోకుండా కొవిడ్ నిబంధనలు ఉల్లంఘించినట్లు కేసు నమోదైంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) 313 కింద నిందితుల వాంగ్మూలం నమోదు చేసేందుకు న్యాయస్థానం విచారణ చేపట్టింది.

భారీగా ఐపీఎస్‌ల బదిలీలు


బాధ్యతలు ఇచ్చింది. విక్రమ్‌సింగ్ మాన్‌ను గ్రేహౌండ్స్, ఆక్టోపస్ డీజీపీ (ఆపరేషన్స్)గా నియమించింది. స్టీఫెన్ రవీంద్రను తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్‌గా బదిలీ చేసింది. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా ఉన్న జోయల్ డేవిస్‌కు టీజీ-టీమార్స్ (రోడ్ సేఫ్టీ) జాయింట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. శ్రీ బాలాదేవిని టీజీ-టీమార్స్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్)గా నియమించింది.

లా అండ్ ఆర్డర్ డీజీపీగా అకున్ సబర్వాల్

అకున్ సబర్వాల్‌ను అదనపు డీజీపీ లా అండ్ ఆర్డర్‌గా, ఎస్.చంద్రశేఖర్ రెడ్డిని ఏసీబీ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. కార్తికేయను ఐజీపీ మల్టీ జోన్-1గా బదిలీ చేసి, ఐసీసీసీ డైరెక్టర్ అదనపు బాధ్యతలు అప్పగించింది. కె.రమేశ్ నాయుడును రైల్వే ఐజీగా నియమించింది. చందన దీప్తికి జోగులాంబ రేంజ్ డీఐజీ, ఆర్. భాస్కరన్‌కు ఇంటిలిజెన్స్ డీఐజీగా నియమించింది. కె. నారాయణ నాయక్‌కు బాసర్ డిఐజి గా, ఎల్.ఎస్. చౌహాన్‌కు చార్మినార్ డీఐజీతో పాటు కోఆర్డినేషన్ బాధ్యతలు అప్పగించింది. అరవింద్ బాబును హైదరాబాద్ సిటీ డీసీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నాగర్‌కర్నూల్ ఇరిగేషన్ డీఈఈకి రూ.కోట్లలో అక్రమ ఆస్తులు

కార్యాలయం, నివాసాలతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీలుగా అనుమానిస్తున్న వ్యక్తులకు సంబంధించిన నివాసాలు కలిపి మొత్తం పది ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇందులో నాగర్‌కర్నూల్‌లోని ఇరిగేషన్ కార్యాలయం, వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండలం సోలిపూర్ గ్రామంలోని ఆయన స్వగృహం, హైదరాబాద్‌లోని నివాసం కూడా ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులకు సంబంధించిన నివాసాల్లోనూ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, ఆదాయ వ్యయాల వివరాలు, ఇతర కీలక డాక్యుమెంట్లను పరిశీలించినట్లు తెలిసింది. తనిఖీల్లో లభించిన పలు పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గతంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలలో విధులు నిర్వహించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన ఉద్యోగ ప్రస్థానం, ఆదాయ వనరులు, ఆస్తుల వివరాలపై ఏసీబీ అధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. కాగా, నాగర్‌కర్నూల్ ఇరిగేషన్ కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులను మీడియా ప్రతినిధులు వివరణ కోరగా, ఈ తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలను హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు వెల్లడిస్తారని తెలిపారు. ఏకకాలంలో పది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టడం జిల్లా ఇరిగేషన్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. అయితే సోదాలు పూర్తయిన అనంతరం స్వాధీనం చేసుకున్న పత్రాలు, గుర్తించిన ఆస్తుల విలువ, తదుపరి విచారణకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే స్పష్టత రానున్నాయి. సోదాల్లో 50 తులాల బంగారం గుర్తింపు, తుక్కుగూడలో విల్లా ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు మరియు 25 ఎకరాల భూమి, రెండు ఫ్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. ఐదు ఓపెన్ ప్లాట్లు, మూడు కార్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆస్తుల అధికారిక విలువ రూ.6 కోట్లుగా అంచనా వెల్లడించారు. బహిరంగ మార్కెట్లో ఆస్తుల విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది అని అన్నారు.



భూగర్భంలో 'మిసైల్ సిటీ'

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా, ఇజ్రాయెల్‌లతో ముప్పు వేళ ఇరాన్ ఆయుధ సంపత్తికి సంబంధించి కీలక విషయం వెల్లడైంది. ఓ రహస్య ప్రాంతంలో నూతన భూగర్భ క్షిపణి కేంద్రాన్ని టెహ్రాన్ ప్రారంభించింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ నిర్వహణలో ఉన్న ఈ కేంద్రంలో భారీ సంఖ్యలో బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, ఆయుధ సామగ్రి, సైనిక వాహనాలున్నాయి. ఇటీవల కొందరు సీనియర్ సైనిక కమాండర్లు ఇందులో పర్యటిస్తూ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. వీటికి సంబంధించిన దృశ్యాలను ఇరాన్ అధికారిక మీడియా ఇటీవల విడుదల చేసింది. ఇరాన్ సాయుధ బలగాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ అలీ అబ్దుల్లాహీ, ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ఫోర్స్ కమాండర్ మాజిద్ మౌసావీలు ఈ రహస్య సొరంగంలో పర్యటిస్తున్న దృశ్యాలు కనిపించాయి. అయితే, ఆ కేంద్రం ఎక్కడుంది? ఎప్పుడు పర్యటించారనే విషయాలు మాత్రం వెల్లడించలేదు. ఈ సందర్భంగా అబ్దుల్లాహీ మాట్లాడుతూ.. శత్రువు తమపై దాడికి పాల్పడితే ప్రతిస్పందన ఈ ప్రాంతం దాటి ఉంటుందని హెచ్చరించారు. తమవద్ద ఉన్న అత్యాధునిక క్షిపణులు శత్రువులను ఆశ్చర్యానికి గురిచేస్తాయని అన్నారు. భవిష్యత్తులో ఏదైనా ఘర్షణ తలెత్తితే మోహరించేందుకు అదనపు సైనిక సామర్థ్యాలు కూడా తమవద్ద ఉన్నాయని చెప్పారు.

చంద్రుడిపై ఉండి పనిచేయండి

శాశ్వత స్థావరం కోసం

కొత్త వ్యోమగాములకు నాసా పిలుపు

వాషింగ్టన్(జనంసాక్షి):జాబిల్లిపై పరిశోధనలు చేపట్టేందుకు అమెరికా పరిశోధనా సంస్థ నాసా సరికొత్త సన్నాహాలకు సిద్ధమైంది. ఆర్టెమిస్ ప్రోగ్రామ్‌ను తిరిగి ప్రారంభించనుంది. ఇందుకోసం కొత్త వ్యోమగాముల ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఎవరైతే చంద్రుని ఉపరితలంపై ఉంటూ, పని చేయగలరో అలాంటి వారి కోసం ఈ నియామకాలు చేపట్టింది నాసా. మానవుడు భూమిపైన ఎలా నివసిస్తున్నాడో అలానే చంద్రుడిపైన శాశ్వతంగా నివసించేలా చేయడమే ఈ ఆర్టెమిస్ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం. వ్యోమగాములను చంద్రుని దక్షిణ ధ్రువంపైకి తీసుకెళ్లనున్నారు. ఎందుకంటే అక్కడ శాశ్వతంగా ఉండే నీడలో ఎక్కువ నీరు ఉంటుందని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు. ఇక్కడ తాగునీరు, ఆక్సిజన్ దొరకడంతో భవిష్యత్తు పరిశోధనలకు సహాయపడనుంది. స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజన్ ప్రైవేటు కంపెనీలతో కలసి ఈ ప్రోగ్రామ్‌ను చేయబోతున్నారు. ఈ నియామకాలు కేవలం అమెరికా పౌరులకు మాత్రమే. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ లేదా మ్యాథ్స్‌లో మాస్టర్స్ డిగ్రీతో పాటు మూడు సంవత్సరాలు సంబంధిత వృత్తిలో అనుభవం కలవారు అప్లై చేసుకోవచ్చని నాసా సంస్థ తెలిపింది. దరఖాస్తు చేసుకోవడానికి డిసెంబరు 4 చివరి తేదీగా ప్రకటించారు.

22ఏ దరఖాస్తులకు పెండింగ్ పెట్టొద్దు


22ఏ నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. యూఎల్సీ దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యల పరిష్కారం, జీవో 59 అమలు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ మేరకు ఇప్పటిదాకా వచ్చిన దరఖాస్తులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని, ఏ ఒక్క అర్జీ కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని మంత్రి స్పష్టం చేశారు.

యూఎల్సీ భూములపై నివేదిక అందించాలి

22ఏ భూ సమస్యల పరిష్కారంపై ప్రతివారం జిల్లా స్థాయి అధికారులు సమీక్షించాలని మంత్రి పొంగులేటి సూచించారు. ఒకవేళ జిల్లా స్థాయిలో పరిష్కరించడానికి వీలుకాని దరఖాస్తులను ఉన్నతస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలన్నారు. అలాగే అర్బన్? ల్యాండ్ సీలింగ్ (యూఎల్?సీ) భూములకు సంబంధించి వివిధ కోర్టుల తుది తీర్పులు, ప్రభుత్వం తరపున స్పెషల్ లీవ్ పిటిషన్ల దాఖలుతోపాటు ఇతర అంశాలపై వారం రోజుల్లోగా ఉన్నతస్థాయి కమిటీ సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి రెగ్యులరైజేషన్‌పై తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

నిలిచిన యూఎల్సీ రిజిస్ట్రేషన్లు

యూఎల్సీ, అసైన్డ్ భూములు, వక్ఫ్ ఆస్తులు, భూదాన్, దేవదాయ తదితర భూములుగా ప్రైవేట్ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి, తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 24న ప్రత్యేక మెమోరాండం 47934ను జారీ చేసింది. కానీ కొత్తగా యూఎల్సీ పరిధిలో ఉన్నట్లు గుర్తించిన ఆస్తుల రిజిస్ట్రేషన్లు ప్రస్తుతం ఆగిపోతున్నాయి. వివిధ మార్గాల ద్వారా ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన ఆస్తులు, వేలం తర్వాత లేఅవుట్‌లుగా మారినవి, హెచ్ఎండీఏ లేఅవుట్‌లు చేసి అమ్మిన ప్లాట్లు, పలు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా క్రమబద్ధీకరణ అయిన స్థలాలు అలాగే



ఒకే సర్వే నంబరుతో ప్రభుత్వ, ప్రైవేట్ భూములు రెండూ ఉన్న వాటిని 22ఏ నుంచి తొలగించకపోవడంతో ఆయా భూముల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్రం కసరత్తు

సమాచారం. ఈ బిల్లు కచ్చితంగా 15 నుంచి 18 ఓట్ల మెజారిటీతో నెగ్గుతుందని ప్రభుత్వ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. లోక్‌సభ స్థానాల పెంపునకు రాజ్యాంగ సవరణ జరిగి తీరుతుందనే విశ్వాసాన్ని వెలిబుచ్చుతున్నాయి.

రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం లభించాలంటే

అయితే, రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం లభించాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ కావాలి. లోక్‌సభలో 361 ఓట్లు అవసరం. ప్రస్తుతం 543 స్థానాలున్న లోక్‌సభలో మూడు ఖాళీలు ఉన్నాయి. తమకు అవసరమైన సంఖ్యాబలం ఉందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కానీ ప్రత్యేక సమావేశాల తేదీలను మాత్రం వెల్లడించలేదు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా లోక్‌సభ స్థానాలను ప్రస్తుతమున్న 543 నుంచి గరిష్ఠంగా 850కి పెంచాలని ఈ సవరణలో ప్రతిపాదించారు. తద్వారా పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు మార్గం సుగమం కానుంది. వాస్తవానికి ఈ ఏడాది ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల సందర్భంగా జరిగిన ప్రత్యేక భేటీలో ఇలాంటి రాజ్యాంగ సవరణ బిల్లుకు తగినన్ని ఓట్లు రాకపోవడం వల్ల అది వీగిపోయింది. ఇప్పుడు తాజా ప్రతిపాదనలతో కేంద్రం ముందుకు రానుంది.

ప్రొరోగ్ కాకుండా కొనసాగుతుండటం ఇదే తొలిసారి

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడినప్పటికీ, కానీ ఇప్పటివరకు అధికారికంగా ముగియలేదు (ప్రొరోగ్ చేయలేదు). ఇలా సమావేశాలు ప్రొరోగ్ కాకుండా 91 రోజుల పాటు కొనసాగుతుండటం ఇదే తొలిసారి. దీనివల్ల పార్లమెంటును మళ్లీ సమావేశపరిచే అవకాశం ఉంది. 2008లో ఉన్న 87 రోజుల రికార్డును ఇది అధిగమించింది. ఒకవేళ కొత్త సెషన్ ప్రారంభించాలంటే 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి. అదే కొనసాగుతున్న సెషన్‌లోనే అదనపు సిట్టింగ్ ఏర్పాటు చేయాలంటే రెండు రోజుల నోటీసు ఇస్తే సరిపోతుంది. అందుకే రాజ్యాంగ సవరణ బిల్లు కోసం వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం ఇంకా ముగించలేదనే వాదన వినిపిస్తోంది. వర్షాకాల సమావేశాలను అధికారికంగా ముగించకుండా కొనసాగించడం, ప్రతిపాదిత సవరణను పరిశీలించేందుకు అదనపు లేదా ప్రత్యేక సమావేశాలను నిర్వహించవచ్చనే ఊహాగానాలకు దారితీసింది.

దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను తగ్గించేందుకు కేంద్రం కీలక నిర్ణయం


2029 పార్లమెంటు ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. అయితే డీలిమిటేషన్ వల్ల తమ ప్రాతినిధ్యం తగ్గుతుందన్న దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను తగ్గించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అన్ని రాష్ట్రాల్లోనూ లోక్‌సభ స్థానాలను 50 శాతం మేర పెంచాలని తాజా ముసాయిదాలో ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలన్నీ పరిశీలన దశలోనే ఉన్నాయని, ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ఆ విషయంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు!

గతంలో ఆమోదించిన బిల్లుకు కొనసాగింపుగా, 1971 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుతం ఉన్న రాష్ట్రాల వారి సీట్ల నిష్పత్తులను యథాతథంగా ఉంచాలని కొత్త ముసాయిదా ప్రతిపాదించినట్లు తెలిస్తోంది. అయితే, కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న ముసాయిదాల్లో ఇది ఒకటి మాత్రమేనని, దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఒక సభను నిరవధికంగా వాయిదా వేసిన తర్వాత, దానిని తిరిగి వాయిదా వేయడానికి రాజ్యాంగం ఎటువంటి నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించలేదని వర్గాలు పేర్కొన్నాయి. అలాగే, సభను అధికారికంగా వాయిదా వేయకుండా, సుదీర్ఘ కాలం పాటు సమావేశాలు కొనసాగించడం అనేది, ఎలాంటి రాజ్యాంగపరమైన లేదా విధానపరమైన ఉల్లంఘన కాదని తెలిపాయి.

'ప్రాజెక్ట్ మత్స్య' ట్రయల్స్ సక్సెస్..

న్యూఢిల్లీ(జనంసాక్షి):సాగర గర్భంలోని అంతుచిక్కని రహస్యాలను ఛేదించడంతో పాటు అత్యంత అరుదైన ఖనిజ వనరులను వెలుగులోకి తెచ్చేందుకు భారత భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ చేపట్టిన సముద్రయాన్ ప్రాజెక్ట్ కీలక ఘట్టం పూర్తి చేసుకుంది. అత్యంత కీలకమైన మత్స్య సబ్‌మెర్సిబుల్ వాహన ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి. ఇస్రో సహకారంతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ ఈ ప్రత్యేక సబ్‌మెర్సిబుల్ వాహనాన్ని రూపొందించింది. ఇది ముగ్గురు మనుషులను సముద్రం లోతుల్లోకి తీసుకెళ్లే సామర్థ్యం ఉన్న మానవ సహిత వాహనం అయినప్పటికీ, భద్రతా ప్రమాణాల దృష్ట్యా ప్రస్తుతానికి మానవ రహితంగానే పరీక్షించారు.



జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

రాష్ట్రవ్యాప్తంగా నూతన చేయూత పింఛన్లు

- మంజూరు పత్రాల పంపిణీ ప్రారంభం
- ఏకకాలంలో 4.5 లక్షల మందికి కొత్తగా పింఛన్లు
- నవంబర్ 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పింఛన్ సొమ్ము చెల్లింపు



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఆయా నియోజక వర్గాల్లో పండుగ వాతావరణంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్నారు. కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు, వారి కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పంపిణీ కార్యక్రమాలు సజావుగా జరిగేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ పకడ్బందీ ఏర్పాట్లు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో మరో 4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 1,23,625 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయగా, తాజాగా మరో 4.5 లక్షల మందికి మంజూరు చేసింది. దీంతో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొత్తగా పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య మొత్తం 5,73,625కు చేరింది. ఈ నెల 18 వరకు అన్ని నియోజక వర్గాల్లో మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న నూతన లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును చెల్లించనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియను చేపట్టింది.

ప్రభుత్వ ఆదాయం స్వాహా ఆరోపణలు

- వార్డు అధికారిపై సస్పెన్షన్ వేటు
- రూ.1,13,452 ఆస్తి పన్ను మొత్తాన్ని మున్సిపల్ ఖజానాలో జమ చేయకపోవడంపై చర్యలు

వరంగల్ ఈస్ట్ నవంబర్ 12 (జనంసాక్షి) : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వసూలు చేసిన ఆస్తి పన్ను మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాలో జమ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 43వ డివిజన్, కాశిబుగ్గ సర్కిల్-1 వార్డు అధికారి ఎం.ఏ. గఫార్ ఖాన్‌ను సస్పెండ్ చేస్తూ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఉత్తర్వులు జారీ చేశారు.సదరు వార్డ్ ఆఫీసర్ వసూలు చేసిన రూ.1,13,452 ఆస్తి పన్ను మొత్తాన్ని మున్సిపల్ ఖజానాలో జమ చేయకపోవడాన్ని తీవ్ర ఆర్థిక క్రమశిక్షణా ఉల్లంఘనగా పరిగణిస్తూ, సమగ్ర విచారణ నిమిత్తం ఈ చర్యలు తీసుకున్నారు.సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తుందని, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత అధికారి హనుమకొండలోనే ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉండాలని, అనుమతి లేకుండా కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించారు. అలాగే తన వద్ద ఉన్న మున్సిపల్ రికార్డులు, పన్ను వసూలు రిజిస్టర్లు, రశీదు పుస్తకాలు, నగదు తదితరాలను సంబంధిత అధికారులకు అప్పగించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదాయం విషయంలో ఎలాంటి అవకతవకలు, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, ప్రజాధనం పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందేనని ఈ చర్య ద్వారా ప్రత్యేక అధికారి స్పష్టం చేసారు.

ఆర్థిక సంస్థల బాధ్యత పరిమితం కావొద్దు

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్



హైదరాబాద్ (జనంసాక్షి) : ఆర్థిక సంస్థల బాధ్యత పరిమితం కావొద్దని టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. దేశ వ్యాప్తంగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు ఎన్‌బీఎఫ్‌సీలు, ఫిన్‌టెక్ కంపెనీల చెల్లింపుల వ్యవస్థ లపై ఇటీవల జరుగుతున్న ఏఐ ఆధారిత సైబర్ దాడుల నేపథ్యంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అప్రమత్తమైంది. గురువారం హైదరాబా ద్‌లోని టీజీసీఎస్‌బీ కార్యాలయంలో ఎన్‌బీఎఫ్‌సీలు, ఫిన్‌టెక్ సంస్థలు, బ్యాంకు ప్రతినిధులతో పాటు టెలికమ్యూనికేషన్స్ విభాగం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ.. మోసం జరిగిన తర్వాత ఫిర్యాదు చేయడానికే ఆర్థిక సంస్థల బాధ్యత పరిమితం కాకూడదని స్పష్టం చేశారు. మోసపూరిత లావాదేవీలను మూలంలోనే నిరోధించడం, అనుమానాస్పద కార్యక లాపాలను రియల్ టైమ్‌లో గుర్తించడం, మ్యూల్ ఖాతాల ద్వారా నిధుల తరలింపును అడ్డుకోవడమే ప్రధాన కర్తవ్యం కావాలని తెలిపారు. ఎన్‌బీఎఫ్‌సీలు, ఫిన్‌టెక్ సంస్థలు క్రమం తప్పకుండా వీఏపీటీ నిర్వహించాలని, చెల్లింపు, రుణ పంపిణీ ఏపీఐలను సురక్షితం చేయాలని సూచించారు. సైబర్ దాడిని గుర్తించిన వెంటనే ఆటోమేటెడ్ రుణ పంపిణీ సాఫ్ట్‌వేర్‌ను నిలిపివేసి మాన్యువల్ విధానానికి మారా లని, ఖాతాలను ఫ్రీజ్ చేసి క్యూలో ఉన్న ఏపీఐ కాల్స్‌ను క్లియర్ చేయాలని బ్యాంకులను కోరాలని తెలిపారు. కీలక పేమెంట్ ఏపీఐలను తక్షణమే సమీక్షించడంతో పాటు ప్రతి ఖాతాకు రోజువారీ లావాదేవీల సంఖ్యపై పరిమితి విధించాలని, టీజీసీఎస్‌బీతో సమన్వయానికి 24ఞ7 నోడల్ అధికారిని నియమించాలని ఆదేశించారు. సైబర్ ఘటనలను వీలైనంత త్వరగా ఆర్బీఐ దక్ష్ పోర్టల్ ద్వారా ఆర్‌బీఐకి నివేదించాలని డైరెక్టర్ శిఖా గోయల్ స్పష్టం చేశారు. ఈ సమావేశం లో ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ 14సీ ప్రతినిధి రుషి మెహతా వర్చువల్‌గా పాల్గొని, పేఅవుట్ వ్యవస్థలు, ఏపీఐ దుర్వినియోగంపై అధికారులకు వివరించారు. సైబర్ భద్రత బలహీనంగా ఉండే చిన్న ఎన్‌బీఎఫ్‌సీలను నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారని, 10 నుంచి 12 రోజుల పాటు సంస్థల అంతర్గత వ్యవస్థలను అధ్యయనం చేసి, వైట్‌లిస్ట్ చేసిన ఐడీలు, పేమెంట్ ఏపీఐ క్రెడెన్షియల్స్, కోడ్‌లోని లోపాలను గుర్తిస్తున్నారని తెలిపారు.

తెల్లబంగారంపై దళారుల కన్ను!

- తూకాల్లోనూ వ్యాపారుల చేతివాటం
- తెరుచుకోని సీసీఐ కొనుగోలు కేంద్రాలు
- సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభం కోసం రైతుల ఎదురుచూపులు



తెరుచుకోని సీసీఐ కొనుగోలు కేంద్రాలు



సంగారెడ్డి, నవంబరు 12 (జనం సాక్షి): తెల్లబంగారంగా పేరొందిన పత్తి పంట ఈ ఏడాది సంగారెడ్డి జిల్లా రైతులకు కన్నీళ్లు మిగిలిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో దిగుబడి తగ్గి ఇప్పటికే నష్టాల్లో కూరుకుపోయిన రైతులకు ధరల పతనం మరింత భారంగా మారింది. ప్రారంభంలో క్వింటాలు పత్తికి రూ.9 వేలకుపైగా పలికిన ధర ప్రస్తుతం రూ.8,600కు పడిపోయింది. కేంద్ర ప్రభుత్వం ఈ సీజన్‌కు ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోళ్లు జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజుల క్రితం వరకు ప్రైవేటు వ్యాపారులు రైతుల ఇళ్ల వద్దకే వచ్చి రూ.9 వేలకుపైగా చెల్లించి పత్తి కొనుగోలు చేశారు. అయితే పంట దిగుబడులు మార్కెట్‌కు పెరుగుతుండటంతో వ్యాపారులు ధరలను తగ్గిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రాకపోవడంతో ప్రైవేటు వ్యాపారుల చెప్పిన ధరకే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ధరలు మరింత పడిపోతాయనే భయంతో కొందరు రైతులు పత్తిని నిల్వ చేసుకుంటుండగా, మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో అమ్ముకుంటున్నారు.

జిల్లాలో అక్టోబరు 22 నుంచే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనట్లు అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు మొదలుకాలేదని రైతులు వాపోతున్నారు. పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 లోపు ఉండాలంటూ నిబంధనలు విధించి కొనుగోళ్లకు కొర్రీలు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. కేంద్రాలు అందుబాటులోకి వచ్చి ఉంటే ప్రైవేటు వ్యాపారుల దోపిడీ నుంచి కొంతైనా ఉపశమనం లభించేదని అభిప్రాయపడుతున్నారు.

తూకాల్లోనూ చేతివాటం

ప్రైవేటు వ్యాపారులు ధరల తగ్గింపుతోపాటు తూకాల్లోనూ మోసాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ధ్రువీకరణ లేని తూకపు యంత్రాలు, సరైన ముద్రలు లేని బాట్లతో పత్తిని తూకం వేస్తున్నారని రైతులు చెబుతున్నారు. క్వింటాలుకు తరుగు పేరుతో 3 నుంచి 4 కిలోల వరకు కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30 కిలోలకు మించని పత్తి బస్తాలకు అదనపు బరువు కలిపి తూకం వేస్తున్నారని ఆరోపిస్తున్నారు.మరోవైపు వ్యాపారులు, కొందరు హమాలీలు కుమ్మక్కై రైతులను తమ కొనుగోలు కేంద్రాలకే తీసుకొచ్చేలా ముందస్తు కమీషన్లు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పత్తి సాగు కోసం పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీఐ కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని, తూకాల్లో అక్రమాలను అరికట్టి తమకు న్యాయం చేయాలని పత్తి రైతులు కోరుతున్నారు.

సిజిరియల్ ప్రసవాలపై ఆడిట్ నిర్వహించి
పోస్టల్‌లో నమోదు చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 12 (జనం సాక్షి) : హనుమకొండ జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో పీఎం ఆర్ ఎహెచ్ఎటీ పథకం అమలు, సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని, హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో ఆసుపత్రుల వివరాలు, వైద్య సేవల సమాచారాన్ని నమోదు చేయడంపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఐఏఎస్ మాట్లాడుతూ, ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని సూచించారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించడంలో పీఎం ఆర్ఎహెచ్ఏ పథకం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని, అర్హులైన బాధితులకు ఈ పథకం ద్వారా నగదు రహిత వైద్య చికిత్స అందేలా ప్రైవేట్ ఆసుపత్రులు సహకరించాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు హెచ్ఎంఐ ఎస్ పోస్టల్ లో ఆసుపత్రుల పూర్తి వివరాలు, ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ సేవలు, ప్రసవాలు, ఇతర వైద్య సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వానికి అందిం చే ఆరోగ్య గణాంకాలు కచ్చితంగా ఉండేలా ఆసుపత్రుల యాజమాన్యాలు బాధ్యత వహించాలని తెలిపారు. సమావేశంలో ప్రధానంగా ఈ క్రింది అంశాలపై చర్చించి ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు.ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్న సిజేరియన్ ప్రసవాల సంఖ్య, సాధారణ ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాల నిష్పత్తిని సమీక్షించాలి. వైద్యపరమైన అవసరం ఉన్నప్పుడే సిజేరియన్ ప్రసవాలు నిర్వహించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించే దిశగా వైద్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సిజేరియన్ ప్రసవాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. మార్గదర్శకాల ప్రకారం నివేదికలు సమర్పించడం, క్యాన్సర్ వంటి నోటిపై చేయాల్సిన వ్యాధుల వివరాలను సంబంధిత పోర్టల్లలో నమోదు చేయడం, ప్రసవ సమ యంలో నవజాత శిశువులకు అవసరమైన టీకాలు అందించడం వంటి అంశాలపై కూడా సూచనలు చేశారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించేందుకు అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోరారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రజిత, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ ప్రదీప్ రెడ్డి, జిల్లాలోని వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.



బస్టాండ్‌లోనే పీఎఫ్ తాత్కాలిక కార్యాలయం తెరవండి

- ఎంపీ రఘునందన్ రావు

పటాన్‌చెరు (జనంసాక్షి) : పీఎఫ్ కార్యాలయాన్ని హైదరాబాద్ కు తరలిస్తున్నారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు వెంటనే స్పందించి స్వయంగా రంగంలోకి దిగారు. పటాన్‌చెరు బస్టాండ్ మొదటి ఫ్లోర్ లో పీఎఫ్ తాత్కాలిక కార్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలని ఆయన పీఎఫ్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని పీఎఫ్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బస్టాండ్ లో తాత్కాలిక కార్యాలయం తక్షణమే ఏర్పాటుచేసి, సేవలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సూచించారు. సాధ్యమైనంత త్వరగా బస్టాండ్ లోనే పూర్తి స్థాయిలో సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం అధికారులతో కలిసి బస్టాండ్ మొదటి, రెండు అంతస్తులలో కొత్తగా చేపట్టిన పనులను పరిశీలించారు. పనులు వేగంగా పూర్తిచేసి పీఎఫ్ కార్యాలయం సేవలు కార్మికులకు పటాన్‌చెరు లోనే అందించాలన్నారు.

విద్యార్థులు అత్యంత చైతన్యవంతులు

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



హైదరాబాద్ (జనంసాక్షి) : విద్యార్థులు అత్యంత చైతన్యవంతులని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కాంగ్రెస్ హయంలో ఉన్న బాంబుల మోతలు, అవమా నాలు ఇప్పుడు లేవని అత్యంత వేగంగా దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. బిజేవైఎం జాతీయ అధ్యక్షుడు హేమంత్ జోషితో కలిసి నాగోల్ లో బీజేవైఎం ఆధ్వర్యంలో జరిగిన వికాసిత్ భారత్ యువ కాంక్లేవ్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చనిపోయిన, వలస వెళ్లిన వారి ఓట్లు తీసేస్తుంటే కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని దానిని మీరు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజక వర్గంలో 40 లక్షల ఓట్లు ఉంటే పోలయ్యేది 20 లక్షలు మాత్రమేనని వేరే ప్రాంతం వారి ఓట్లు ఉండడం వల్లనే పోలింగ్ తక్కువ అవుతుం దన్నారు. నలభై ఏళ్ల క్రితం నేను కూడా మీలాంటి విద్యార్థినే. నన్ను ఇన్స్ పెయిర్ చేసింది భగత్ సింగ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మా ముందు ఈ అబద్ధాలు చెప్పే మరుగుజ్జు పార్టీలు నిలువ లేవన్నారు. మోదీని దింపే శక్తి మీ జేజెమ్మలకు కూడా లేదని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే, అర్బన్ జిల్లా అధ్యక్షుడు సాయి రామ్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పారంద సాయి, బీజేవైఎం నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువ రైతు మృతి!

నల్లబెల్లి (జనంసాక్షి) : పంట దిగుబడి తగ్గడం, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ యువ రైతు వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని బజ్జుతండాలో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బజ్జుతండాకు చెందిన జర్పుల వెంకటేష్ (28) తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో పత్తి పంట సాగు చేశాడు. సాగునీటి కొరత కారణంగా పంట దిగుబడి తగ్గడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. పంట చేతికి రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తోటి రైతుల వద్ద వాపోయేవాడని స్థానికులు తెలిపారు.

ఆసియా పారా గేమ్స్‌లో స్వర్ణ పతకం సాధించిన
దీప్తి జీవంజికి ఘన సన్మానం

- అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ ఖ్యాతిని చాటిన దీప్తి..
- యువ క్రీడాకారులకు ఆదర్శం
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 12 (జనం సాక్షి) :జపాన్‌లో ఇటీవల నిర్వహించిన ఆసియా పారా గేమ్స్ 2026లో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ ముద్దుబిడ్డ, వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన పారా అథ్లెట్ దీప్తి జీవంజిని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఘనంగా సన్మానించి అభినందించారు. హన్మకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో దీప్తి జీవంజిని శాలువాలతో సత్కరించి, ఆమె సాధించిన అద్భుత విజయానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జపాన్‌లో జరిగిన ఆసియా పారా గేమ్స్-2026లో మహిళల 400 మీటర్ల టీ20 విభాగంలో దీప్తి జీవంజి కేవలం 56.36 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకుని స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడంతో పాటు తన ప్రతిభతో రికార్డు సృష్టించడం ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై తెలంగాణ రాష్ట్రం పేరును మారుమోగించి, భారతదేశానికి గర్వకారణంగా నిలిచిన దీప్తి జీవంజి విజయం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. క్రీడల్లో విజయం సాధించాలంటే పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఎంతో అవసరమని, ఈ లక్షణాలకు దీప్తి జీవంజి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ తన అసాధారణ ప్రతిభతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగి స్వర్ణ పతకం సాధించడం అభినందనీయమని తెలిపారు.ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అసాధ్యమనుకున్న లక్ష్యాలను సైతం సాధించవచ్చని దీప్తి తన విజయంతో నిరూపించారని పేర్కొన్నారు. దీప్తి సాధించిన ఈ విజయం కేవలం ఒక పతకానికే పరిమితం కాదని, ఎందరో యువతీ యువకులకు, ముఖ్యంగా పారా క్రీడాకారులకు కొత్త ఆశలు, ఆత్మవిశ్వాసాన్ని అందించే గొప్ప విజయమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల్లోనూ అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, వారికి సరైన ప్రోత్సాహం, శిక్షణ, అవకాశాలు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అద్భుత విజయాలు సాధించగలరని తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన దీప్తి జీవంజి అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించడం నియోజకవర్గ ప్రజలందరికీ గర్వకారణమని, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఎల్లప్పుడూ తన ప్రోత్సాహం, సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం దీప్తి జీవంజిని మరోసారి అభినందిస్తూ, రాబోయే అంతర్జాతీయ పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో రాణించి మరిన్ని పతకాలు సాధించాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి క్రీడాకారిణికి రావాల్సిన బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దీప్తి జీవంజిని తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేను పారదర్శకంగా,
పకడ్బందీగా పూర్తి చేయాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో నవంబర్ 12 (జనం సాక్షి) : జిల్లాలో చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు, పూర్తి పారదర్శకత పాటించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లాలోని 85 గ్రామాల్లో చేపట్టిన భూ సర్వే పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని, సంబంధిత రైతుల సమక్షంలోనే భూముల సర్వే చేపట్టి, హద్దులను స్పష్టంగా గుర్తించాలని సూచించారు. సర్వే వివరాలను రైతులకు తెలియజేయడంతో పాటు, భూ రికార్డులను ఎలాంటి తప్పులకు తావులేకుండా స్పష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. రీ సర్వేలో నిర్లక్ష్యం వహించరాదని, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ విఠల్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
13 నవంబర్ 2026

శాంతియుత నిరసనకు నేరం ముద్ర వేస్తారా?

ప్రజాస్వామ్యంలో నిరసన అనేది అనుమతి అడిగి వాడుకునే వెసులుబాటు కాదు, పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. అయినా ఆ హక్కును వినియోగించుకున్నవారిపై క్రిమినల్ కేసులు మోపడం మన పాలనా వ్యవస్థల్లో అలవాటుగా మారిపోతోంది. చంద్రాపుర్ జిల్లా నందగావ్‌లో అధ్వానమైన రహదారి కారణంగా వాహనం ప్రమాదానికి గురైంది. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, కాంట్రాక్టర్‌తోపాటు బాధ్యులైన అధికారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు రోడ్డెక్కారు. చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం ఆ పని చేయకుండా, నిలదీసిన గ్రామస్థుడిపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. గుంతల రోడ్డును బాగుచేయమని అడగడమే నేరమైతే, ప్రజలు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలి?

బాంబే హైకోర్టు నాగ్‌పుర్ బెంచ్ ఈ కేసులో చేసిన వ్యాఖ్యలు అందరూ గమనించాల్సినవి. శాంతియుత నిరసనలను అణచివేయడానికి క్రిమినల్ విచారణలను ఉపయోగిస్తే అది ప్రజాస్వామ్యానికి దురదృష్టకరమైన రోజు అవుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోనంత వరకు, హింసకు పాల్పడనంత వరకు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కలిగించనంత వరకు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు వారికి ఉందని చెప్పింది. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. న్యాయం దక్కింది, కానీ అది పోలీస్ స్టేషన్ దగ్గర కాదు, హైకోర్టు మెట్ల దగ్గర. సామాన్యుడు ఎంత కాలం, ఎంత ఖర్చుతో ఆ మెట్లెక్కాలి?

ఇక్కడ అసలు ప్రశ్న ఒకటే. పౌరహక్కుల గురించి కోర్టులు చెప్పినప్పుడు మాత్రమే ప్రభుత్వాలకు, పోలీసులకు తెలుస్తుందా? నిరసన తెలపడం, సభలు పెట్టడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛలు. వీటికి సహేతుకమైన పరిమితులు ఉంటాయి, అవి హింసకు, ఆస్తి నష్టానికి వర్తిస్తాయి. కానీ ఆ పరిమితులను అడ్డం పెట్టుకుని ప్రతి ఆందోళనకూ నేరపు ముసుగు వేయడం చట్ట స్ఫూర్తికే విరుద్ధం. ఎవరైనా నిజంగా హద్దు దాటితే చట్టప్రకారం చర్య తీసుకోవడం తప్పుకాదు. కానీ ప్రశ్నించేవారిని భయపెట్టి నోరు మూయించడానికి కేసులను ఆయుధంగా వాడటం పాలకుల బలహీనతను చూపిస్తుంది.

ఒక రహదారి సమస్యపై గళమెత్తిన గ్రామస్థుడిపై కేసు పెడితే, ఆ సందేశం ఒక్క ఊరికే పరిమితం కాదు. మరొక గ్రామంలో, మరొక పట్టణంలో ప్రజలు తమ సమస్యలపై మాట్లాడటానికి వెనుకాడతారు. భయం అలవాటైన సమాజంలో ప్రభుత్వ జవాబుదారీతనం నీరసిస్తుంది. నిరసనకారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే ముందు అందులో నిజంగా నేరం ఉందా అని పరిశీలించే వ్యవస్థ ఉండాలి. అనవసరంగా కేసులు పెట్టిన అధికారులను జవాబుదారీ చేయాలి. అలాగే రోడ్ల నాణ్యతపై కాంట్రాక్టర్లను, సంబంధిత అధికారులను బాధ్యులను చేసే యంత్రాంగం కూడా బలపడాలి.

ప్రజలు రోడ్డెక్కడానికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే. ఆ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించినందుకు శిక్షించడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజే అవుతుంది. హైకోర్టు చెప్పిన ఈ మాటలను తీర్పుకే పరిమితం చేయకుండా పాలకులు, పోలీసులు ఆచరణలో పాటించినప్పుడే రాజ్యాంగ విలువలకు అర్థం ఉంటుంది.

బడుల విలీనం.. విద్యా సంస్కరణా? పేద పిల్లల చదువుకు గొడ్డలిపెట్టా!

ఒక గ్రామంలో పాఠశాల మూతపడటం అంటే కొన్ని గదులకు తాళాలు వేయడం మాత్రమే కాదు.. ఆ గ్రామ పేద పిల్లల భవిష్యత్తుకు అందుబాటులో ఉన్న ఒక అవకాశాన్ని మూసివేయడం! ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిన పాలకులు, పాఠశాలల సంఖ్యను తగ్గించే దిశగా అడుగులు వేస్తున్నారన్న ఆందోళన తెలంగాణలో ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (టీపీఎస్) పేరుతో చేపడుతున్న విద్యా సంస్కరణలు నాణ్యమైన విద్యకు బాటలు వేస్తాయా? లేక గ్రామీణ పాఠశాలల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తాయా?



నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్య అందించాలన్న టీపీఎస్ నమూనా పైకి ఆకర్షణీయంగానే కనిపిస్తోంది. ఆధునిక భవనాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, డిజిటల్ తరగతులు, ప్రత్యేక ఉపాధ్యాయులతో సమగ్ర విద్య అందించాలన్న లక్ష్యం అభినందనీయం. అయితే ఈ క్రమంలో సమీపంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, జూనియర్ కళాశాలలను ఒకే గొడుగు కిందికి తీసుకురావాలన్న ప్రతిపాదన అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.

బడుల సంఖ్య తగ్గించడం విద్యా ప్రమాణాలు పెంచడానికి ప్రత్యామ్నాయం కాదు

రాష్ట్రంలో సుమారు 26-27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల స్థాయికి కుదించే ఆలోచనపై గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనలు, విద్యా కమిషన్ సిఫార్సులు, తాజాగా టీపీఎస్‌ల విస్తరణ చర్యలు ఆందోళనలకు కారణమవుతున్నాయి. 2027-28 విద్యాసంవత్సరం నుంచి కొత్త పాఠశాలలను ప్రారంభించాలన్న ప్రణాళిక నేపథ్యంలో సమీపంలోని నాలుగైదు పాఠశాలలు ఒకే క్యాంపస్‌లోకి చేరితే, చిన్న బడుల భవిష్యత్తు ఏమిటన్నది కీలక ప్రశ్న. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తొలి టీపీఎస్ ఏర్పాటు, ఇతర ప్రాంతాల్లో నిర్మాణ పనులు, కొత్త పాఠశాలల మంజూరు వంటి చర్యలు ఈ విధానం వేగాన్ని సూచిస్తున్నాయి. ఒక్కో టీపీఎస్ నిర్మాణానికి రూ.10-15 కోట్ల వరకు వ్యయం, భారీ విద్యార్థుల సామర్థ్యం, ఏడాదికి కోట్ల రూపాయల నిర్వహణ వ్యయం అవసరమవుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే నిర్మాణ వ్యయంతో పాటు ఉపాధ్యాయ నియామకాలు, బస్సులు, ఇంధనం, భద్రత, నిర్వహణకు నిరంతర నిధుల కేటాయింపు తప్పనిసరి. ప్రభుత్వం దీనిపై సమగ్ర ఆర్థిక ప్రణాళికను వెల్లడించాలి.

చిన్న బడి.. పేద పిల్లల పెద్ద భరోసా

గ్రామాల్లో 10-20 మంది విద్యార్థులతో నడిచే పాఠశాలలను తక్కువ గా చూడటం సరికాదు. విద్యార్థుల సంఖ్య తగ్గడానికి వలసలు, పేదరికం, ఉపాధ్యాయుల కొరత, ప్రైవేటు పాఠశాలల ఆకర్షణ వంటి అనేక కారణాలున్నాయి. వాటిని పరిష్కరించకుండా బడులను విలీనం చేయడం సమస్యను మూలంతో పరిష్కరించినట్లుకాదు.గ్రామంలోనే ప్రాథమిక విద్య అందుబాటులో ఉంటే చిన్నారులకు భద్రత, తల్లిదండ్రులకు భరోసా ఉంటుంది. ముఖ్యంగా బాలికలు, దివ్యాంగ విద్యార్థులు, వ్యవసాయ కూలీల పిల్లలకు స్థానిక పాఠశాలలు ఎంతో కీలకం. దూరంలోని క్యాంపస్‌కు వెళ్లాల్సి వస్తే రవాణా ఖర్చులు, ప్రయాణ సమయం, భద్రతా సమస్యలు ఎదురవుతాయి. చిన్నారులు కిలోమీటర్ల దూరం ప్రయాణించడం వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చు. రవాణా సౌకర్యం లేకపోతే చదువు మధ్యలోనే ఆగిపోయే ప్రమాదమూ ఉంది.

గురుకులాల ప్రత్యేకతకు ముప్పు తేవద్దు

మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, సాంఘిక సంక్షేమ గురుకులాలు ప్రత్యేక లక్ష్యాలతో ఏర్పాటైన విద్యాసంస్థలు. బాలికల విద్య, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, వసతి విద్యకు ఇవి కీలక ఆధారాలు. వీటిని సాధారణ పాఠశాలలతో విలీనం చేసే క్రమంలో ప్రత్యేక ప్రవేశ విధానాలు, వసతి సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు, భద్రత దెబ్బతినకూడదు. ఒకే క్యాంపస్‌లో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు 1,500 మంది విద్యార్థులను నిర్వహించడం సాధారణ విష యం కాదు. ప్రత్యేక తరగతి గదులు, వేర్వేరు ఆటస్థలాలు, మరుగు దొడ్లు, పర్యవేక్షణ, ఉపాధ్యాయులు, పరిపాలనా వ్యవస్థ పటిష్టంగా ఉండాలి.

ఉపాధ్యాయుల కొరతకు పరిష్కారం బడుల మూసివేత కాదు

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయడం, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి చేయడం, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడం ద్వారా ప్రభుత్వ విద్యపై నమ్మకం పెంచాలి. తాగునీరు, మరుగుదొడ్లు, గ్రంథాలయాలు, కంప్యూటర్లు, ప్రయోగశాలలు, ఆటస్థలాలను అభివృద్ధి చేయాలి. విద్యార్థుల సంఖ్య పెరగాలంటే ముందుగా విద్యా నాణ్యత పెరగాలి. పాఠశాలలను కుదించడం ద్వారా కాదు.. బలోపేతం చేయడం ద్వారా ప్రభుత్వ విద్యను నిలబెట్టాలి.

విద్యా హక్కు చట్టం ప్రకారం 6-14 ఏళ్ల పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ వల్ల ఈ హక్కు ఆచరణలో దెబ్బతినకూడదు. విలీనానికి ముందు గ్రామాల వారీగా విద్యార్థుల సంఖ్య, పాఠశాలల దూరం, రవాణా సౌకర్యాలు, ఉపాధ్యాయుల వివరాలను వెల్లడించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించాలి. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా క్లస్టర్ విద్యా విధానాన్ని అమలు చేయవచ్చు. చిన్న పాఠశాలలను మూసివేయకుండా సమీప పాఠశాలతో అనుసంధానించి, ప్రత్యేక ఉపాధ్యాయులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలను ఉమ్మడిగా వినియోగించుకోవచ్చు. విలీనం అనివార్యమైన చోట ఉచిత, సురక్షిత రవాణా కల్పించాలి. ముందుగా కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసి ఫలితాలను అంచనా వేయాలి.

బడులు మూసే తెలంగాణ కాదు.. బడులను బలోపేతం చేసే తెలంగాణ కావాలి

ప్రభుత్వ విద్య అనేది పేదలకు అందించే దాతృత్వం కాదు.. అది వారి హక్కు. టీపీఎస్‌లు నిర్మించండి. ఆధునిక విద్య అందించండి. అంతర్జాతీయ ప్రమాణాలు తీసుకురండి. కానీ గ్రామీణ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయకండి. ఒక గ్రామంలో బడి బతికితేనే ఆ గ్రామంలోని పేద పిల్లల కలలు బతుకుతాయి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోకుండా తీసుకునే ఏ నిర్ణయమైనా పునరాలోచనకు గురికావాలి. బడుల సంఖ్య తగ్గించడం సంస్కరణ కాదు.. పేద పిల్లల చదువు పెంచడమే అసలైన సంస్కరణ



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి,
సీనియర్ జర్నలిస్ట్,
సెల్: 9010128884

పర్యావరణ పరిరక్షణ

పండగ అంటే చెడుపై
మంచి సాధించిన విజయమా?
అదొక్కటే పండగ పరమార్థమా ?
లోకంలో పెరిగిపోయిన పెనుచీకట్లు
పాప భీతి లేకుండ విచ్చలవిడితత్వం
వీటి మధ్య ఏ పండగలు చేసుకోగలం??
గాలి నాణ్యత సూచీల
ప్రమాణాలు ఎవరికి పట్టవు !
ప్రజారోగ్యంపై ప్రమాద ఘంటికల
మోత ఎవరికి వినపడదు!
కాలుష్యపు చీకట్ల వెనుక
పీల్చే ప్రతి శ్వాస ప్రమాదకరంగా
మారి, మనిషి మనుగడకు
ముప్పు వాటిల్లుతుంటే

ఎవరికీ కనబడదు !!
కాలుష్యం అంటే కంటికి కనిపించే పొగ కాదు!!
పంట వ్యర్థాల దహనమో, పరిశ్రమల ఉద్గారాలో,
వాహనాల పొగ,
నిర్మాణ రంగంలోని ధూళి
పెరుగుతున్న వాహనాల సంఖ్య
ఇవన్నీ కాలుష్యమే!!వాటిని నియంత్రించకపోతే!?
అప్పటిదాకా ఎన్ని దీపాలు వెలిగించినా!!
చుట్టూ వున్న చీకట్లు పోలేవు!!
నిబంధనలు ఉల్లంఘిస్తున్న పరిశ్రమలు
కాలుష్యం నియంత్రణలో
బాధ్యతారాహిత్య యంత్రాంగం,
అభివృద్ధి పేరుతో ప్రకృతిని
ధ్వంసం చేయడం..ఆపి,
ఇకనైనా పుడమి తల్లిని
కాపాడుకుందాం

సంక్షోభం వచ్చినప్పుడేనా
అధికార యంత్రాంగ సమీక్షలు??
అసలు పర్యావరణ పరిరక్షణ భారం ఎవరిది?
అది...మన అందరిదని
ఎందుకు అనుకోరు??
మనిషి బతకడానికి కావలసిన
గాలి "స్వచ్ఛత "కోసం
ప్రతి ఒక్కరం భాగస్వాములవ్వాలి
విషవాయువులు మనిషి ఆయువును
కుదించకముందుకే జనం మేల్కోవాలి
పర్యావరణ రహిత
పండుగలకు ఓటు వేద్దాం
పండుగంటే వేల సంవత్సరాల కిందటి
అసుర సంహారాలు కాదు,
మన ఆరోగ్యంపై
కాటు వేస్తున్న కల్తీపై,

కాలుష్యంపై,ప్లాస్టిక్ పై
అందరం సమరం చేయాల్సిందే!
సమిష్టి ఆరోగ్య భారత్
అందరి లక్ష్యం అవ్వాల్సిందే!
మనుషుల మధ్య గోడలుకట్టిన
మతాలను,కులాలను
సమాధి చేసి,కొంతైనా
మానవత్వాన్ని మేల్కొలపాలి
అప్పుడే ,వాడవాడల్లో
సమానత్వపు దీపాలు వెలగించినట్టు
గుండెల్లో చెమ్మ ఆరకముందే
ఇకనైనా మార్పు కోరుకుందాం!
అప్పుడే వికసిత్ భారత్
సాకారం అవుతుంది

అనిత కృష్ణ గండమళ్ళ
9490876621

త్యాగాల సాళ్లలో 'అల్లం బుచ్చమ్మ' అమరత్వం

ఎందరో వీరుల ఆకలి తీర్చిన బుచ్చవ్వ



తన రక్తం పంచుకొని పుట్టిన బిడ్డ పడుతున్న ఆరాటం, అనుసరిస్తున్న ఆచరణ, అనుభవిస్తున్న కష్టాలు, కన్నీళ్లు, నిర్బంధాలు, అరెస్టులు, రాజ్య హింస నుంచి కాపాడుకోవడం కోసం తన బిడ్డతో పాటు కొనసాగే తల్లి ప్రయాణం ఎంత గొప్పది.

ఆ తొవ్వలో నడిచే నడక ఒక బిడ్డకు తల్లిగానే కాకుండా, నడుస్తున్న సమాజానికి తల్లిగా నిలుస్తుంది. దీన్ని మనం మాక్సిన్ గోర్కి రాసిన అమ్మ నవల నుంచి అర్థం చేసుకోవచ్చు.

మనదేశంలో ప్రతిఘటనోద్యమం, అధిపత్య వ్యతిరేక పోరాటం జరిగిన, జరుగుతున్న ప్రతిచోట ఇలాంటి అమ్మలు ఎందరో కనబడతారు. ఆ తల్లికి రాజకీయాలతో, ప్రత్యర్థి బలాబలాలతో సంబంధం లేదు. తన బిడ్డను రక్షించుకోవడానికి ఎంతటి త్యాగానికైనా, కష్టానికైనా ఎదురు నిలబడుతుంది. ప్రశ్నిస్తుంది. పోరాడుతుంది.

అదే క్రమేపి తన బిడ్డ లక్ష్యసాధనవైపు నడిపిస్తుంది.

అలాంటి వారిలో అల్లం బుచ్చమ్మ ముందు వరుసలో ఉంది.

...వీరి తాతలు అల్లం పెద్ద రాజయ్య, చిన్న రాజయ్యలు చెమట, రక్తం, సాహసంతో పోడు చేసిన భూమి బ్రాహ్మణుల పేరిట పట్టా కావడం, వీరిని తీవ్రంగా కలిచి వేసింది. వీళ్లే ఏర్పాటుచేసిన గాజులపల్లి గ్రామం వదిలిపెట్టి, బతుకుదెరువు కోసం పక్క ఊరికి వెళ్లాల్సి రావటం, భూస్వాముల వద్ద పాలేరుగా పనిచేయాల్సి రావటం ఎంత దుర్లభం.

కరుడుగట్టిన బ్రాహ్మణ భావాజాలం వల్ల, భూస్వామ్య పెత్తందారి విధానాలను భరించలేక అల్లం నరసయ్య ప్రశ్నించడం, ఎదురు తిరగడం, దొర మనుషులపై దాడి చేసి పారిపోవటంతోనే తిరుగుబాటు ప్రారంభమైంది. అనుభవించిన వివక్ష, కష్టం ఎంత చేసిన అవమానాలతో జీవించాల్సి రావటం వలన లోలోపల ఆగ్రహా జ్వాలలు ఆయనలో రగులుతూనే ఉన్నాయి.

చిన్నతనం నుండి కష్టించి పనిచేయడం, తనకంటే పెద్దవారితో కలిసి బాడుగకు ఎడ్ల బండి కట్టడం లాంటి సాహసోపేత పనులకు శ్రీకారం చుట్టాడు నరసయ్య. వీటన్నింటిని తల్లి గర్భంలో నుంచి అల్లం సోదరులు ముగ్గురు అలకించడం, అనుభవించడం వలన రాజ్య వ్యతిరేక భావాన్ని నరనరాల జీర్ణించుకున్నారెమో!

తన గ్రామంలో, మంత్రపురి మంథనిలో వెట్టి చాకిరి, కులవ్యక్ష,అంతరాలు, అణిచివేత భరిస్తూ, గమనిస్తూ, అనుభవిస్తూ వచ్చినటువంటి నేపథ్యం అల్లం సోదరులది.

గ్రామంలో భూస్వాముల దాష్టికాలు, మాల, మాదిగల వెట్టి చాకిరి, ఇతర కులాల మధ్య వైరుధ్యాలు, స్త్రీల ఎడల జరిగే అమానవీయాలను చూస్తూ రావడం, ఆధిపత్య వర్గాల వికృత, వికారపు చేష్టలు చూడలేక, భరించలేక,ప్రశ్నించలేక,ఎదురు తిరగలేక పిచ్చివాళ్లుగా మారిన వాళ్లు కూడా ఎందరో!

పోలీసుల దౌర్జన్యాలను, హింసను భరించలేక భయంతో పారిపోయిన వాళ్లు, కనబడకుండా పోయిన వాళ్ళు, పిచ్చివాళ్లుగా మారిన వాళ్లను చూస్తూ పెరిగిన నేపథ్యం. స్కూల్లో ఎదురైన అవమానాలు, అవహేళనలు బ్రాహ్మణ, బ్రాహ్మ నేతర వర్గాల మధ్య వైరం, అణచివేత, వివక్ష, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిలబడటం, కలబడటం, రాయటం అప్పుడే అల్లం రాజన్న తో ప్రారంభమైంది.

సాహిత్యాన్ని, చరిత్రను విస్తృతంగా అధ్యయనం చేయడం రాజన్నకు సాధ్యమైంది. ఆయన తీసుకుని వచ్చిన పుస్తకాలు చదివి అల్లం వీరన్న, నారాయణ ఇరువురు కూడా సమాజంలోని అంతరాలను, దోపిడిని గమనించారు. వారు అనుభవించిన దోపిడి, అవమానాలను, అన్యాయాలను దూరం చేయడానికి చేయాల్సిన మార్గాన్ని ఎంపిక చేసుకునే పనిలో పడ్డారు.

ప్రజా రచయితగా అల్లం రాజన్న సమకాలీన రాజకీయాలు, ఆధిపత్య వర్గాల దోపిడి, శ్రామిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, పీడనలు, ఆదివాసీలు, అడవి బిడ్డల జీవితాలు, అర్థ వలస, అర్ధ భూస్వామ్య విధానాలు, ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, కన్నీళ్లపై పాలకుల దోపిడీ, దుర్మార్గాలు, రాజ్య హింస, ఎన్కౌంటర్లు, బూటకపు ఎదురు కాల్పులు, జగిత్యాల జైత్రయాత్ర, పీడనకు వ్యతిరేకంగా సాగిన పోరాటాల పైన ఎన్నో రచనలు, ప్రసంగాలు చేసిన గొప్ప వ్యక్తి అల్లం రాజన్న.

దేశానికి వెలుగులు పంచుతున్న సింగరేణి బొగ్గు గని కార్మికుల జీవితాలు అంధకారం లోనే గడిచిపోతున్నాయి. వీరి జీవనం, పందల మీటర్ల లోతులో నిక్షిప్తమైన బొగ్గును భూగర్భంలోకి వెళ్లి వెలికి తీసే పని పరిస్థితులు, కార్మికుల ఆరోగ్యం, బాయి దొరల పెత్తనం, దిన దిన గండం నూరేళ్ల ఆయుషుగా, ప్రతినిత్యం భయం భయంగా సాగే కార్మికుల జీవితాలపై ఎన్నో కథలు రాశారు.

దేశవ్యాప్తంగా రాజకీయ ఖైదీలు, నిరుపేద ఖైదీల విడుదలకు, పీడితలకు ప్రజల, ప్రజాస్వామికవాదుల, న్యాయవాదులు, మేధావుల మద్దతు కూడా కట్టడంలో తన కలానికి ఉన్న పదును వాడిన గొప్ప రచయిత. కానీ ఆయన రాష్ట్ర రాజధానిలోనో, దేశ రాజధాని లోనో లేకపోవడం వలన ప్రపంచ స్థాయి గుర్తింపు రాలేదని అనిపిస్తుంది. ఆయనకు ప్రస్తుత లభించిన గుర్తింపు కంటే కొన్ని వందల రెట్లు రావాల్సి ఉంది.

దేశం గర్వించదగిన గొప్ప రచయిత అయినప్పటికీ, ఆయన సామాన్యుడిలాగానే, అనామకుడిగా, అమాయకుడిగా చివరి వరుసలో నిలబడి అన్నీ గమనించటం, ఆయన నిరాడంబరతకు, నిబద్ధతకు నిలువుటెత్తు ప్రతిరూపం.

అల్లం వీరన్న, నారాయణలు

అల్లం వీరన్న కంటే నారాయణ చిన్నవాడు. అయినా ఇద్దరు ఒకే తరగతి చదవడం వలన ఇద్దరికి అన్ని విషయాల్లో సఖ్యత ఉంది. ఇద్దరూ కవిత్వాన్ని, జానపద, విప్లవ గీతాలను, కథలను, రాయడం, ఆడడం, పాడడంలో దిట్ట.

ఎర్రజెండా ఎర్రజెండా ఎన్నియలో... ఎర్రేర్రని జెండా ఎన్నియాలో అల్లం వీరన్న రాసిన పాట. 80వ, 90వ దశకంలో ఒక ఊపు ఊపిన పాట. పీపుల్స్ వార్ పార్టీ సభ, దాని అనుబంధ సంఘాల సభ ఎక్కడ జరిగిన ఈ పాట పాడాల్సిందే.

... . పీపుల్స్ వార్ పార్టీ విస్తరణకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విస్తృతంగా కృషిచేసిన అజ్ఞాత నాయకుల్లో అల్లం నారాయణ ఒకరు. జగిత్యాల జైత్రయాత్ర సభ నిర్వహణలో అత్యంత కీలకంగా వ్యవహరించినవాడు. చావు నుంచి వెంట్రుకవాసీలో ఎన్నోసార్లు తప్పించుకుని, బ్రతికినవాడు. పోలీసు హింసలను, జైలు జీవితాన్ని అనుభవించినవారు.అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత పాత్రికేయుడిగా జీవితాన్ని ప్రారంభించి, ఎడిటర్ స్థాయికి ఎదిగిన కవి, రచయిత అల్లం నారాయణ.

తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన నాయకుడు. తెలంగాణ రాష్ట్ర టీయూడబ్ల్యూజే వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర తొలి ప్రెస్ అకాడమీ చైర్మన్ గా వ్యవహరించారు.

బిడ్డల అజ్ఞాతం..... అవ్వకు తీరని కష్టం

అల్లం సోదరుల అన్నల బాట నడవడం తెలిసిందే.

వీరి చిన్నతనం నుండి అల్లం నారాయణ అజ్ఞాత జీవితం వీడే వరకు అవ్వ బుచ్చమ్మ ఎన్నో కష్టాలను చవిచూసింది.

కన్నీళ్ల సజీవ దార పారింది.

అయినా అవ్వ గుండె సాహసోపేతంగా తన కన్న బిడ్డల కోసం నిలబడింది.

పోలీస్ ఠాణా మెట్లు ఎక్కింది, జైలు గోడల్ని తాకింది, కోర్టు తలుపులను తట్టింది.

ప్రజల కోసం పనిచేస్తున్న నాయకులు జనంలో ఉన్నవారు జనంతోని ఉన్నవారు అజ్ఞాతంలో ఉన్నవారు అందరికీ అవ్వ బుచ్చవ్వ చేతి బువ్వ తిన్నవాళ్లే..

కనీసం అంబలి, గంజి, మంచినీళ్లు అయిన

ఆ చేతి నుండి స్వీకరించి, ఆ ఇంట్లో ఎప్పుడో ఒకసారి సేద తీరిన వారే.

విప్లవోద్యమంలో పని చేస్తున్నందుకు, ప్రజల కష్టాలను, కన్నీళ్లను అక్షర రూపంలో రాసినందుకు, దోపిడీ, పీడనం లేని సమాజాన్ని, సమ సమాజాన్ని కలలుగని, అందుకోసం పనిచేసినందుకు అల్లం వీరన్న, నారాయణ కోసం రాజ్యం చేయని దుర్మార్గం, దాష్టికం లేదంటే అతిశయోక్తి కాదు. గాజుల పల్లెలోని అల్లం అన్న ఇంటిపై అనేకమార్లు పోలీసులు దాడి చేసి ఇంటిని, ఇంట్లోని సామాన్లు ధ్వంసం చేసి, తినే వస్తువులలో కిరోసిన్ పోసి, అవ్వ, అయ్యపైన దాడి చేసి బెదిరించి, భయపెట్టిన సంఘటనలు లెక్కకు లేనన్ని సార్లు జరిగాయి. పోలీస్ బూట్ల సప్పుడు జీవుల చప్పుడు వినిపించిందంటే గుండెలో దడ మొదలయ్యేది. ఎన్కౌంటర్ జరిగిందంటే, విప్లవకారులు ఏదైనా దాడి, ధ్వంసం చేశారు అంటే నరసయ్య ,బుచ్చవ్వ గుండెలు అదిరేటివి.

ఏ క్షణాన ఏం జరుగుతుందో, ఏ వార్త వినాల్సి వస్తుందోనని భయంతో వణికి పోయేవారు.

అవ్వకు దుఃఖం రహస్యమే

ఎమర్జెన్సీ కాలంలో వీరన్న, నారాయణలను అరెస్టు చేశారనే వార్త వీరికి కంటి మీద కునుకు లేకుండా చేసింది. వీరి అరెస్టుకు తల్లి హృదయం ఎంతో తల్లడిల్లిపోయింది. ఈ విషయం ఇతరులకు తెలిస్తే,ఏ ఉపద్రవం ముంచుకు వస్తుందోనని భయం ఆమెను వెంటాడేది. అందుకే ఆమె రాత్రి పూట ఒంటరిగా, మౌనంగా రోదించేది. అట్లా ఎన్ని రాత్రులు గడిపిందో ఆమెకే తెలియదు.

కొడుకులను అక్రమంగా అరెస్టు చేసి పోలీసులు పెట్టిన చిత్రహింసలు, ఒంటిపైనున్న గాయాలు, నడవలేని స్థితి చూసి బుచ్చవ్వ ఎంతగానో తల్లడిల్లింది. వైద్యానికి సరిపడా డబ్బులు లేని ఇబ్బంది మరోవైపు.

ఆ తల్లిది తీరని దుఃఖం అయినా వెనుకంజ వేయలేదు.

భయపడకుండా వీరి కోసం తన శక్తి మేరకు పనిచేసింది.

వీరి కోసం వచ్చేవారికి కూడా ఓపిక ఉన్నంత వరకు సేవ చేసింది.

అల్లం నారాయణ అజ్ఞాతం వీడిన తర్వాత ఆ తల్లికి కొంత ఊరట కలిగింది. ఏ పోలీసులను చూసి భయంతో పరుగులెత్తిందో, కొడుకు పాత్రికేయుడిగా, ప్రెస్ అకాడమీ చైర్మన్ ఎదిగిన తర్వాత, ఆ పోలీసులే గౌరవించడంతో ఆమెకు స్వాంతనగలిగింది.

కానీ ఊరిలో, వాడలో తమ చుట్టుపక్కల జరిగే అన్యాయాలు, దుర్మార్గాలను చూసి ఆ గుండె తల్లడిల్లేది.

చివరకు ఈ నెల 6న ఆమె దినచర్యకు విశ్రాంతి లభించింది.

గుండె కూడా సెలవు కోరింది.

ఆ కళ్ళు శాశ్వతంగా మూసుకున్నాయి.

ఎర్రని వస్త్రం ఆమె దేహాన్ని ముద్దాడింది.

ఆమె ఆచరణ మనకు ఎప్పటికీ ఆచరణీయం.

మార్గదర్శకంగా నిలుస్తుంది.


నీ రుణం తీర్చుకోవడం అసాధ్యమే...

జోహార్ అల్లం బుచ్చవ్వ.....

అమర్ రహే అల్లం బుచ్చమ్మ.....



మాదాసి రామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్, గోదావరిఖని
9849986366



అనైతికం

అడవులను అంతం చేస్తున్న ముష్కరులు
వన్యప్రాణులను హింసిస్తున్న రాక్షసులు
పర్యావరణాన్ని కలుషిత పరిచే దుష్టులు
ప్రాణవాయువులో గరళం కలిపే
దుండగులు
మానవ మృగాలను. పోషిస్తున్న
దుర్మార్గులు
అంగనల అంద చందాలను
ఆరగిస్తున్న కీచకులు
న్యాయాల యాలలో అవినీతి కి పట్టం
కట్టే శకునులు
డబ్బుకు తలవంచే కాలాంభర
కపచదారులు
ప్రకృతి మాతకు పిచ్చెక్కి పోతున్నది
కృత్రిమం వయ్యారం వొలికిస్తున్నది
పతనమే అధునాతన పథకమైనది
అనైతికం నైతికతను మన్నెం పట్టిస్తున్నది
భూమాత తాపంతో ఊగిపోతున్న ది
నానా పేర్లతో సంద్రం తుఫానై
విజృంభిస్తున్న ది
మానవ మనుగడ విపత్తుకు గురికానున్నది
అరులచేధరణి ఆక్రోశం లో నున్నది
ప్రభుత స్త్రీకి స్త్రీనే శత్రువు చేస్తున్నది
ఆకర్షణ గుప్పించి వికర్షణ ఫీరమేసింది
మంచిని వంచించే కైకను తలపిస్తున్నది
ఏ పాపమెరుగని ప్రవల్లిక నిండు ప్రాణం
బలి గొన్నది

నమిలకొండ నాగేశ్వర్ రావు
8688553470. మేడ్చల్

రైతులు, పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

- సాలూరులో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పర్యటన
- 429 మందికి కొత్త ఆసరా పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలకు హామీ
- సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలి
- నూతన సొసైటీ పాలకవర్గానికి దిశానిర్దేశం



బోధన్, నవంబర్ 12 (జనంసాక్షి) : పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ ముఖ్య సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు ఆసరా పింఛన్ల మంజూరు పత్రాలు పంపిణీ చేయడంతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సాలూర సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. సాలూరలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో 429 మంది కొత్త ఆసరా పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా కొత్తగా 20,555 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. సాలూర మండలంలో మొత్తం 2,960 మంది లబ్ధిదారులకు నెలకు రూ.71.52 లక్షల పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులకు పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు అందించాలన్న ప్రజల విజ్ఞప్తిపై స్పందిస్తూ అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆసుపత్రి భవనానికి సంబంధించిన వివరాలను వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పెరిక సంఘ భవనంలో జరిగిన సాలూర సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని చైర్మన్ అల్లె రమేష్, పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సహకార సంఘ నిబంధనల ప్రకారం రైతులకు మెరుగైన సేవలందిస్తూ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. పాలకవర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అందాని, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ భుజంగరావు, పీడీ సాయన్న, పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, బోధన్ ఏఎంసీ చైర్మన్ నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సహకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉస్మానియా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- 24 రోజుల సమ్మెకు ముగింపు పలకాలి
- కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి జాన్ వెస్లీ లేఖ

ముషీరాబాద్, నవంబర్ 12 (జనంసాక్షి): ఉస్మానియా విశ్వవిద్యాలయ బోధనేతర ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, 24 రోజులుగా కొనసాగుతున్న సమ్మెను విరమింపజేయాలని కోరుతూ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న రెగ్యులర్, టైమ్‌స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పెన్షన్ సదుపాయాలు కల్పించడం లేదని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారని, 2023 ఏప్రిల్ నుంచి ఇవ్వాల్సిన 15 శాతం (రూ.1,500) వార్షిక వేతన పెంపును నిలిపివేశారని తెలిపారు. విధుల్లో ఉండగా మరణించిన 41 మంది ఉద్యోగుల కుటుంబాలకు, పదవీ విరమణ పొందిన ఎనిమిది మందికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు చెల్లించకపోవడాన్ని ప్రస్తావించారు. ఎల్ఐసీ అనుసంధానిత పెన్షన్ పథకానికి 2012 నుంచి వర్సిటీ వాటా చెల్లించకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు ప్రయోజనాలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని లేదా టైమ్‌స్కేల్ వేతనాలు వర్తింపజేయాలని, 2001-2004 మధ్య నియమితులైన వారికి పాత పెన్షన్, 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమితులైన వారికి సీపీఎస్ అమలు చేయాలని కోరారు. ఈపీఎఫ్ బకాయిలు, నిలిపివేసిన వేతన పెంపు బకాయిలను చెల్లించాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలు, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్గత పదోన్నతులు చేపట్టడంతో పాటు వైద్య రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ.10 వేల నుంచి రూ.30 వేలకు పెంచాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఉస్మానియా అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయిస్తామన్న ప్రభుత్వ హామీని అమలు చేయాలని సూచించారు. నవంబర్ 10న ఉద్యోగుల ఆందోళనలో పాల్గొని వారి సమస్యలను తెలుసుకున్నానని తెలిపిన జాన్ వెస్లీ, ముఖ్యమంత్రి వెంటనే ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమ్మెకు ముగింపు పలకాలని కోరారు.

ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాల పారబోతపై కఠిన చర్యలు తీసుకోవాలి

- అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఆదేశాలు



హయత్ నగర్, నవంబర్ 12 (జనం సాక్షి) : ఆటోనగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతంలో రసాయన, ఇతర పారిశ్రామిక వ్యర్థాలను అక్రమంగా పారవేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అధికారులను ఆదేశించారు. గురువారం మన్సూరాబాద్ సౌత్ ఎండ్ పార్క్ కాలనీకి విచ్చేసిన మంత్రి శ్రీధర్ బాబు, మధుయాష్కి గౌడ్‌లను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కలిసి తమ సమస్యలను వివరించారు. ఆటోనగర్ డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో రసాయన వ్యర్థాలను అక్రమంగా పారవేయడం వల్ల తీవ్ర దుర్వాసన వెలువడుతోందని, డ్రైనేజీ నీరు కాలనీల మీదుగా ప్రవహిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, మధుయాష్కి గౌడ్‌లు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌తో పాటు డీసీపీతో మాట్లాడి, రాత్రి వేళల్లో అక్రమంగా వ్యర్థాలను పారవేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల మధుయాష్కి గౌడ్ అన్ని శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి, కాలనీ వాసుల సమక్షంలో సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో రహదారుల వెంట గతంలో పారవేసిన వ్యర్థాలను అధికారులు తొలగించారు. అలాగే ఆటోనగర్ పారిశ్రామిక ప్రాంతంలో నిర్మాణ దశలోనే అసంపూర్తిగా నిలిచిపోయిన మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్ టి పి) పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించగా, ప్రస్తుతం ఆ పనులు తుది దశకు చేరుకున్నాయని మధుయాష్కి గౌడ్ వివరించారు. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ముప్పుగా మారుతున్న వ్యర్థాల అక్రమ పారబోతను పూర్తిస్థాయిలో అరికట్టాలని, కాలనీవాసులకు శాశ్వత పరిష్కారం కల్పించాలని వారు అధికారులకు స్పష్టం చేశారు.



జవహర్ నగర్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

డంపింగ్ యార్డ్, డ్రైనేజీ, రోడ్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన మల్లారెడ్డి

జవహర్ నగర్: నవంబర్ 12 (జనంసాక్షి): జవహర్ నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న డంపింగ్ యార్డ్, డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు.

హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో జవహర్ నగర్‌లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను వివరించారు. ముఖ్యంగా డంపింగ్ యార్డ్ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించి, జవహర్ నగర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య, దమ్మాయిగూడ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు సంగీత రాజశేఖర్, వాణి శ్రీనివాస్ రెడ్డి, డంపింగ్ యార్డ్ జేఏసీ సభ్యులు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికి ఇంకుడు గుంత తప్పనిసరి : డీఎల్‌పిఓ వరలక్ష్మి

నందిగామ నవంబర్ 12 (జనం సాక్షి): ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి అని ఇంకుడు గుంత నిర్మించడంతో భూగర్భ జలాలు పెరుగుతాయని డిఎల్పిఓ వరలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో ఇంకుడు గుంతలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ.. మనం బోరు వేసినా నీరు రావడం లేదు అంటే కారణం భూమిలో నీరు తగ్గిపోవడమేనని, ఇంకుడు గుంతలు ఉంటే వాన నీరు భూమిలోకి వెళ్లి, బోర్లలో, బావుల్లో నీటిమట్టం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం ఏలినో కారణంగా భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటి పోతున్నావని, ఎలినోను తట్టుకోవాలంటే ప్రతి ఒక్కరు నీటిని వృధా చేయకూడదని సూచించారు. ఇంకుడు గుంతలు నిర్మించినట్లయితే బోర్లు బావులు నీటిమట్టం పెరిగేందుకు అవకాశం ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలపై దృష్టి సారించి తమ బాధ్యతగా ఇంకుడు గుంతలు నిర్మించాలని, ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీఓ చక్రధర్ గౌడ్ నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉపసర్పంచ్ వెంకటేష్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో డబ్బుల వసూలు

మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌కు బాధితుల ఫిర్యాదు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తామని పేద ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు బొంగు వెంకటేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. మన్సూరాబాద్ డివిజన్‌లోని ఎరుకల నాంచారమ్మ నగర్, ఏకలవ్య నగర్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తామని స్థానికంగా ఉండే సాగర్ గంగయ్య పలువురి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు బాధితులు ఆరోపించారు. తనకు రాజకీయ పలుకుబడి ఉందని, అధికారులతో పరిచయాలు ఉన్నాయని నమ్మబలికి ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై భారత ఎరుకల కుల వృత్తుల అభివృద్ధి సేవా సంఘం హైదరాబాద్ జిల్లా కార్యదర్శి వనం గంగయ్య, ఉపాధ్యక్షుడు దాసరి గంగాధర్, బాధితులు గురువారం మన్సూరాబాద్ సౌత్ ఎండ్ పార్కుకు వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, ఇళ్లు ఇప్పిస్తామని నమ్మించి పేదల నుంచి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇప్పించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు దాసరి మమత, భిక్షమ్మ, ఎరుకల నాంచారమ్మ బస్తీ నాయకులు పాల్గొన్నారు.

నంది వాగు శిఖం భూమిలో రిసార్ట్ నిర్మాణం!

30 గుంటల భూమి కొనుగోలు.. అదనంగా ఎకరం ఆక్రమించారనే ఆరోపణలు

- సర్వే నంబర్ 85లో ప్రభుత్వ భూమి స్వాహా?
- అనుమతులపై అధికారుల స్పష్టత ఏదీ?
- సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్థుల డిమాండ్



మోమిన్‌పేట, నవంబర్ 12 (జనం సాక్షి): ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందనే ఆరోపణలు మోమిన్‌పేట మండలంలో చర్చనీయాంశంగా మారాయి. కాస్లాబాద్ గ్రామ సమీపంలోని నంది వాగు ప్రాజెక్టు కుడి కాలువ పక్కన సర్వే నంబర్ 85లో శిఖం భూమి ఆక్రమణకు గురైనట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు స్థానిక రైతుల వద్ద 30 గుంటల భూమి కొనుగోలు చేసి, అదనంగా సుమారు ఎకరం 10 గుంటల ప్రాజెక్టు శిఖం భూమిని ఆక్రమించి ఫామ్‌హౌస్ నిర్మించినట్లు పేర్కొంటున్నారు. అక్కడ 'ఆ జూరే 21 రిసార్ట్' పేరుతో పర్యాటక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రాజెక్టు శిఖం భూమి సమీపంలో నిర్మాణాలకు నీటిపారుదల, రెవెన్యూ శాఖల అనుమతులు ఉన్నాయా? కొనుగోలు చేసిన భూమి ఎంత? ఆక్రమణకు గురైందని చెబుతున్న ప్రభుత్వ భూమి విస్తీర్ణం ఎంత? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. రెవెన్యూ, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహిస్తే వాస్తవాలు వెల్లడవుతాయని గ్రామస్థులు కోరుతున్నారు. ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తూ, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టి శిఖం భూముల హద్దులు గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆక్రమణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల రీ-సర్వే పారదర్శకంగా చేపట్టాలి

యాచారం, (జనం సాక్షి): కేసీ తండా గ్రామపంచాయతీ పరిధిలోని మంతన్‌గౌడ్ ప్రభుత్వ భూముల రీ-సర్వేను ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయ్యప్ప, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జీపీఓ, సర్పంచ్ రమేష్ నాయక్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శంకుస్థాపన

రాజేంద్రనగర్,నవంబర్12(జనంసాక్షి): పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్‌దేవ్ పల్లిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో కలిసి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు గృహ వసతి కల్పించే లక్ష్యంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో భాగంగా ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయ ణరెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి, నాయకులు ధనుంజయ, అశోక్ యాదవ్, గృహ నిర్మాణ శాఖ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించకుంటే
గుర్తింపు కమిటీ సభ్యుల ఇళ్లను ముట్టడిస్తాం

- ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి
- మోతే శోభన్‌రెడ్డి నివాసం వద్ద తెలంగాణ ఉద్యమకారుల నిరసన



సికింద్రాబాద్, (జనం సాక్షి): తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, గుర్తింపు ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారులు ఆందోళనకు దిగారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, గుర్తింపు కమిటీ నిర్లక్ష్యం వీడకపోతే కమిటీ సభ్యులందరి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం కరీంనగర్, వరంగల్, జనగామ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఉద్యమకారులు తార్నాకలోని మాజీ డిప్యూటీ మేయర్, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతే శోభన్‌రెడ్డి నివాసాన్ని ముట్టడించారు. ఆయన ఇంటి ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గుర్తింపు కమిటీ కాలయాపన వద్దు.. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులకు నేటికీ న్యాయం జరగకపోవడం విచారకరమన్నారు. గుర్తింపు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా కాలయాపన చేయకుండా అర్హులైన ఉద్యమకారులను గుర్తించి, వారికి ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గుర్తింపు కమిటీ సభ్యులందరి ఇళ్లను ముట్టడించి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మోతే శోభన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కాగా, ఆందోళన నేపథ్యంలో ఓయూ పోలీసులు ముందస్తుగా శోభన్‌రెడ్డి నివాసం వద్ద భారీగా మోహరించి పరిస్థితిని పర్యవేక్షించారు. నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఉద్యమకారుల ఆందోళనపై స్పందించిన మోతే శోభన్‌రెడ్డి మాట్లాడుతూ గత ఐదు నెలలుగా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులతో చర్చలు జరుపుతూ వారి అభిప్రాయాలు, సూచనలు సేకరిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తింపు కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. ఉద్యమకారుల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తులు స్వీకరించేందుకు వెబ్‌సైట్ సిద్ధమైందని, డిసెంబర్ 9న సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు వెల్లడించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ఎవరూ ఆత్మహత్యలకు లేదా ఆవేశపూరిత నిర్ణయాలకు పాల్పడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇటుక బట్టి వద్ద మహిళా హత్య

పని కోసం తీసుకొచ్చి కడతేర్చిన భర్త

- కొంగరకలాన్ వీఎస్‌బీ బ్రిక్స్ ఇటుక బట్టీలో ఘటన
- నాలుగు రోజుల క్రితమే ఒడిశా నుంచి వచ్చిన జంట
- ముగ్గురు పసిపిల్లల భవిష్యత్తు అగమ్యగోచరం
- బట్టీల్లో భద్రతపై పెరుగుతున్న ఆందోళన





రంగారెడ్డి, నవంబర్ 12 (జనంసాక్షి): వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో కట్టుకున్న భార్యను పక్కా పథకం ప్రకారం హతమార్చాడు ఓ కసాయి భర్త. పొట్టకూటి కోసం వలస వచ్చినట్లు నటిస్తూ, నాలుగు రోజుల క్రితమే ఇటుక బట్టీలో పనికి చేరి తన భార్యను కడతేర్చాడు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంగరకలాన్‌లో బుధవారం రాత్రి ఈ దారుణం చోటుచేసుకుంది. ఆదిభట్ల సీఐ రమేష్ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నబరంగ్‌పూర్ జిల్లా హలదిఖల్లియాపడ గ్రామానికి చెందిన గణేశ్యం పూజారి (33), తన భార్య ఉనితా పూజారి (32), ముగ్గురు పిల్లలతో కలిసి నాలుగు రోజుల క్రితం కొంగరకలాన్‌లోని వీఎస్‌బీ బ్రిక్స్ ఇటుక బట్టీలో పనికి చేరాడు. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో బట్టీ సూపర్‌వైజర్ రాజుపాలెం హేమాద్రి కార్మికుల హాజరును పరిశీలిస్తుండగా గణేశ్యం పూజారి గదిలో లేకపోవడాన్ని గమనించాడు. పక్క గదిలో ఉండే పీతాంబరి మాఝిని ఆరా తీయగా, గణేశ్యం దంపతులు నీళ్ల బకెట్ తీసుకుని బయటకు వెళ్లారని తెలిపాడు. కొద్దిసేపటికి గణేశ్యం ఒక్కడే తిరిగి వచ్చి, మళ్లీ దుప్పటి తీసుకుని బయటకు వెళ్లి తిరిగి రావడంతో సూపర్‌వైజర్‌కు అనుమానం వచ్చింది. గణేశ్యం తిరిగి గదికి రాగానే సూపర్‌వైజర్, తోటి కార్మికులు కలిసి ఒక్కడివే వచ్చావు, నీ భార్య ఏదని గట్టిగా నిలదీశారు. దీంతో అతడు అసలు నిజాన్ని బయటపెట్టాడు. స్వగ్రామంలో తన భార్యకు వేరొకరితో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో, ఆమెను హత్య చేయాలనే ఉద్దేశంతోనే ఉపాధి పేరుతో ఇక్కడికి తీసుకొచ్చినట్లు అంగీకరించాడు. బుధవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో బహిర్భూమికి అని చెప్పి గది వెనుక ఉన్న నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి, ఆమె ధరించిన నీలిరంగు కండువాతో గొంతు నులిమి హతమార్చినట్లు ఒప్పుకున్నాడు. మృతదేహం ఉన్న చోటు చూపిస్తానని చెప్పి సూపర్‌వైజర్, కార్మికులను ఆ ప్రాంతానికి తీసుకెళ్లిన గణేశ్యం, అక్కడికి చేరుకోగానే చీకటిని ఆసరాగా చేసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం కార్మికులు పరిసరాల్లో గాలించగా, చెట్ల మధ్య ఉనితా పూజారి మృతదేహం కనిపించింది. సూపర్‌వైజర్ హేమాద్రి వెంటనే ఆదిభట్ల పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. మేరకు ఆదిభట్ల పోలీసులు గురువారం భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 103 (1) కింద హత్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దిక్కుతోచని స్థితిలో ముగ్గురు చిన్నారులు...

ఈ ఘటనతో ఇటుక బట్టీలలో వలస కార్మికుల భద్రత, నిఘా లోపం మరోసారి చర్చనీయాంశమైంది. కనీస విచారణ, గుర్తింపు కార్డుల పరిశీలన లేకుండా కార్మికులను పనుల్లోకి తీసుకోవడం, బట్టీల వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో నేరస్థులు సులభంగా తప్పించుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, తల్లి హత్యకు గురికావడం, తండ్రి పరారీలో ఉండటంతో వారి ముగ్గురు పసిపిల్లలు పరాయి రాష్ట్రంలో దిక్కుతోచని స్థితిలో అనాథలుగా మిగిలిపోయారు. దాంతో మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనాథలుగా మారిన పిల్లను వారికి అప్పగించారు. కేసు దర్యాప్తు చేసినట్లు ఆదిభట్ల సీఐ తెలిపారు.



జనగణనలో కుల, మతరహితులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి

'నో కాస్ట్-నో రిలిజన్' కాలమ్స్ ఏర్పాటు చేయాలి

- కులరహిత, మతరహితుల అస్తిత్వానికి అధికారిక గుర్తింపు
- తెలంగాణ సర్వే విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలి
- కేంద్ర ప్రభుత్వానికి కుల నిర్మూలన సంఘం విజ్ఞప్తి

హయత్‌నగర్, నవంబర్ 12 (జనం సాక్షి): 2027లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న జనగణనలో కులరహితులు, మతరహితుల వివరాల నమోదుకు 'నో కాస్ట్-నో రిలిజన్' పేరుతో ప్రత్యేక కాలమ్స్ ఏర్పాటు చేయాలని కుల నిర్మూలన సంఘం డిమాండ్ చేసింది. కులాల వారీగా జనాభా లెక్కల సేకరణ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే, కులవ్యవస్థను, మత విశ్వాసాలను తిరస్కరించి జీవిస్తున్నవారికి ప్రత్యేక గుర్తింపు కల్పించాలని కోరింది. ఈ డిమాండ్‌పై రెండేళ్లుగా ఉద్యమిస్తున్న సంఘం రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రి సహా పలువురు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపింది. ఈ అంశంపై హైకోర్టును కూడా ఆశ్రయించినట్లు వెల్లడించింది. 2024లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిం చిన సామాజిక, కుల గణనలో కులరహితులకు 999, మతరహితులకు 01 కోడ్ కేటాయించి వివరా లు నమోదు చేసినట్లు గుర్తుచేసింది. ఈ సర్వేలో సుమారు 12 లక్షల మంది, అంటే రాష్ట్ర జనాభాలో 3.4 శాతం మంది కులరహితులుగా తమను ప్రకటించుకున్నారని పేర్కొంది. తెలంగాణలో అమలైన విధానాన్ని దేశవ్యాప్త జనగణనలోనూ అనుసరించాలని విజ్ఞప్తి చేసింది. కులం, మతం వ్యక్తిగత విశ్వాసాలకు సంబంధించి నవని, వాటిని స్వచ్ఛందంగా తిరస్కరించే హక్కు పౌరులకు ఉందని సంఘం పేర్కొంది. అలాంటి వారిని బలవంతంగా ఏదో ఒక కులం లేదా మతం పరిధిలో నమోదు చేయకుం డా ప్రత్యేక అస్తిత్వాన్ని గుర్తించాలని కోరింది. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు సి.ఎల్. ఎన్. గాంధీ, అధ్యక్షుడు వహీద్, ఉపాధ్యక్షులు జ్యోతి, సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కృష్ణ చంద్, డి.వి. రామకృష్ణ, అడ్వకేట్ సురేష్‌కుమార్, గ్రేస్, ప్రభాకర్, రఫీ, ఈశ్వర్‌లింగం, సూర్యసుధ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
13 నవంబర్ 2026

గ్రంథాలయ భవన నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలి

● కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జనం సాక్షి) : నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన పనులను వేగవంతం చేసి, నిర్దిత గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంక సంబం ధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద నూతన గ్రంథాలయ భవన నిర్మాణ పనులను జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, సంబంధిత శాఖల అధికా రులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భవనంలోని వివిధ గదులు, రీడింగ్ రూమ్, స్టోర్ రూమ్, ఇతర మౌలిక సదుపాయాల పనుల పురోగతిని అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పాఠకులకు, విద్యార్థులకు, యువతీ యువకులకు మెరుగైన గ్రంథాలయ సౌకర్యాలు అందించాలనే ఉద్దేశంతో నారాయణపేట జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణా నికి రూ.1.53 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.90 లక్షల విలువైన పనులు పూర్త య్యాయని, మిగిలినపనులుకొనసాగుతున్నాయని వివరించారు.అనంతరం కలెక్టర్ మాట్లా డుతూ గ్రంథాలయ భవనం నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇంజనీ రింగ్ అధికారులు రూపొం దించిన ప్రణాళిక ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులన్నీ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. భవన నిర్మా ణంలో వాస్తు, సౌకర్యవం తమైన నిర్మాణ విధానాల ను పరిగణనలోకి తీసుకోవ డంతో పాటు పాఠకులకు ఆహ్లాదకరమైన వాతావ రణం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రత్యేకంగా రీడింగ్ రూమ్ ను విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, పాఠకులు సౌకర్యవంతంగా కూర్చొని చదువుకునే విధంగా ఆకర్షణీయమైన డిజైన్‌తో అభివృద్ధి చేయాలని ఆదే శించారు. స్టోర్ రూమ్‌తో పాటు గ్రంథాలయానికి సంబంధించిన మిగిలిన గదులు, అంతర్గత పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భవనానికి అవసరమైన గ్లాస్ ఫ్యాబ్రి కేషన్ పనులను ఇంజనీ రింగ్ ప్లాన్ ప్రకారం నాణ్య తతో చేపట్టాలని, భవనం పై అంతస్తు (మిద్దె)పై చేప ట్టాల్సిన పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులు, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, గాలి, వెలు తురు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.అదేవిధంగా గ్రంథాలయ భవనం పక్కనే నిర్మాణంలో ఉన్న నీటి ట్యాంకు పనులను కూడా పరిశీలించిన కలెక్టర్, వాటిని డిసెంబర్ నెలలోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధి త అధికారులను ఆదేశించారు.

శిథిలావస్థలో ఉన్న పాత ఏరియా ఆసుపత్రి భవనం పరిశీలన అనంతరం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయానికి ఎదురుగా సివిల్ లైన్ ప్రాంతంలో ఉన్న పాత ఏరియా ఆసుపత్రి భవనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనం పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, భవనానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనం ప్రస్తుత స్థితి, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి అవసరమైన వివరాలను సేకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, పబ్లిక్ హెల్త్ ఈఈ విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, పబ్లిక్ హెల్త్ ఏఈ జ్ఞానేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

● కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులు కేటాయించాలి
● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు
● సివిల్ సప్లై డీఎం జయశ్రీలాల్‌కు వినతిపత్రం



సంగారెడ్డి నవంబర్ 12 (జనం సాక్షి) : జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో సివిల్ సప్లై డీఎం జయశ్రీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలోని పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచుల కొరత, హమాలీల సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు నష్టం కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. రమేష్ గౌడ్, నాయకులు విట్టల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

చేర్యాల, నవంబర్ 12 (జనంసాక్షి) : రైతులు ధాన్యాన్ని కల్లాల్లోకి తెచ్చుకుని రోజుల తరబడి ఎదురుచూస్తున్నా ఇప్పటివరకు వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శనమని చేర్యాల పట్టణ బీఆర్ఎస్ 12వ వార్డు ఇంచార్జి శివగారి అంజయ్య విమర్శించారు. గురువారం చేర్యాల పట్టణ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు నీరు లేక, కరెంటు కష్టాలతో పంటలు ఎండిపోయి నష్టపోతుంటే కాంగ్రెస్ నాయకులు సభలు, సమావేశాలతో గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు.ఇప్పటికైనా స్పందించి వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు చింతల పరశురాములు, యూత్ అధ్యక్షుడు యాట భిక్షపతి, కొమురవెల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్ ఊట్కూరి అమర్ గౌడ్, నాయకులు రాచకొండ శ్రీనివాస్, శనిగారి రాజు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం

● గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యం
● మెంటేపల్లిలో 351 మందికి రేషన్ కార్డులు, 26 మందికి పెన్షన్ కార్డుల పంపిణీ
● ఏడుగురు నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

వనపర్తి బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమ పాలన సాధ్యమని, ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.వనపర్తి మండలంలోని మెంటేపల్లి గ్రామంలో గురువారం మార్నింగ్ వాక్‌లో భాగంగా పర్యటించిన ఎమ్మెల్యే పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 351 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులు, 26 మందికి పెన్షన్ కార్డులు పంపిణీ చేశారు. గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందజేశారు.అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న నాలుగు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై లబ్ధిదారులను అభినందించారు. వారికి నూతన వస్త్రాలను అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. అలాగే గ్రామంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని, గ్రామ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద నిర్మించిన కమాన్‌ను ప్రారంభించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అర్హులైన పేదలకు రేషన్ కార్డుల పంపిణీ, సన్నబియ్యం పంపిణీ, రైతు భరోసా, రైతు బీమా, సన్నధాన్యానికి బోనస్, వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వివరించారు.గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న పేద కుటుంబాలకు నేడు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో భరోసా లభిస్తోందన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలు అలాంటి ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎస్సీ సర్పంచుల రాష్ట్ర అధ్యక్షుడు రాములు, వనపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవికిరణ్ యాదవ్, మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్ నాయక్, డీఆర్డీఓ ఉమాదేవి, తహసీల్దార్ రమేష్ రెడ్డి, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం ఇవ్వాలి

● కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను తక్షణమే అమలు చేయాలి
● ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సదాశివపేట, నవంబర్ 12 (జనంసాక్షి) : ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్‌ను తక్షణమే అమలు చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి నియోజకవర్గ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17,200 మంది రేషన్ డీలర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. ముఖ్యమంత్రి కొత్త క్యాంపు కార్యాలయం, ప్రహరీ నిర్మాణానికి వందల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. డీలర్లకు నెలకు రూ.10 కోట్లు వెచ్చించడానికి వెనుకాడటం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గోదాములు, ఎంఎల్ఎస్ పాయింట్లు, రేషన్ షాపుల్లో సుమారు రూ.600 కోట్ల విలువైన పాత దొడ్డు బియ్యం 16 నెలలుగా నిల్వ ఉండటంతో పురుగులు, ఎలుకల బారిన పడి నష్టపోయిందని ఆరోపించారు. ఆ బియ్యంలో ఏర్పడిన తరుగు మొత్తాన్ని డీలర్ల జేబుల నుంచి వసూలు చేయాలని సంగారెడ్డి జిల్లాలో అధికారులు వేధించడం సరికాదన్నారు. తక్షణమే ఈ వేధింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల నేపథ్యంలో పేద కుటుంబాలను ఆదుకునేందుకు రేషన్ షాపుల ద్వారా మరిన్ని సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు బియ్యం కోటాను పెంచడంతో పాటు డీలర్ల కమిషన్‌ను రూ.140కు పెంచిందని గుర్తుచేశారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో డీలర్ల సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సదాశివపేట అధ్యక్షుడు కె.బసంతప్ప, నిజాంపూర్ ప్రధాన కార్యదర్శి ఎం.మంతయ్య, కంది ప్రతినిధి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దోమడుగులో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి శంకుస్థాపన

● గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం
● మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

గుమ్మడిదల, నవంబర్ 12 (జనంసాక్షి) : గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ వార్డు కౌన్సిలర్లతో కలిసి శంకుస్థాపన చేశారు. గత గ్రామపంచాయతీ పాలకవర్గం హయాంలో కేంద్ర ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఈ ఆరోగ్య మందిరం నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మంజూరైన నిధులతో చేపట్టిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రాథమిక వైద్య పరీక్షలు, అవసరమైన ఆరోగ్య సేవలు గ్రామస్థాయిలోనే అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, మండల వైద్యాధికారి డాక్టర్ మధుకర్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, వార్డు కౌన్సిలర్లు రాజీ రెడ్డి, రాజశేఖర్, సోనీ, వరలక్ష్మి, నాయకులు గోవర్ధన్ గౌడ్, శేఖర్ రెడ్డి, కృష్ణ, వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అక్రమ కేసులు ఎత్తివేయాలి



గద్వాల, నవంబరు 12 (జనం సాక్షి) : సాగునీటి కోసం గత నెలలో ఆందోళన చేసిన రైతులు, నాయకులపై పెట్టిన అక్రమ కేసులు, నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని గురువారం మీడియా సమావేశంలో తెలంగాణ రైతాంగ సమితి డిమాండ్ చేసింది. పంటలు ఎండిపోతున్నా సకాలంలో నీరివ్వకుండా, ఇటీవల జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని వృథాగా దిగువకు వదిలిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.గోపాల్, జిల్లా కార్యదర్శి సత్యా రెడ్డి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కాపాడుకోవడం కోసం రోడ్డెక్కిన అన్నదాతలను అణచివేయడం దారుణమని మండిపడ్డారు.సాగునీటి నిర్వహణలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే నేడు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రాజెక్టుల కింద నీటి వృథాపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు.ఆయకట్టు చివరి భూములకు సైతం సాగునీరు అందేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారిపై నమోదైన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు.ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ మీడియా సమావేశంలో తెలంగాణ రైతాంగ సమితి జిల్లా నాయకులు, వివిధ గ్రామాల రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరకద్ర అభివృద్ధిపై ఎమ్మెల్యే జీఎంఆర్ - కలెక్టర్ భేటీ



దేవరకద్ర, నవంబర్ 12 (జనం సాక్షి) దేవరకద్ర నియోజకవర్గంలోని పలు సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో చర్చించారు. ఈ సందర్భంగా దేవరకద్ర పట్టణంలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించాలని, స్టేడియం నిర్మాణం కోసం అదనంగా 3 ఎకరాల 30 గుంటల భూమిని కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే చిన్నచింతకుంట జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి సంబంధించిన అంశాలను చర్చించారు. భూత్పూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాబోయే రోజుల్లో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రస్తావించిన అంశాలపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సానుకూలంగా స్పందించారు.

క్రీడా, విద్యా రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

● యువత భవిష్యత్తుకు సీఎం రేవంత్ రెడ్డి బాటలు
● క్రీడాభివృద్ధికి రూ.760 కోట్ల బడ్జెట్ కేటాయింపు
● ప్రతిభావంతులైన క్రీడాకారులకు వ్యక్తిగతంగా అండగా ఉంటా
● ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి) : క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి దోహదపడతాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. విద్యా, క్రీడా రంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విశేష ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు.గురువారం పెద్దమందడి మండల కేంద్రంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల క్రీడాకారులు పాల్గొనేలా నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, క్రీడల అభివృద్ధి కోసం రూ.760 కోట్ల బడ్జెట్ కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి తగిన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. విద్యార్థులకు ప్రత్యేక కిట్లు అందిస్తూ వారి చదువుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని, పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.

ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు

ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు ఎప్పుడు జీతాలు వస్తాయో తెలియని పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు అందించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి, ఖిల్లా ఘణపురం మార్కెట్ యార్డుల అధ్యక్షురాలు నవనీత క్యామ రాజు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ఎంఈఓ శాంతయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సర్పంచులు గంగా టైలర్ రవి, స్వరూప వెంకటస్వామి, మంగంపల్లి సర్పంచ్ రమేష్, స్కూల్ తండా సర్పంచ్ మన్నెం, వీరాయిపల్లి సర్పంచ్ వెంకటయ్య, దొడగుంటపల్లి సర్పంచ్ పెంటయ్య, పెద్దమందడి ఉపసర్పంచ్ ఉషన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



భూ రీసర్వే పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలి

□ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



బెల్లంపల్లి, నవంబర్ 12 (జనంసాక్షి): భూ రీసర్వే పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూ రీ సర్వే, జిఓ నంబర్ 59, 76 అమలు, భూభారతి డిజిటల్ ప్రక్రియ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత దరఖాస్తులు, సర్వే పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. సింగరేణి ప్రాంతానికి సంబంధించిన భూ సమస్యలు, జిఓ నంబర్ 76 క్రింద చేపట్టవలసిన చర్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. భూ రీ సర్వే పనులు వేగంగా పూర్తయ్యేలా తహసిల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, సర్వే సిబ్బంది ఉదయాన్నే గ్రామాలకు చేరుకొని పనులు ప్రారంభించేలా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించేందుకు చర్యలు

□ నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ రూరల్, నవంబర్ 12 (జనంసాక్షి) : అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించడంతో పాటు, లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సోన్ మండలం సంగెంపేట్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లకు అవసరమైన అన్ని సదుపాయాలను త్వరితగతిన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలని, తద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే, జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ వివిజి రామ్ జీ పథకం ద్వారా ఉపాధి పనులు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, హౌసింగ్ డీఈ గంగాధర్, సర్పంచ్ విలాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తమ్ముడి హత్య కేసులో అన్నకు జీవిత ఖైదు

నల్లబెల్లి, నవంబర్ 12 (జనంసాక్షి): తమ్ముడిని హత్య కేసులో నిందితుడికి వరంగల్ జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదు తోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్లు ఎస్సై సాయి ప్రసన్న కుమార్ గురువారం పత్రికా ముఖంగా వెల్లడించారు. అతను తెలిపిన వివరాల ప్రకారం నల్లబెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన కుండె రవి (40) తన తమ్ముడు కుండె కుమార్ (32) హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి కుండె ఇలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు క్రైమ్ నంబర్ 18/2024 కింద ఐపీసీ 302 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన వరంగల్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు ఎస్సీ నంబర్ 30/2026లో నిందితుడు కుండె రవికి జీవిత ఖైదుతో పాటు రూ.2 వేల జరిమానా విధించిందని తెలిపారు. ఈ కేసులో అప్పటి దుగ్గొండి సీఐ పి. కిషన్ సమగ్ర దర్యాప్తు చేపట్టగా, సీఐ బి. రాజగోపాల్ చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుతం దుగ్గొండి సీఐ జె. శంకర్‌రావు కేసు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీధర్‌రావు వాదనలు వినిపించారు. కోర్టు లైజన్ అధికారిగా ఎస్ఐ కాంతేటి హరికృష్ణ, కోర్టు డ్యూటీ అధికారిగా ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన పీసీ నంబర్ 2473 నామిండ్ల మహేష్ సమన్వయం చేశారు. నేరస్తులకు శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసి, కోర్టులో పటిష్టమైన ఆధారాలు సమర్పించిన పోలీసు అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

□ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



పరకాల, నవంబర్ 12,(జనంసాక్షి): ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, భూ రీ–సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం పరకాల పట్టణ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తో కలిసి ఎమ్మెల్యే వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించాలన్నారు. భూ రీ–సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. రెవిన్యూకి సంబంధించిన ఏ ఒక్క దరఖాస్తు పెండింగ్ లో ఉండకుండా, క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకన్న, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ రూ.500 నోట్ల కలకలం



కొటాల నవంబర్ 12 (జనంసాక్షి) : మండలంలో నకిలీ రూ.500 నోట్ల వ్యవహారం కలకలం రేపుతోంది. హెచ్‌పీ గ్యాస్ కోసం గుర్తుతెలియని వ్యక్తులు గురువారం నకిలీ రూ.500 నోట్లను ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటనతో స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. మండలంలోని పలు ప్రాంతాల్లో నకిలీ నోట్లు జోరుగా చలామణి అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ నోట్లను మార్కెట్‌లోకి పంపుతున్నారన్న సమాచారంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.నోట్లను స్వీకరించే సమయంలో వ్యాపారులు, ప్రజలు జాగ్రత్తగా పరిశీలించాలని పలువురు సూచిస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అసైన్డ్ భూముల్లో రెవెన్యూ అధికారుల సర్వే

□ మోకా మీద ఎవరున్నారనే కోణంలో విచారణ

□ రెవెన్యూ కార్యాలయంలో రికార్డుల పరిశీలన

□ అధికారుల నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టనున్న ఉన్నతాధికారులు

□ జనంసాక్షి కథనాలకు కదిలిన రెవెన్యూ అధికారులు..!



వెంకటాపూర్(రామప్ప), నవంబర్ 12(జనం సాక్షి): 'జనంసాక్షి' దినపత్రికలో వరుసగా ప్రచురితమైన కథనాలకు చివరకు రెవెన్యూ యంత్రాంగం కదిలింది. 'నేను మోనార్క్.. నన్నెవరేం చేయలేరు' అంటూ కబ్జాకోరు రెచ్చిపోతున్న తీరుపై, 368, 341, 441 సర్వే నంబర్లలోని అసైన్డ్ భూముల అక్రమాలపై "జనం సాక్షి" వరుస కథనాలు ప్రచురించింది. ఆ కథనాలు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వెంకటాపూర్ మండలంలో రెవెన్యూ అధికారులు హుటాహుటిన రంగంలోకి దిగారు. ఇన్నాళ్లు ఫైళ్లకే పరిమితమైన విచారణ ఇప్పుడు క్షేత్రస్థాయికి చేరింది. తాసిల్ కార్యాలయంలో రికార్డులు తిరగేస్తున్నారు. భూములపై సర్వే చేస్తున్నారు. కబ్జాకోరు బెదిరింపులకు భయపడకుండా నిష్పక్షపాత విచారణ జరుగుతుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జనంసాక్షి కథనాల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు మండలంలోని అసైన్డ్ భూముల్లో నేరుగా సర్వే చేపట్టారు. 368, 341, 441 సర్వే నంబర్లలో ఉన్న సుమారు 50 ఎకరాల అసైన్డ్ భూమిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఏ సర్వే నంబర్లో ఎంత భూమి ఉంది, అది ఎవరి పేరు మీద అసైన్ అయ్యింది, ప్రస్తుతం ఆ భూమిపై ఎవరు సాగు చేస్తున్నారు, ఎవరు కబ్జా చేసి ఉన్నారు అనే వివరాలను క్షేత్రస్థాయిలో సేకరిస్తున్నారు. గ్రామాల వారీగా వెళ్లి భూమిని కొలిచి, హద్దులు గుర్తించి, ఆక్రమణలు ఉన్నాయా అని పరిశీలిస్తున్నారు. గ్రామ మ్యాపులు, అసైన్డ్ రిజిస్టర్లు, ప్రస్తుత ధరణి రికార్డులను సర్వేతో పోల్చి చూస్తున్నారు. ఒకే భూమికి వేర్వేరు పేర్లతో పట్టాలు, హద్దుల్లో సర్వే నంబర్లలో మార్పులు ఉన్నాయా అని కూడా నిశితంగా పరిశీలిస్తున్నారు.

రికార్డుల పరిశీలన

క్షేత్రస్థాయి సర్వేతో పాటు తాసిల్ కార్యాలయంలో రికార్డుల పరిశీలన కూడా ముమ్మరంగా సాగుతోంది. అసైన్డ్ భూములకు సంబంధించిన పాత రికార్డులు, పట్టా పాస్ బుక్కులు, మ్యుటేషన్ వివరాలు, సర్వే మ్యాపులు అన్నింటినీ బయటకు తీసి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఎవరికి ఎప్పుడు పట్టా ఇచ్చారు, ఆ పట్టా నిబంధనల ప్రకారం ఇచ్చారా, లేదా నిబంధనలు ఉల్లంఘించి ఇచ్చారా అనే కోణంలో రికార్డులు తిరగేస్తున్నారు. పట్టాల్లో తప్పుడు సమాచారం నమోదు చేశారా అనే అంశాలపై అధికారుల విచారణ జరుగుతోంది. ఒకే భూమికి రెండు రకాల రికార్డులు ఉన్నాయా, అసైన్డ్ భూమిని ఇతరులకు అమ్మారా, బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ జరిగిందా అనే అంశాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. కంప్యూటర్ రికార్డులకు, మాన్యువల్ రికార్డులకు మధ్య తేడా ఉందా అనే కోణంలో కూడా సరిచూస్తున్నారు.

మోకా మీద ఎవరున్నారనే కోణంలో విచారణ

ఈ విచారణలో అధికారులు అత్యంత కీలకమైన కోణంపై దృష్టి పెట్టారు. భూమి మీద వాస్తవంగా ఎవరున్నారు, రికార్డుల్లో ఎవరి పేరు ఉంది, వారికి పట్టా పాస్ బుక్కులు ఎలా వచ్చాయి అనే కోణంలో ఉమ్మరంగా విచారణ చేస్తున్నారు. అసైన్డ్ భూమిని పొందడానికి అర్హులైన పేదల పేరు మీద పట్టా ఉండి, క్షేత్రంలో మరొకరు ఉంటే అది ఎలా సాధ్యమైందని ఆరా తీస్తున్నారు. పట్టా పొందిన వ్యక్తి భూమిని అమ్మాడా, లేదా అతని పేరును అడ్డుపెట్టుకుని మరొకరు కబ్జా చేశారా, అధికారుల అండదండలతో పాస్ బుక్కులు మారాయా అనే అంశాలపై లోతుగా వెళ్తున్నారు. బినామీల పాత్ర ఉందా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు అసైన్డ్ భూములను చేజిక్కించుకునేందుకు ఎలాంటి మార్గాలు వాడారు అనే దానిపై కూడా ఆరా తీస్తున్నారు. "నా వెనుక ఎవరున్నారో తెలుసా" అంటూ బెదిరించిన వ్యక్తికి ఆ భూములు ఎలా వచ్చాయి, అతనికి పట్టాలు, రైతుబంధు, బ్యాంకు రుణాలు ఎలా అందుతున్నాయి అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. స్థానికుల నుంచి కూడా స్టేట్మెంట్లు తీసుకుంటున్నారు.

నివేదిక ఆధారంగా చర్యలు

ఈ సర్వే, రికార్డుల పరిశీలన పూర్తయిన తర్వాత అధికారులు సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు. ఆ నివేదిక ఆధారంగానే కబ్జాదారులపై, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టనున్నారు. అసైన్డ్ భూమిని అక్రమంగా కొనుగోలు చేసిన వారిపై, అమ్మిన వారిపై, అందుకు సహకరించిన వారిపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అక్రమ పట్టాలు ఉంటే న్యాయపరమైన ప్రక్రియ ద్వారా రద్దు చేసే అవకాశం కూడా ఉందని సమాచారం. ఈ వ్యవహారాన్ని కేవలం మండల స్థాయి విచారణకు పరిమితం చేయకుండా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి, జిల్లా స్థాయి నుంచి ప్రత్యేక విచారణ బృందాన్ని వేసి, బెదిరింపులకు లొంగకుండా నిష్పక్షపాత విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి, వాటిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ పనులకు వాడుకుంటే అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. 'జనంసాక్షి' కథనాలతో మొదలైన ఈ విచారణ ఎంతమంది భూకబ్జాదారుల భరతం పడుతుందోనని మండలంలో ఆసక్తి నెలకొంది.

అభివృద్ధి పనులలో పురోగతి సాధించాలి

□ జిల్లా కలెక్టర్ కె.హరిత



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 12(జనంసాక్షి): పర్యావరణాన్ని కాపాడుకుంటూ, వన్యప్రాణులను రక్షించుకుంటూ, అటవీ శాఖ అనుమతులతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, జిల్లా అటవీ అధికారి బాలమణి, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, అదనపు ఎస్.పి. చిత్తరంజన్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి జిల్లాస్థాయి అటవీ పరిరక్షణ కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అడవిని కాపాడుకుంటూ, వన్యప్రాణులను రక్షించుకుంటూ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరువయేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడి, గ్రామపంచాయతీ, స్వయం సహాయక సంఘాల భవనాలు, పంచాయితీ రాజ్, రహదారులు భవనాలు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖల పరిధిలోని రహదారుల నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు పొంది పనులు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియలో అటవీ, రెవెన్యూ శాఖల సమన్వయంతో సరిహద్దు వివాదాలు పరిష్కరించాలని తెలిపారు. వి బి జి రామ్ జి పథకం క్రింద కూలీలకు పనుల కల్పనలో భాగంగా పెద్ద ఎత్తున చెక్ డ్యామ్ నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారుల పనులు ప్రధానమంత్రి జన్ మన్, ప్రధానమంత్రి జూగా పథకంలో మారుమూల గిరిజన గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి పనులలో అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా అటవీ అధికారి మాట్లాడుతూ జిల్లాలో అక్రమ కలప రవాణా జరగకుండా, అటవీ భూమి ఆక్రమణ జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని, సంబంధిత శాఖల అధికారులు అటవీ శాఖకు సహకరించాలని తెలిపారు. అభివృద్ధి పనులలో పారదర్శకంగా అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, అటవీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు వైద్య ఖర్చులపై ప్రభుత్వ భరోసా

□ 23 మంది బాధితులకు రూ.11.17 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



దేవరుప్పుల, నవంబర్ 12 (జనంసాక్షి): అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. దేవరుప్పుల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 23 మంది అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.11,17,000 విలువైన చెక్కులను గురువారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఆసుపత్రి ఖర్చులు తట్టుకోలేని భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేవనే కారణంతో ఎవరికీ మెరుగైన వైద్యం అందకుండా ఉండకూడదన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, నిరుపేద కుటుంబాలకు వైద్యపరంగా భరోసా కల్పించడమే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని యశస్విని రెడ్డి భరోసా ఇచ్చారు.సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్, జిల్లా నాయకుడు కాసారపు ధర్మారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు, దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

□ కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): రాబోయే గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదా యంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి దేవాదాయ, పోలీసు, పంచాయతీరాజ్, విద్యుత్, రహదారులు భవనాలు, సమాచార, తాగునీరు, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనులు సకాలంలో పూర్తి చేయాలని, తాత్కాలిక, శాశ్వత పనులను గుర్తించి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అంచనాలు వెంటనే సిద్ధం చేసి, పనులను వాయిదా వేయకుండా గడువులోగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా పార్కింగ్ కోసం ఎర్రనేలలు, విశాల ప్రదేశాలు గుర్తించాలని, నీటిలో తడవని పెద్ద గుడారాలు, షెడ్లు ఏర్పాటు చేయాలని, సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని, పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ గది ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూఆర్ కోడ్లు, ఆన్‌లైన్ చెల్లింపులతో నగదు రహిత సేవలు అందుబాటులోకి తేవాల న్నారు. శుక్రవారం వరకు తుది నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ.. భక్తుల, వాహనాల రద్దీని అంచనా వేసి పార్కింగ్, బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతపై దృష్టి పెట్టాలని, సిగ్నల్ సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఖోఖోపోటీలకు ఉప్పరపల్లి విద్యార్థిని లావణ్య

చెన్నారావుపేట, నవంబర్ 12 (జనంసాక్షి): అండర్ 17 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జి ఎఫ్ఐ) ఖోఖోపోటీలకు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత విద్యార్థిని లావణ్య ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్నలు గురువారం తెలిపారు.అక్టోబర్ 31 న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఖోఖో పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల నవంబర్ 13, 14 ,15 తేదీలలో మేడ్చల్ జిల్లా తుమ్ కుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని, రాష్ట్రస్థాయి పోటీలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ప్రధానోపాధ్యాయురాలు జయ కోరారు. విద్యార్థిని లావణ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్నలను ప్రధానోపాధ్యాయురాలు జయతో పాటు ఉపాధ్యాయులు సునీత , శశిధర్, సంతోష్ కుమార్, పిన్నింటి బాలాజీ రావు, మొగిలి, సుందర్, సతీష్ కుమార్, రామకృష్ణ, క్రాఫ్ట్ టీచర్ కింద ఇందిర, జూనియర్ అసిస్టెంట్ జాహేద్ లు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైన విద్యార్థిని నల్లతీగల కీర్తి



వరంగల్ ఈస్ట్, నవంబర్ 12 (జనంసాక్షి) : వరంగల్ నగరంలోని రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నల్లతీగల కీర్తి రాష్ట్రస్థాయి అండర్ 17 ఖో ఖో పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసిపల్లి రామకృష్ణారెడ్డి ,ఫిజికల్ డైరెక్టర్ గోగు నారాయణ తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని తుంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరిగే70 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలలో పాల్గొంటుందని వారు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
13 నవంబర్ 2026

మైనింగ్ కార్యకలాపాలపై సమగ్ర సర్వే చేసి నివేదిక ఇవ్వాలి

- ఎస్టీ ప్రజల సమస్యల పరిష్కారానికి కమిషన్‌ను ఆశ్రయించాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ నాయక్



దేవరకొండ, నవంబర్ 12 (జనం సాక్షి) : షెడ్యూల్డ్ తెగల ప్రజలు తమ హక్కుల సాధన కోసం జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్‌ను ఆశ్రయించాలని కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ నాయక్ పిలుపునిచ్చారు. ఎస్టీ కమిషన్ కోర్టు ప్రజల హక్కుల సాధనకు ఒక ఆయుధమని, కమిషన్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే డైరీ నంబర్ కేటాయించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గురువారం నల్గొండ జిల్లా దేవరకొండ మండలంలోని వెంకట్ తండా, బొల్లిగుట్ట తండా, కాచారం గ్రామాల్లో ఆయన పర్యటించి గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ కార్యకలాపాల వల్ల కలుగుతున్న ఇబ్బందులు, రహదారులు, విద్యుత్ సౌకర్యం, భూముల పట్టాలు తదితర సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మైనింగ్ సమస్యలపై మైనింగ్, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశించారు. శ్రీ వెంకటేశ్వర వెంగమాంబ మైనింగ్ కార్యకలాపాలపై ప్రజలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని సూచించారు. మైనింగ్ ప్రభావాలను పరిశీలించి ఫొటోలు, వీడియోలతో ఐదు రోజుల్లో ప్రాథమిక నివేదిక, సంబంధిత శాఖలు 15 రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మైనింగ్ లీజుల రెన్యువల్ సమయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారా? గ్రామస్తులకు సమాచారం ఇచ్చారా? పబ్లిక్ హియరింగ్‌కు సంబంధించిన ఆధారాలు ఉన్నాయా? అని మైనింగ్ యాజమాన్యాలను ప్రశ్నించారు. మైనింగ్ ప్రాంతాల్లో స్థానికులకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని స్పష్టం చేశారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని, అసంపూర్తిగా పనులు వదిలేసిన కాంట్రాక్టర్ల ఒప్పందాలను రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని అధికారులకు సూచించారు. బొల్లిగుట్ట తండాలో అర్హులైన గిరిజనులకు భూముల పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. వారం రోజుల్లో విద్యుత్ సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించాలని విద్యుత్ శాఖ డీఈకి సూచించారు. భూముల సర్వేను సోమవారం నాటికి పూర్తి చేసి అర్హులైన పట్టాదారులు ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.కాచారం గ్రామంలో మైనింగ్ సమస్యల పరిష్కారం కోసం గత 32 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులతో మాట్లాడారు. సమ్మె విరమించాలని కోరుతూ, ప్రభుత్వ పరంగా వారికి రావాల్సిన సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరిజనులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్రామాల్లో పర్యటన సందర్భంగా ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను అధికారులు తీవ్రంగా పరిగణించి నిర్ణీత గడువులో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జాతోతు హుస్సేన్ నాయక్ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఎన్‌సీఎస్టీ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాంబాబు, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, ఆర్డీఓ వనజరాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, డీఎంహెచ్ఓ రాహుల్, ఆర్డీఓ , తాసిల్దార్, డిఎస్పి ,ఎంపీడీఓ,సర్పంచులు భీముడు, బుజ్జి, హరిలాల్, శ్యామలయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే పై రైతులకు సమాచారం ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బద్దెనపల్లిలో భూముల రీ సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్



రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 12 (జగన్ సాక్షి) : భూముల రీసర్వే పై రైతులకు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ గురువారం సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రీ సర్వే ప్రక్రియ చేపడుతున్న బృందం భూముల వివరాలను ఖచ్చితత్వంతో సేకరించాలని, రైతులకు భూముల రీ సర్వేపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతుల సమక్షంలో భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలని తెలిపారు.ఇట్టి సమావేశంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, ఇంచార్జి తహసీల్దార్ మురళి తదితరులు పాల్గొన్నారు.

గత 3 నెలల సన్న బియ్యం స్టాక్‌లో 76.76 క్వింటాళ్ల కొరత

- చౌక ధరల దుకాణంలో తనిఖీ
- డీలర్‌పై 6A కేసు నమోదు..



కామేపల్లి, నవంబర్ 12 (జనం సాక్షి) : సాధారణ తనిఖీలలో భాగంగా, జిల్లాలోని కామేపల్లి మండలం, గరిడేపల్లి గ్రామంలోని చౌక ధరల దుకాణం నెం. 2223009 ను జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ తమ సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేశారు . తనిఖీ సమయంలో చౌక దుకాణంలోని స్టాక్ రికార్డులను, భౌతికంగా ఉన్న నిల్వలతో సరిపోల్చి చూడగా, గత మూడు నెలల సన్న బియ్యం స్టాక్‌కు సంబంధించి ఉండవలసిన 76.76 క్వింటాళ్ల బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు పౌరసరఫరాల అధికారి తెలిపారు. పేద ప్రజలకు అందవలసిన సన్న బియ్యంను అక్రమంగా అమ్ముకున్న సదరు డీలర్‌పై శాఖపరంగాను, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, లబ్ధిదారులకు అందాల్సిన సరుకులు సక్రమంగా పంపిణీ అయ్యేలా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పౌరసరఫరాల అధికారి హెచ్చరించారు.

కట్టెల అక్రమ విక్రయంపై తప్పుదోవ పట్టించే యత్నం

- ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఇచ్చిన రిపైనే పైకి పంపిన అధికారులు?
- క్షేత్రస్థాయి విచారణ లేకుండానే పైనుంచి రిపోర్టు రావాలి అంటూ ఏఈ శ్రవణ్ దాటవేత
- కట్టెలు అమ్మింది వాస్తవమా, అవాస్తవమా తేల్చకుండానే మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నం
- మెడికల్ లీవ్ నుంచి విధుల్లోకి చేరిన సదరు ఉద్యోగి..
- కాపాడేందుకు అధికారుల నాటకాలు!



మాడుగులపల్లి, నవంబర్ 12 (జనం సాక్షి) : మాడుగులపల్లి మండల కేంద్రంలోని 132/33 కేవీ ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో ప్రభుత్వ సొత్తు (చెట్ల కట్టెలు) అక్రమ విక్రయ వ్యవహారాన్ని అధికారులు పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. రూ. 5,000 ఆన్‌లైన్ అడ్వాన్స్ తీసుకొని కట్టెలు విక్రయించిన ఆధారాలు బయటపడినప్పటికీ, బాధ్యులపై చర్యలు తీసుకోకుండా వ్యవహారాన్ని నీరుగార్చేలా అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిందితుడి రిపోర్టునే పైకి పంపిన వైనం..!

ఈ వ్యవహారంపై తాజాగా సబ్‌స్టేషన్ ఏఈ (సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్) శ్రవణ్‌ను వివరణ కోరగా విస్మయకరమైన సమాధానం వచ్చింది గతంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జారీ చేసిన మెమోకు మెడికల్ లీవ్ ముగించుకొని తిరిగి విధుల్లోకి చేరిన సదరు ఉద్యోగి రిపై లెటర్ ఇచ్చారని ఏఈ తెలిపారు అయితే, క్షేత్రస్థాయిలో అసలు కట్టెలు అమ్మింది వాస్తవమా? అవాస్తవమా? ఎవరికైనా ఆర్థిక లాభం జరిగిందా? అనే అంశాలపై స్థానికంగా ఎలాంటి విచారణ జరపకుండానే కేవలం ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి రాసిచ్చిన రిపోర్టును మాత్రమే ఉన్నతాధికారులకు పంపించినట్లు ఆయన వెల్లడించారు. పైనుంచి రిపోర్టు రావాలని చెబుతూ సమాధానాన్ని దాటవేశారు.

అసలు విషయాన్ని కప్పిపుచ్చే నాటకం!

సబ్‌స్టేషన్ ఆవరణలో జరిగిన అక్రమంపై స్థానికంగా విచారణ జరిపి వాస్తవాలను ఉన్నతాధికారులకు నివేదించాల్సిన బాధ్యతాయుతమైన అధికారులే ఇలా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. తప్పు చేసిన వ్యక్తి ఇచ్చిన వివరణనే ప్రామాణికంగా తీసుకొని పైకి పంపడం వెనుక, జరిగిన వాస్తవాన్ని పక్కకు తోసి కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది ఆధారాలు కళ్లముందే కనిపిస్తున్నా సదరు ఉద్యోగిని కాపాడేందుకు అధికారులు ఆడుతున్న ఈ నాటకంపై స్థానికులు, ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్వయంగా క్షేత్రస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

భద్రాచలంలో యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా..

- అడ్డుకునే అధికారులేరీ?
- పేదోడి ఇంటి నిర్మాణానికి ఇసుక కరువు
- అక్రమార్కులకు మాత్రం కాసుల వర్షం



భద్రాచలం, నవంబర్ 12 (జనంసాక్షి) : భద్రాచలంలో సామాన్యుడు సొంతింటి నిర్మాణం చేపట్టాలంటే ఇసుక దొరకని పరిస్థితి నెలకొనగా, అక్రమ రవాణాదారులు మాత్రం ఇసుక దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అడ్డుకునే అధికారులెవరూ కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కూనవరం రోడ్డులో జాతీయ రహదారి వెంబడి ఇసుక లోడుతో ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో సైతం వైరల్ అవుతున్నా సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కుల దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని ఆరోపిస్తున్నారు. మరోవైపు గోదావరి నది చెంతనే ఉన్నప్పటికీ సామాన్యులకు అవసరమైన సమయంలో ఇసుక అందుబాటులో లేక నిర్మాణ పనులు నిలిచిపోతున్నాయి. ఇసుక కొరతను ఆసరాగా చేసుకుంటున్న కొందరు అక్రమ రవాణాదారులు మాత్రం అధిక ధరలకు ఇసుక విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామాన్యుడికి అందని ఇసుక అక్రమార్కులకు మాత్రం ఎలా అందుబాటులో ఉంటోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాపై వస్తున్న ఆరోపణలను సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గోదావరి ఒడ్డున ఇసుక ఉన్నా పేదోడి ఇంటి నిర్మాణానికి మాత్రం అది అందుబాటులో లేకపోవడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

ఫార్మ్ పాండ్‌లో జలకళ..

- రైతుల్లో హర్షం!
- పనులు జరుగుతుండగానే పైకి ఉబికి వచ్చిన భూగర్భ జలాలు..
- సాగుకు భరోసా



చింతపల్లి, నవంబర్ 12 (జనంసాక్షి) : చింతపల్లి మండలం రాయినిగూడెం గ్రామ పంచాయతీలో రైతుల ప్రయోజనార్థం నిర్మిస్తున్న ఫార్మ్ పాండ్ (పంట కుంట)లో భూగర్భ జలాలు పైకి ఉబికి రావడంతో గ్రామ రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. వర్షపు నీటిని నిల్వ చేసేందుకు చేపట్టిన పంట కుంట పనులు కొనసాగుతుండగానే నీరు బయటకు రావడం శుభపరిణామంగా మారింది.

ఈ ఫార్మ్ పాండ్ ద్వారా వర్షపు నీటిని ఒడిసిపట్టడంతో పాటు భూగర్భ జలాల మట్టం పెరిగి చుట్టుపక్కల బోర్లలో నీటి లభ్యత మెరుగుపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో పంటల సాగుకు నీటి ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు మేలు చేకూర్చేలా పనులు చేపట్టిన గ్రామ సర్పంచ్ కుర్మేటి హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి వినోద్‌రెడ్డి, మేట్‌తో పాటు పనుల్లో శ్రమిస్తున్న కూలీలను రైతు ఎలిసేటి అనంతరాములు అభినందించారు.

దేవరకొండ కొత్త బస్టాండ్ దారిలో ట్రాఫిక్ కష్టాలు

- అక్రమ పార్కింగ్, రోడ్డు ఆక్రమణలతో ప్రయాణికులకు అవస్థలు
- సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం
- డిపో మేనేజర్ విజయకుమారి



దేవరకొండ, నవంబర్ 12 (జనం సాక్షి) : దేవరకొండ పట్టణంలోని నూతన బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన మార్గం అక్రమ పార్కింగ్, రోడ్డు ఆక్రమణలతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలను గంటల తరబడి నిలిపివేయడంతో పాటు తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు రహదారిని ఆక్రమిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు, ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్‌తో నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ మార్గంలో పార్కింగ్ నియంత్రణ చేపట్టి, నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యపై డిపో మేనేజర్ విజయకుమారి స్పందన

ఈ సమస్యపై డిపో మేనేజర్ విజయకుమారి స్పందిస్తూ.. నూతన బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్య తన దృష్టికి వచ్చిందని, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసుల సహకారంతో అక్రమ పార్కింగ్‌ను నియంత్రిస్తామని, వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించి బస్టాండ్ ఆవరణలో వాహనాలు నిలిపితే జరిమానాలు విధించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసి సిబ్బందితో పర్యవేక్షణ కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలి మృతి

చేర్యాల, నవంబర్ 12 (జనంసాక్షి) : మండలంలోని దానంపల్లి గ్రామంలో ట్రాక్టర్ రివర్స్ లో ఢీ కొన్న ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాయితోజు వెంకటలక్ష్మి (70) మృతి చెందారు. జీపీ ట్రాక్టర్ డ్రైవర్ లింగాల కనకయ్య వెనుక చూసుకోకుండా రివర్స్ తీయడంతో వెనుక టైరు ఆమె కాళ్లపై నుంచి వెళ్లింది. తీవ్రంగా గాయపడిన ఆమెను సిద్దిపేట జీజీహెచ్ కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలి కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గూడ అపూర్వ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి

- భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 12 (జనం సాక్షి) : రైతులందరూ సమన్వయంతో సహకరిస్తేనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం మునుగోడు మండలం సింగారం గ్రామంలో భూముల రీ సర్వే అనంతరం జారీ చేసిన నోటీసులపై రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాల పరిష్కారానికి నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలో మొత్తం 255 ఖాతాలకు సంబంధించి 417 ల్యాండ్ పార్సెల్ మ్యాపులు (ఎల్‌పీఎంఎల్) జారీ చేయగా, వాటిపై 59 అభ్యంతరాలు వచ్చినట్లు కలెక్టర్‌కు వివరించారు. గ్రామకంఠం సరిహద్దులు, ప్రభుత్వ భూములు, రహదారులు, పట్టా భూములను సమగ్రంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించినట్లు తెలిపారు.అభ్యంతరాలు వ్యక్తం చేసిన రైతులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ ప్రక్రియ ద్వారా పాత సమస్యలు పరిష్కారం కావాలే తప్ప కొత్త సమస్యలు తలెత్తకూడదని స్పష్టం చేశారు. చట్ట ప్రకారం భూముల హద్దులు నిర్ణయించి, అర్హులైన రైతులకు వారి భూములకు సంబంధించిన పట్టాలు అందజేస్తామని తెలిపారు.రానున్న రోజుల్లో అభ్యంతరాల స్వీకరణకు కేవలం 25 రోజుల గడువు మాత్రమే ఉంటుందని పేర్కొంటూ, రైతులు పక్కనున్న భూయజమానులతో సామరస్యంగా చర్చించుకొని అనవసర వివాదాలకు తావివ్వకుండా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామంలో మిగిలిపోయిన రీ సర్వే ప్రక్రియకు కూడా గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు. గ్రామసభలో రైతులు తమ భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పట్టాదారు పాసుపుస్తకాల ప్రకారం భూముల హద్దులు నిర్ణయించాలని, అన్నదమ్ముల మధ్య భూ పంపకాల వివాదాలు, భూమి ఉన్నప్పటికీ పట్టాలు లేని సమస్యలు, నక్షా మ్యాపులు–సర్వే మ్యాపుల మధ్య వ్యత్యాసాలు, అసైన్డ్ భూములు, పట్టా భూములకు సంబంధించిన వివాదాలను వివరించారు.దీనిపై స్పందించిన కలెక్టర్ రీ సర్వే చట్టం ప్రకారం ప్రతి సమస్యకు పరిష్కారం ఉందని, రైతుల అభ్యంతరాలను పరిశీలించి చట్టబద్ధంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, స్థానిక సర్పంచ్ ఆండాలు, తహసీల్దార్, సర్వేయర్, ఇతర అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

50వ రోజుకు చేరిన బీసీ రాజ్యాధికార యాత్ర

- ఆత్మకూరులో తీన్మార్ మల్లన్నకు ఘన స్వాగతం

ఆత్మకూర్(ఎం), నవంబర్ 12 (జనంసాక్షి) : బీసీలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర 50వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ఆలేరు నియోజకవర్గంలోని ముత్తిరెడ్డిగూడెం నుంచి మోత్కూరు వైపు మల్లన్న పాదయాత్ర కొనసాగుతోంది. పాదయాత్రలో భాగంగా ఆత్మకూరు మండలానికి చేరుకున్న తీన్మార్ మల్లన్నకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాదయాత్రలో పాల్గొని మల్లన్నకు సంఘీభావం తెలిపారు. బీసీల హక్కులు, రాజ్యాధికార సాధన కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
13.11.2026



వాహనం ప్రైవేటుది.. కరెంటు ప్రభుత్వానిది..

- ప్రభుత్వ కార్యాలయంలోనే సొంత ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్
- ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

కరీంనగర్ టౌన్ (జనంసాక్షి):
ప్రభుత్వ వనరులను ప్రజా అవసరాలకు, అధికారిక విధులకు వినియోగించాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వ కార్యాలయా ల్లోనే విద్యుత్ దుర్వినియోగం జరుగు తోందనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. కరీంనగర్‌లోని ప్రభుత్వ కార్యాలయంలో కొందరు సిబ్బంది తమ వ్యక్తిగత ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రభుత్వ విద్యుత్‌తో చార్జింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపి స్తున్నాయి. ప్రభుత్వ వనరులను వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు వినియోగించే విద్యుత్ బిల్లులను ప్రజాధనం నుంచే చెల్లిస్తారు. అలాంటప్పుడు వ్యక్తిగత వాహనాల చార్జిం గ్ కోసం ప్రభుత్వ విద్యుత్‌ను వినియోగిస్తే అదనపు భారం ప్రభుత్వంపై పడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి
విద్యుత్ వినియోగంపై ఉన్నతాధికారులు దృష్టి సారిం చాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయంలో వ్యక్తి గత ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ చేస్తున్నారా? అలా చేస్తుంటే అందుకు అనుమతి ఉందా? విద్యుత్ వినియోగానికి సంబంధించిన నిబంధనలు పాటిస్తు న్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- జిల్లాలో 8,209 మందికి నూతన పెన్షన్ మంజూరు
- ఈ నెల 19 నుండి లబ్ధిదారుల ఖాతాల్లో పెన్షన్ నగదు జమ..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నదని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.గురువారం వేములవాడ నియోజకవర్గ స్థాయి చేయూత నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని వేములవాడలోని ఫంక్షన్ హాల్ లో నిర్వహిం చగా,ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిఏం రేవంత్ రెడ్డి ప్రతి రోజూ సుమారు 18 గంటలు శ్రమిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19 నుండి కొత్తగా మంజూరైన పెన్షన్ల నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.జిల్లాలో కొత్తగా 8,209 పెన్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 1,13,264 మందికి పెన్షన్లు అందుతున్నాయని, కొత్తగా మంజూరైన పెన్షన్లతో కలిపి మొత్తం 1,21,473 మందికి ప్రతి నెలా పెన్షన్లు అందనున్నాయన్నారు.ప్రతి నెల సుమారు రూ 25.97 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చించనుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఒకవైపు సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా నిలుస్తూ, మరోవైపు మౌలిక సదుపాయాల కల్పనతో రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాం గులు (తలసేమియా, సికిల్ సెల్, హిమో ఫీలియా) గీత కార్మికులు,నేత కార్మికులు, ఫైలే రియా, దయాలసిస్ బాధితులు నుంచి ఇప్పటికే దరఖాస్తుదారులు స్వీకరించామన్నా రు.అర్హుల ఎంపిక కోసం అధికారులతో విచారణ చేయించామన్నారు.ఆగస్టు 1 నుండి సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిం చామని, ఆయా దరఖాస్తులను అధికారులు విచారణ చేయించామన్నారు. ఈ నెల18 వరకు మంజూరు పత్రాలు అందిస్తామన్నారు.19 తర్వాత లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అవుతాయన్నారు.మహిళా సంఘాల ద్వారా స్కూల్ విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించే బాధ్యత అప్పగించామని తెలిపారు. వయోవృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వ చట్టం చేసిందని, త్వరలో అమలు కానున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలుకల తిరుపతి, కచ్చకాయల ఎల్లయ్య, ఫ్యాక్స్ చైర్మెన్లు వకులాభరణం శ్రీనివాస్, బొమ్మెన భాస్కర్, ఏగోలపు శ్రీనివాస్, గసికంటి ప్రభాకర్, పిల్లి కనకయ్య,ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ,మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్,లబ్ధిదారులు పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం.. నిందితుడి అరెస్టు



రామడుగు(జనంసాక్షి):
పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై హత్యాయ త్నం జరిగిన ఘటన రామడుగుల మండలం లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం వెదిర గ్రామానికి చెందిన రాళ్ల బండి జనార్ధన్ రెడ్డి ఈ నెల 2న ద్విచక్ర వా హనంపై తన ఇంటికి వెళ్తుండగా, మార్గ మధ్యంలోని మార్కండేయ దేవాలయం సమీపంలో అదే గ్రామానికి చెందిన వంచ తిరుపతి రెడ్డి అతనిని వెంబడించి కొడవలితో దాడి చేశాడు. జనార్ధన్ రెడ్డికి గాయాలు కావడంతో అతడి స్నేహితులకు ఫోన్ చేశాడు. దీంతో నిందితుడు అక్కడి నుంచి పరార య్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసు లు దర్యాప్తు చేపట్టి గాలించగా గురువారం వెదిర గ్రామంలోని అతని నివాసం వద్ద అదు పులోకి తీసుకున్నారు. విచారణలో నేరానికి ఉపయోగించిన కొడవలిని తన ఇంటి వద్ద దాచినట్లు వెల్లడించి, పోలీసులకు అప్పగిం చాడు. ఈ కేసులో రామడుగు పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి, వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచారు.



మూలనపడ్డ దాతల విరాళం



ఎండకు ఎండి.. వానకు తడిసి పాడవుతున్న టేబుళ్లు, కుర్చీలు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరా వుపేట మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫర్నిచర్ నిర్వహణ గాలికి వదిలేసినట్లు కనిపిస్తోంది. కళాశాలలో ఎక్కడపడితే అక్కడ కుర్చీలు, టేబుళ్లను నిర్లక్ష్యంగా పడేయ డంతో ఎండకు ఎండి, వానకు తడిసి పాడైపోతున్నాయి. మరికొంత ఫర్నిచర్ ఓ మూలన మూలుగుతోంది.గతంలో పేద విద్యార్థులకు కూర్చునేందుకు కుర్చీలు, టేబుళ్లు లేవని తెలుసుకున్న కొంతమంది దాతలు స్పందించి కళాశాలకు ఫర్నిచర్‌ను విరాళంగా అందించారు. అయితే అందించిన ఫర్నిచర్‌ను సైతం భద్రపరచకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ సొమ్ము, దాతలు అందించిన వస్తువుల పట్ల ఇంత నిర్లక్ష్యమా? అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కళాశాల సిబ్బంది స్పందించి ఫర్నిచర్‌ను భద్రపరిచి, వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.

– గంభీరావుపేట, జనంసాక్షి



అప్పు తీర్చేందుకు దొంగతనం

- ఏటీఎం చోరీకి యత్నం..
- గంటల్లోనే నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):
అప్పు తీర్చేందుకు ఏటీఎంలోని నగదును దొంగి లించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని కామారెడ్డి పట్టణ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కొన్ని గంటల్లోనే అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 11వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో కామారెడ్డి పట్టణంలోని జేపీఎన్ రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోకి మహారాష్ట్రలోని పర్భణి జిల్లాకు చెందిన మహేష్ జ్ఞానోబా బిందే (33) ప్రవేశించాడు. ముందుగా గుర్తుపట్టకుండా ఉండేందుకు ఏటీఎం కేంద్రంలోని సీసీ కెమెరాలను తొలగించి తన వెంట తీసుకెళ్లాడు. అనంతరం ఇనుప రాడ్‌తో ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి నగదు చోరీకి ప్రయత్నించాడు. ఈ క్రమంలో భద్రతా అలారం మోగడంతో నగదు తీసుకోకుండానే అక్కడి నుంచి పరారయ్యాడు.నిందితుడు కామారెడ్డిలోని వాల్మీకి బ్యాండ్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఓ వ్యక్తి వద్ద తీసుకున్న రూ.10 వేల అప్పు తీర్చేందుకు ఈ చోరీకి పథకం వేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సాంకేతిక ఆధారాలు, పోలీసులకు అందిన సమాచారంతో నిందితుడిని గుర్తించిన ప్రత్యేక బృందాలు, అతను స్వగ్రామానికి పారిపోయేం దుకు రైల్వే స్టేషన్‌కు వెళ్లిన సమయంలో పట్టుకున్నాయి. అతని వద్ద నుంచి చోరీకి ఉపయోగించిన ఇనుప రాడ్, ఏటీఎం నుంచి తొలగించిన సీసీ కెమెరాలు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.డీఎస్పీ ఎస్. మధుసూదన్ పర్యవేక్షణలో టౌన్ ఎస్‌హెచ్‌ఓ నరహరి ఆధ్వర్యంలో పోలీసులు ఈ కేసును ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడిని గంటల వ్యవధిలోనే పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ నర్సింలు, హోంగార్డు మోహన్ రెడ్డిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

చదుమల్ తండాలో అగ్నిప్రమాదం

10 లక్షల ఆస్తి నష్టం



గాంధారి,జనంసాక్షి:ఇంట్లో వారంతా తమ బంధువుల ఊరైన గుర్జాల గ్రామానికి వెళ్ళగా ప్రమాదవశాత్తు ఇంట్లో అగ్ని ప్రమాదం సంబంధించిన పూర్తిగా ఇంట్లో ఉన్న సామాగ్రితో పాటు ఇల్లు దగ్ధమై నా సంఘటన గాంధారి మండల కేంద్రంలోని చదుమల్ తండాలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళ్తే స్థానికులు అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం గాంధారి మండలం చర్మల్ తండాకు చెందిన రాయిదాస్ మంగులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదవశాత్తు అగ్నిమంటలు చెలరేగాయి దీంతో చుట్టుపక్కల వారు నీటితో మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ స్థానిక ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వెంటనే అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువ చ్చారు. ఈ సందర్భంగా దాదాపు ఇల్లు పూర్తిగా ధ్వంసం అయిందని కొత్త ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న కట్టెలు, పండించిన పంట ధాన్యం, బంగారం, వెండి వస్తువులు, నగదు బీరువాతో సహా పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడం ప్రాణం నష్టం సంభవించలేదు దాదాపు పది లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని స్థానికులు పేర్కొన్నారు.

శభాష్ సింధు..

సివిల్స్ విద్యార్థిని కోల సింధు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన కేటీఆర్



గోదావరిఖని, జనంసాక్షి:రామగుండం నియోజకవర్గం వేమునూర్ గ్రామ సర్పంచ్ కోల లత కోడలు, కోల మహేష్ లక్ష్మీ దంపతుల కుమార్తె, సివిల్స్ విద్యార్థిని కోల సింధు రచించిన " అండ్ డిఫైనేబుల్ గర్ల్"పుస్తకాన్ని గురువా రం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) చేతుల మీదుగా ఘనంగా ఆవిష్క రించారు.ఈ సందర్భంగా కేటీఆర్ కోల సింధు రచించిన పుస్తకాన్ని అభినందిస్తూ, ఆమె రచనా ప్రతిభను కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, ప్రతిష్టాత్మకమైన ఆలిండియా సివిల్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.చిన్న వయసులోనే రచనా రంగంలో ప్రతిభను చాటుతూ, సివిల్స్ లక్ష్యంతో ముందుకు సాగుతున్న కోల సింధు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, రామగుండం నియోజకవర్గానికి చెందిన వ్యాల్ల హరీష్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పారమిత విద్యార్థులు




కరీంనగర్, క్రైమ్ నవంబర్ 12 (జనంసాక్షి) :
యస్.జి.ఎఫ్.ఐ. రాష్ట్ర స్థాయి వాలీబాల్, హ్యాండ్ బాల్ పోటీలకు పద్మనగర్‌లోని పారమిత హెరి టేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు.ఇటీవల కేశవపట్నం లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీ లలో 8వ తరగతికి చెందిన ఈ రక్షిత్ బాలుర అండర్-14 విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొంటారు. అదే విధంగా సిరిసిల్ల లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో భువన, మోక్షజ్ఞ విద్యార్థులను చైర్మన్ డా. ఇ. ప్రసాదరావుతో పాటు డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, ప్రసాద్, వినోద్ రావు, హన్మంతరావు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాం శాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, రాము, రబీంద్రపాత్రో,భవానీ, నిఖిత, వ్యాయామ ఉపాధ్యాయులు యస్. రాజు, సాజన్ , గౌతమ్ , శ్రీనివాస్, అమర్ లు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకొని సమాజానికి సేవ చేయాలి

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు అడ్వకేట్ బి. కిరణ్ కుమార్

రామడుగు(జనంసాక్షి):న్యాయ విద్యార్థులు తమకు లభించే విస్తృత అవకాశాలను అందిపుచ్చుకొని సమాజానికి సేవ చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు అడ్వకేట్ బి. కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు.కిమ్స్ కాలేజ్ ఆఫ్ లా లో నూతన విద్యార్థుల కోసం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తు త సమాజంలో న్యాయ రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని,వృత్తిలో న్యాయవాదుల సహకారంతో ముందుకు సాగాలని, పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడం, ప్రజల్లో న్యాయ విద్యపై అవగాహన పెంచడం, నైతిక విలువలను పాటించడం విద్యార్థుల బాధ్యత అని తెలిపారు.కిమ్స్ విద్యా సంస్థల చైర్మన్ డా. పెరియాల రవీందర్ రావు మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉత్తమ అవకా శాలను అందించడమే కిమ్స్ విద్యా సంస్థల లక్ష్యమని తెలిపారు.వైస్ చైర్మన్ సాకేత్ రామారావు, కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డా. పి. నవీన్ కుమార్, అ ధ్యాపకులు వెంకటస్వామి, కాశురయ్య, కేశవ్, వంశీకృష్ణ, కిమ్స్ పాల్గొన్నారు



సమన్వయంతో పనిచేయాలి

- తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- అధికారులతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సమీక్ష



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):
జిల్లాలో ప్రజలకు నిరంతరాయంగా తా గునీటి సరఫరా అందించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం వి.బి.జి. రామ్ జి పథకం పనుల పురో గతి, తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సంబంధిత శాఖల అధికా రులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన పరిష్కా రాలు చూపాలని సూచించారు. ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ, మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు సహకరించాలని ఆదేశించారు. పెండిం గ్‌లో ఉన్న నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు.అలాగే వి.బి.జి. రామ్ జి పథకం కింద చేపడుతున్న పనులను నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని, కూలీలకు ఉపాధి కల్పిం చేలా పనులను ప్రణాళికాబద్ధంగా చేప ట్టాలని సూచించారు. అన్ని శాఖల అధి కారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభు త్వ పథకాల ఫలాలు అర్హులైన ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డీఆర్డీఓ దామోదర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ విజయపాల్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నమ్మించి నిర్మానుష్య ప్రాంతంలో దోపిడీ

- నగదు, సెల్‌ఫోన్ అపహరణ..
- ఇద్దరు నిందితుల అరెస్ట్...

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):
కూలీ పని పేరుతో పరిచయం పెంచుకుని, నమ్మించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులను కామారెడ్డి పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 10న ఉదయం మేస్త్రీ నీరడి భూమేష్ కూలీల కోసం జేపీఎన్ చౌక్‌లోని లేబర్ చౌక్ వద్దకు వెళ్లగా కడమంచి లక్ష్మి అలియాస్ హైమద్ బీ పరిచయమైంది. కూలీ పనికి వస్తానని నమ్మించి ఉగ్రవాయి మైసమ్మ ఆలయానికి తీసుకెళ్లింది. ముందస్తు పథకం ప్రకారం అక్కడికి ఆటోలో చేరుకున్న అల్లం శివకుమార్‌తో కలిసి భూమేష్‌ను చంపేస్తామని బెదిరించి అతని వద్ద ఉన్న రూ.900 నగదు, రెడ్‌మీ మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కొని పరారయ్యారు.బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాల ద్వారా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నవంబర్ 11న జేపీఎన్ విగ్రహం సమీపంలో అనుమానితులుగా కనిపించిన ఇద్దరు పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. విచారణలో సులభంగా డబ్బు సంపాదించేందుకు లేబర్ చౌక్, బస్టాండ్, కల్లు దుకాణాల వద్ద అమాయకులను గుర్తించి, మాయమాటలతో నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి దోపిడీలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది.నిందితురాలు లక్ష్మిపై గతంలోనూ దోపిడీ, దృష్టి మళ్లించి దొంగతనాలకు సంబంధించిన కేసులు ఉండగా, శివకుమార్‌పై దొంగతనం, హత్యాయత్నం తదితర కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రెండు మొబైల్ ఫోన్లు, రూ.900 నగదు, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎస్. మధుసూదన్ పర్యవేక్షణలో టౌన్ ఎస్‌హెచ్‌ఓ నరహరి ఆధ్వర్యంలో పోలీసులు ఈ కేసును ఛేదించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు.









భూముల రీ సర్వేకు సహకరించాలి

- రైతులు సర్వే సమయంలో అందుబాటులో ఉండాలి
- మూడు నెలల్లో చామనపల్లి ముంపు గ్రామం తరలింపు
- విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి
- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- పాఠశాలల్లో బోధన, అభ్యాస ప్రమాణాలపై కలెక్టర్ సమీక్ష

పెద్దపల్లి, నవంబర్ 12 (జనంసాక్షి): జిల్లాలో భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం ధర్మారం, జూలపల్లి మండలాల్లో పర్యటించిన ఆయన శాయంపేట, కాచాపూర్ గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను, చామనపల్లిలో సోషల్ ఎకనామిక్ సర్వేను పరిశీలించారు. సర్వే సమయంలో రైతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి తమ భూముల హద్దులను సరిచూసుకోవాలని కోరారు. సర్వేకు ముందు రైతులకు సమాచారం అందిస్తామని, పూర్తయిన వివరాలను గ్రామాల్లో ప్రకటించి అభ్యంతరాల నమోదుకు గడువు కల్పిస్తామని తెలిపారు. రైతులు అందుబాటులో లేకపోతే భవిష్యత్తులో జియో కోఆర్డినేట్ల ఆధారంగా జారీ చేసే పట్టాదారు పాస్‌పుస్తకాల విషయంలో ఇబ్బందులు తలెత్తవచ్చని హెచ్చరించారు.

చామనపల్లి ముంపు గ్రామ తరలింపు ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సోషల్ ఎకనామిక్ సర్వేలో ప్రతి కుటుంబ వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జూలపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు అల్పాహారం సక్రమంగా అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

అనంతరం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అకడమిక్ ప్యానెల్ తనిఖీ బృందాలతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యా ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల్లో మౌఖిక పఠన నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అమలు చేస్తున్న రెమెడియేషన్ కార్యక్రమం మంచి ఫలితాలనిస్తోందని పేర్కొన్నారు. చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా బోధన సాగాలని సూచించారు. బోధనా అభ్యసన సామగ్రి, డిజిటల్ బోర్డులు, ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించాలని, తరగతి గదులను ఆకర్షణీయమైన అభ్యాస వాతావరణంతో తీర్చిదిద్దాలని తెలిపారు. చదువులో వెనుకబడిన, నెమ్మదిగా నేర్చుకునే విద్యార్థులను గుర్తించి అదనపు శిక్షణ అందించాలని, ప్రధానోపాధ్యాయులు తరగతులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి జి. శారద, ఏఎంఓ డాక్టర్ పి.ఎం. షేక్, అకడమిక్ ప్యానెల్ బృందాల సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. గ్రామస్థాయి సర్వేలు, పాఠశాలల విద్యా ప్రగతిపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

దశాబ్దాల కల సాకారం.. సుందరగిరిలో సంబరాలు

- సుందరగిరి నుండి హుస్నాబాద్ వరకు వన్ సైడ్ నాలుగు వరుసల రహదారి నిర్మాణం పూర్తి
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు,రాష్ట్ర ప్రభుత్వానికి ప్రయాణికుల కృతజ్ఞతలు
- యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్న ధరణి కన్స్ట్రక్షన్స్ యజమాన్యానికి అభినందనలు



చిగురుమామిడి నవంబర్ 12(జనంసాక్షి):హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల నెరవేరుతున్న వేళ స్థానికంగా పండుగ వాతావరణం నెలకొంది.కొత్తపల్లి నుండి హుస్నాబాద్ వరకు 21కిలోమీటర్ల దూరంలో 163కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనుల్లో కీలక ఘట్టం పూర్తయింది. ఇందులో భాగంగా సుందరగిరి నుండి హుస్నాబాద్ వరకు వన్ సైడ్ రోడ్డు నిర్మాణం విజయవంతంగా పూర్తి కావడంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ ఆధ్వర్యంలో సుందరగిరిలో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మిలు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పెట్టుకుని, నిరంతరం పనిచేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ రహదారి నిర్మాణానికి 163కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ రూపురేఖలు మారుస్తున్నారని మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.అదేవిధంగా,ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా యుద్ధ ప్రాతిపదికన,అత్యంత నాణ్యతతో రోడ్డు నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తున్న ధరణి కన్స్ట్రక్షన్స్ యజమాన్యానికి వారు ప్రత్యేక ధన్యవాదాలు,అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ ,సర్పంచ్ జంగ శిరీష వెంకట రమణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,వైస్ చైర్మన్ బంక చందు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చిత్తారి పద్మ రవీందర్, చిగురు మామిడి మండల అధ్యక్షులు అందే సురేష్,హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు వివి రమణ,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మార్క రాజు,జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబారి బాబు,బడుకోలు దేవేందర్ రెడ్డి, పలు గ్రామాల సర్పంచ్ లు ఆకవరం భవాని,అలువాల శంకర్,కొంకటి మౌనిక,గుళ్ళ రజిత రాజు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణు,హుస్నాబాద్ కౌన్సిలర్లు బోలిశెట్టి రాజు,కొండ రజిత సత్యనారాయణ,సావుల మంజుల, మండల నాయకులు వంగర మల్లేశం,ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,గోగురి మురాహారిరెడ్డి,పోటు మల్లారెడ్డి,కుతాటి తిరుపతి,పిల్లి కొమురయ్య,పచ్చిమట్ల జగన్,గొట్టే రఘుబాబు,బోయిని ప్రశాంత్, వెంకటేశం,రాజయ్య,జీల సంపత్,మల్లికార్జున్,కూరెళ్ళ కిషోర్,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సన్నధాన్యానికి రూ.500 బోనస్ : భాస్కర్‌రావు

రామగిరి,(జనంసాక్షి): రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు సూచించారు. గురువారం రామగిరి మండలంలోని పన్నూర్, సుందిళ్ల, చందనాపూర్, కల్వచర్ల, నాగేపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సర్పంచ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. సన్నధాన్యానికి ప్రభుత్వం అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రీసర్వే పనులను వేగవంతం చేయాలి

రోజువారీ పురోగతిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 12 (జనం సాక్షి) : జిల్లాలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. గురువారం సంబంధిత అధికారులతో రీసర్వే పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజూ సర్వే పనుల పురోగతిని సమీక్షించాలని, రోవర్ పరికరాల పనితీరు, వినియోగం, సర్వే బృందాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలోని 70 కాడాస్ట్రల్ రీసర్వే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించిన వెంటనే సర్వే పనులు ప్రారంభించి, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 158 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఉండగా, 144 మంది సమ్మతి తెలిపినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం 50 సర్వే బృందాలను ఏర్పాటు చేసి, ఒక్కో బృందానికి ఒక లైసెన్స్‌డ్ సర్వేయర్‌ను కేటాయించి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభలు, రోజువారీ పురోగతి, సర్వే బృందాల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్.వై. గిరి, సర్వే ల్యాండ్ అధికారి శ్రీనివాస్, ఏవో మసూద్ అహ్మద్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

నిర్ణీత గడువు లోపు అభివృద్ధి పనుల నిర్మాణాలను పూర్తి చేయాలి

- బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి అధికారులతో సమీక్ష

బోధన్, నవంబర్ 12 (జనంసాక్షి) : బోధన్ పట్టణ అభివృద్ధి పనులపై ఆర్డీఓ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు ఉద్దేశించిన పనుల ప్రగతిని, అమృత్ పథకం, టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో చేపడుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ఉద్దేశించిన అభివృద్ధి పనులను వేగంగా చేపట్టాలని, నిర్దేశిత గడువు లోపు నాణ్యతతో పూర్తి చేసేలా నిశిత పర్యవేక్షణ జరపాలని ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరా పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పైప్ లైన్ల మరమ్మతులు, లీకేజీలను అరికట్టడం, ట్యాంకుల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని అన్నారు. బోధన్ మున్సిపల్ పట్టణం పరిధిలో కుళాయిల ద్వారా రోజు విడిచి రోజు నీటిని అందిస్తున్నందున నీటి సరఫరా సమయాన్ని గంట పాటు కొనసాగించాలని సూచించారు. రానున్న రోజుల్లో నీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అవసరమైతే వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకుని నీటి సరఫరా చేసేందుకు వీలుగా ప్రైవేటు బోర్లను గుర్తించాలన్నారు. బోధన్ మున్సిపల్ కార్యాలయ నూతన భవన సముదాయం నిర్మాణానికి టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. డంపింగ్ యార్డు నిర్వహణ, బయో మైనింగ్ సక్రమంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఇతర ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను మైల్ స్టోన్ ప్రకారం జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని, ప్రతి స్కూల్లో తప్పనిసరిగా తాగునీటి వసతి అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో బోధన్ మున్సిపల్ చైర్మన్ పద్మా శరత్ రెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ విజయ కుమారి, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, ఆర్‌అండ్‌బీ ఎస్. ఈ అజ్మీరా రాము, పంచాయతీరాజ్, పబ్లిక్‌హెల్త్ శాఖల అధికారులు పాల్గొన్నారు.





కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణపై సచిన్ సావంత్‌తో సిరాజ్ హుస్సేన్ భేటీ

- పార్టీ అధికార ప్రతినిధిగా నియమించినందుకు కృతజ్ఞతలు
- సోనియా గాంధీ జీవిత చరిత్ర పుస్తకం అందజేత

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి టీపీసీసీ అధికార ప్రతినిధి సిరాజ్ హుస్సేన్, రాష్ట్ర కాంగ్రెస్ సహ ఇన్‌ఛార్జి సచిన్ సావంత్‌తో చర్చించారు. గురువారం గాంధీభవన్‌లో సచిన్ సావంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సిరాజ్ హుస్సేన్.. తనకు రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధిగా కీలక బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై భవిష్యత్తులో అనుసరించాల్సిన కార్యాచరణపై ఇరువురు చర్చించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనాయకురాలు, యూపీఏ మాజీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ జీవిత ప్రస్థానాన్ని వివరించే 'బెలాంగింగ్: ఏ మెమోయిర్' పుస్తకాన్ని సచిన్ సావంత్ ఆయనకు అందజేశారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్తానని, నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని సిరాజ్ హుస్సేన్ తెలిపారు.

మేము బడికి పోయేది ఎట్లా!

- గంజ్ ప్రభుత్వ పాఠశాల గేటు ముందే ఫుట్‌పాత్ ఆక్రమణలు
- విద్యార్థుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు?



కరీంనగర్ టౌన్, నవంబర్ 12,(జనం సాక్షి) : కరీంనగర్ నగరంలోని ప్రధాన వ్యాపార కేంద్రం గంజ్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలు సమస్యగా మారుతున్నాయి. ముఖ్యంగా గంజ్‌లోని ప్రభుత్వ పాఠశాల గేటు ముందు కొందరు దుకాణదారులు ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహిస్తూ పాఠశాలకు వెళ్లే దారిని సైతం ఆక్రమిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.పాఠశాల ప్రధాన గేటు ముందు వ్యాపార సామగ్రి ఏర్పాటు చేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాల కార్యకలాపాలకు కూడా ఆటంకం కలుగుతోందని చెబుతున్నారు.

ప్రధాన మార్కెట్ కావడంతో గంజ్‌లో నిత్యం వ్యాపారులు, కొనుగోలుదారుల రద్దీ ఉంటుంది. ఇలాంటి ప్రాంతంలో పాఠశాల గేటు ముందే ఫుట్‌పాత్ ఆక్రమణలు కొనసాగడం పట్ల అటుగా వెళ్లే వ్యాపారులు, ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రవేశ ద్వారం వద్దే ఈ పరిస్థితి నెలకొనడంపై పలువురు చర్చించుకుంటున్నారు. ఫుట్‌పాత్‌లు పాదచారుల కోసం ఏర్పాటు చేసినవని, వాటిని వ్యక్తిగత వ్యాపార అవసరాలకు వినియోగించడం సరికాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పాఠశాల గేటు ముందు ఉన్న ఆక్రమణలను తొలగించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేరాల నియంత్రణలో నిర్లక్ష్యం వద్దు

ప్రతి ఘటనపై తక్షణమే స్పందించాలి

- రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా
- పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం
- మాదకద్రవ్యాలు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం



గోదావరిఖని, నవంబర్ 12 (జనంసాక్షి): నేరాల నియంత్రణలో నిర్లక్ష్యం వహించకుండా, ప్రతి ఘటనపై తక్షణమే స్పందిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనరేట్ కార్యాలయంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ అధికారులతో నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలపై సమీక్ష నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా కేసుల పురోగతి, నిందితుల అరెస్టులు, చార్జిషీట్ల దాఖలు, సాక్ష్యాధారాల సేకరణ, కోర్టు కేసుల పరిస్థితిని సమీక్షించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఉన్నతాధికారుల నుంచి వచ్చే సమాచారంపై వెంట నే స్పందించాలని సూచించారు. సమస్య తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించే పరిస్థితి రాకుండా ముందస్తు అంచనా, సమన్వయంతో వ్యవహరించాలన్నారు.

ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు, సమస్యాత్మక వ్యక్తులు, సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. రాజకీయ, ఇతర అనుబంధాలతో సంబంధం లేకుండా నిష్పక్షపాతంగా పర్యవేక్షించాలని, బెదిరింపులు, దాడులు, ఆస్తి సంబంధిత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పర్యవేక్షణ అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా పగలు, రాత్రి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను అంచనా వేయాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి, నాణ్యమైన దర్యాప్తుతో నేర నిరూపణకు అవసరమైన ఆధారాలు సేకరించాలని స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్‌పై నిరంతర తనిఖీలు చేపట్టాలని, ఈ-పెట్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసుల నమోదులో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో తక్కువ పరిమాణంలో గంజాయి పట్టుబడినా దాని వెనుక ఉన్న సరఫరాదారులు, మధ్యవర్తులు, నెట్‌వర్క్‌ను గుర్తించి లోతుగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాలతో సంబంధాలున్న నిందితులను పట్టుకునేందుకు ఆయా రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకోవాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు, పేకాట, రేషన్ బియ్యం, పశువులు, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యలు తలెత్తిన తర్వాత బాధ్యత నుంచి తప్పించుకోకుండా ముందుగానే గుర్తించి పరిష్కరించే బాధ్యత ప్రతి అధికారిపై ఉందని సీపీ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్‌తో పాటు ఇతర ఏసీపీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసిన అడిషనల్ డైరెక్టర్

సిరికొండ, (జనంసాక్షి): మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలను అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస చారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. పుస్తక పరిజ్ఞానంతోపాటు సాంకేతిక, వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్య అందిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రిన్సిపాల్ గడ్డం రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండి హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

- రా ఎగ్ మయోనైజ్‌పై ప్రత్యేక దృష్టి..10 కిలోల చికెన్ పారవేత!
- రెండు రెస్టారెంట్లలో అపరిశుభ్రత.. నిబంధనల ఉల్లంఘన
- సింథటిక్ రంగులతో చికెన్ వంటకాలు
- నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు.. కేసుల నమోదు

కరీంనగర్ టౌన్, నవంబర్ 12 (జనంసాక్షి): మండి, షావర్మా రెస్టారెంట్లలో ఆహార భద్రతా ప్రమాణాల అమలుపై అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గురువారం కరీంనగర్‌లోని నాలుగు రెస్టారెంట్లలో తనిఖీలు చేపట్టి వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, తయారీ విధానాలను పరిశీలించారు. ఐబీ చౌరస్తా సమీపం లోని షావర్మా కార్నర్, గీతాభవన్ చౌరస్తా వద్ద క్వాలిటీ మండి, ముకరం పురలోని అరేబియన్ కిచెన్, బ్యాంక్ కాలనీ సమీపంలోని కోయ్ మండి రెస్టారెంట్లలో తనిఖీలు చేశారు. ఎక్కడా రా ఎగ్ మయోనైజ్ తయారీ, విని యోగం గుర్తించలేదని, వెజిటేరియన్ మయోనైజ్ మాత్రమే వాడుతున్నట్లు వెల్లడించారు.

అరేబియన్ కిచెన్, క్వాలిటీ మండి రెస్టారెంట్లలో వంటగది పరిశుభ్రత లోపాలను గుర్తించారు. వెజిటేరియన్, నాన్‌వెజిటేరియన్ పదార్థాలను ఒకే ఫ్రీజర్‌లో నిల్వ చేయడం, ఎగ్జాస్ట్ ఫ్యాన్లపై నూనె, కొవ్వు పేరుకుపోవడం, కూరగాయల కోతకు ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులు ఉపయోగించడం వంటి ఉల్లంఘనలు బయటపడ్డాయి. క్వాలిటీ మండి హోటల్‌లో సింథటిక్ ఫుడ్ కలర్స్‌తో తయారు చేసిన సుమారు 10 కిలోల చికెన్‌ను అధికారులు పారవేయించారు. ఆహార తయారీలో అనుమతించిన రంగులు, పదార్థాలనే వినియోగించాలని హెచ్చరించారు.



నిబంధనల ఉల్లంఘనలపై అరేబియన్ కిచెన్, క్వాలిటీ మండి నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతోపాటు కేసులు నమోదు చేశారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రెస్టారెంట్ల నిర్వాహకులు వంటగదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శాకాహార, మాంసాహార పదార్థాలను వేర్వేరుగా నిల్వ చేయాలని సూచించారు. రా ఎగ్ మయోనైజ్ తయారీ, వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా తనిఖీలు కొనసాగిస్తామని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పి.రోహిత్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వి.అంకిత్ రెడ్డి తెలిపారు.

వాతావరణ మార్పులకులి దీటుగా.. కూరగాయల సాగుతో రైతుకు బాసట

- రైతులకు జిల్లా ఉద్యానశాఖాధికారి గడ్డం శ్యాం ప్రసాద్ సూచనలు



పెద్దపల్లి,నవంబర్ 12(జనంసాక్షి) : పెద్దపల్లి మండలంలోని హన్మంతుని పేట గ్రామంలో ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న కూరగాయల పంటలను జిల్లా ఉద్యానశాఖాధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు గౌరవెల్లి రవీందర్ రావు తన 4.5 ఎకరాల ఆయిల్‌పామ్ తోటలో డ్రిప్ ఇరిగేషన్ మరియు మల్చింగ్ షీట్ల వినియోగంతో అంతర పంటలుగా టమాటా,మిరప పంటలను సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. రాబోయే సీజన్‌లో వాతావరణ పరిస్థితులు అత్యంత క్లిష్టంగా ఉండే అవకాశం ఉందని, భూగర్భ జలమట్టాలు తగ్గుతూ బోరు బావులు, బావుల్లో నీటి లభ్యత క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో రైతులు అధిక నీటి వినియోగం అవసరమయ్యే వరి, పత్తి, చెరకు, మొక్కజొన్న వంటి పంటల సాగుకు దూరంగా ఉండాలని సూచించారు.దీనికి ప్రత్యామ్నాయంగా తక్కువ కాల పరిమితి కలిగిన బెండ, అలసంద, గోరుచిక్కుడు వంటి తక్కువ నీటి అవసరమయ్యే కూరగాయల పంటలను సాగు చేయాలని సూచించారు. అదేవిధంగా మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న టమాటా, పచ్చిమిర్చి, బీరకాయ, కాకరకాయ వంటి పంటలను కూడా డ్రిప్ ఇరిగేషన్ మరియు మల్చింగ్ షీట్ల వినియోగంతో సాగు చేసుకోవచ్చని తెలిపారు.ఉద్యానశాఖ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ మరియు మల్చింగ్ పద్ధతులకు ప్రభుత్వం రాయితీలు అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.తక్కువ నీటితో,తక్కువ పెట్టుబడితో,స్థిరమైన దిగుబడులు మరియు మెరుగైన ఆదాయం పొందేలా పంటల మార్పిడికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఉద్యానశాఖాధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖాధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్,ఉద్యాన విస్తరణ అధికారి శ్రీ రాము ,రైతులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారం



కేశంపేట, నవంబర్ 12 (జనం సాక్షి) : కాంగ్రెస్ పార్టీతోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో గురువారం పొలమోని ఉమామహేశ్వరి రాజారాం దంపతులకు చెందిన ఇందిరమ్మ ఇంటిని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. గ్రామంలో ఇప్పటివరకు నాలుగు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు జరిగాయన్నారు. మరో 10 ఇళ్లు నిర్మాణ దశలో ఉండగా ఐదు ఇళ్లు కొత్తగా మంజూరు అయ్యాయని తెలిపారు. అనంతరం లబ్ధిదారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లచ్చి రామ్ నాయక్, కావలి వసంత, నాయకులు చిట్టి రెడ్డి వెంకట్ రెడ్డి, నరసింహారెడ్డి, రామ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, చెన్నయ్య, కావలి లక్ష్మయ్య, చంద్రయ్య, రవి పాల్గొన్నారు.

అలియాబాద్ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- చైర్మన్ శిరిష కృష్ణారెడ్డి



శామీర్‌పేట్, నవంబర్ 12 (జనం సాక్షి) : అలియాబాద్ పురపాలక సంఘం పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట్ 6వ వార్డులో మున్సిపల్ జనరల్ నిధుల ద్వారా 24 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న యూజీడీ నిర్మాణ పనులను అలియాబాద్ పురపాలక సంఘం చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ వెంకట్ రెడ్డి,వైస్ చైర్‌పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ కైరా గణేష్, కౌన్సిలర్లు గురుకుల దీప, సాయి కృష్ణ, యెల్లు దీపిక వరప్రసాద్ రెడ్డి, సరసం వనజ అశోక్ రెడ్డి, గాదె వెంకటేష్, గూదే వెంకటేష్, వడగం యమున శ్యామ్, తలారి మౌనిక బాబు, వంగరి మౌనిక దినేష్, చీదు వనజ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ ఏఈఈ సనా షాహీన్, మున్సిపల్ సిబ్బంది మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అలియాబాద్ పురపాలక సంఘం పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత నిస్తూ, ప్రతి వార్డులో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు అభివృద్ధి పనులు చేపడుతున్న మున్సిపల్ పాలకవర్గానికి తమ కృతజ్ఞతలు తెలిపారు.

ఉప్పల్‌లో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి



ఉప్పల్, నవంబర్ 12 (జనం సాక్షి) : ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న తాగునీరు, భూగర్భ డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం వాటర్ బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజను కలిసి వినతిపత్రం అందజేశారు. రామంతాపూర్, ఉప్పల్, వెంకట్‌రెడ్డినగర్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలకు నూతన డ్రైనేజీ పైపులైన్లు ఏర్పాటు చేయాలని, రామ్‌రెడ్డినగర్‌లో కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. బాగాయత్‌లో డ్రైనేజీ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని, చర్చి కాలనీలో తాగునీటి పైపులైను, ఇంటింటి కనెక్షన్ల పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని పరమేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఎల్బీనగర్, నవంబర్ 12 (జనం సాక్షి) : భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్మిక విభాగం (లేబర్ సెల్)లో పారిశ్రామిక కార్మికుల విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శివపుర మల్లికార్జున నియమితులయ్యారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ సిద్ధాంతాలు, కార్మికుల సంక్షేమం పట్ల నిబద్ధతను గుర్తించి ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి, కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక విభాగం కన్వీనర్ అంద శ్రీనివాస్ సూర్యాపేట జిల్లా కార్మిక సెల్ కన్వీనర్ పాలకుర్తి శేషగిరిరావు మరియు బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ధర్నా

- నూతన టెండర్లను పిలిచి కార్మికుల జీతాలు పెంచాలి
- గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా

గద్వాల, నవంబర్ 12 (జనం సాక్షి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు జరిగిన ఈ కార్యక్రమంలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాల కార్మికులు పాల్గొని తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని నినదించారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న, తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గత 10 నుంచి 20 సంవత్సరాలుగా సుదీర్ఘ అనుభవంతో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు నాలుగు సంవత్సరాలు దాటినా వేతనాలు పెంచకపోవడం తీవ్ర అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొత్తగా విధుల్లో చేరే కార్మికులకు కూడా కనీసం రూ.16 వేల వేతనం నిర్ణయించిన నేపథ్యంలో, ఏళ్ల తరబడి సేవలందిస్తున్న కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే కార్మిక చట్టాల ప్రకారం పండుగ సెలవులు, జాతీయ సెలవులు, ఆర్జిత సెలవులు అమలు చేయాలని, ప్రతి సంవత్సరం ఒక నెల వేతనాన్ని బోనస్‌గా చెల్లించాలని, ప్రతి కార్మికుడికి రెండు జతల యూనిఫారాలు అందించాలని నాయకులు కోరారు. ప్రతి నెలా ఒకటో తేదీన క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ నిధులను కార్మికుల ఖాతాల్లో నిబంధనల ప్రకారం జమ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లు కార్మికుల వేతనాల నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ పేరుతో మినహాయింపులు చేస్తున్నప్పటికీ, ఖాతాల్లో మాత్రం పూర్తి మొత్తాలు జమ చేయడం లేదని వారు ఆరోపించారు. కార్మికులకు చెల్లించే వేతనానికి అనుగుణంగా చట్ట ప్రకారం ఈఎస్ఐ, పీఎఫ్ సొమ్మును జమ చేయాలని, కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించకపోతే ముఖ్య యజమానిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.గతంలో ఆగస్టు 9న డీఎంఈ కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నా సందర్భంగా, ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని అప్పటి డీఎంఈ అధికారులు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్వయంగా ప్రకటించినప్పటికీ నేటికీ ఆ



హామీ అమలు కావడం లేదని నాయకులు గుర్తుచేశారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి నూతన టెండర్ల ద్వారా కొత్త కాంట్రాక్టర్లను ఆహ్వానించి, కార్మికులకు మెరుగైన వేతనాలు, చట్టబద్ధమైన సెలవులు, బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న కాంట్రాక్టు కార్మికుల శ్రమను గుర్తించి వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు. కార్మికుల హక్కుల సాధన కోసం భవిష్యత్తులోనూ ఐక్యంగా పోరాడుతామని మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ నాయకులు స్పష్టం చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి ఆశన్న, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణ, జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, నాయకులు వెంకటేష్, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు, సూపర్‌వైజర్లు భాషా, నాగరాజ్, సెక్యూరిటీ విభాగం నుండి లక్ష్మణ్, శానిటేషన్ కార్మికులు చామంతి, భాషా, చిట్టెమ్మ, అమరేష్, ఇంద్రమ్మ, జయమ్మతో పాటు ఆసుపత్రి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

జవహర్‌నగర్, నవంబర్ 12 (జనంసాక్షి) : పేదల సంక్షేమం, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. గురువారం జవహర్ నగర్, చంద్రపురి డివిజన్లలో రూ.1.68 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. చంద్రపురి కాలనీలో రూ.1.36 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణానికి, గాంధీనగర్ కాలనీలో రూ.32 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గానికి 6 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే 1,500 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. జవహర్ నగర్‌కు కేటాయించిన 1,400 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను త్వరలో అర్హులకు పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే సుమారు రూ.300 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ సమస్యపై రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కలిసికట్టుగా పనిచేసి శాశ్వత పరిష్కారం సాధించాలని పిలుపునిచ్చారు. ఉచిత సన్నబియ్యం,



కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. త్వరలో కొత్త పింఛన్ల పంపిణీ కూడా ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేశ్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్ గుప్తా, చంద్రపురి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్, మాజీ సర్పంచ్ కరింగుల శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో దొంగ అరెస్ట్

- 4.4 తులాల బంగారం, 25 తులాల వెండి స్వాధీనం



బోడుప్పల్, నవంబర్ 12 (జనంసాక్షి) : మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి బోడుప్పల్ సర్కిల్ లోని ఎస్‌బీఆర్ కాలనీలో జరిగిన దొంగతనం కేసును మేడిపల్లి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 4.4 తులాల బంగారం, 25 తులాల వెండి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.మేడిపల్లి సీఐ డి. జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న ఎస్‌బీఆర్ కాలనీలో నివాసముంటున్న రవీంద్ర చారి ఇంట్లో దొంగతనం జరిగిందని బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల సాయంతో కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామానికి చెందిన మాలోతు ప్రశాంత్ (25)ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు.నిందితుడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అతడిపై గతంలోనూ కేసు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. 2023లో ఇల్లెందు పోలీస్‌స్టేషన్ పరిధిలో అతడిపై ఓ కేసు నమోదైందని తెలిపారు.కేసును త్వరితగతిన ఛేదించిన డీఎస్ఐ బోలిశెట్టి శ్రీను, హెచ్‌సీ రాము, పీసీలు మహిపాల్, హరిబాబులను మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ డి. జలంధర్ రెడ్డి అభినందించారు.

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, నవంబర్ 12 (జనంసాక్షి) : వికారాబాద్ పట్టణంలో జరుగుతున్న 36వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా బాలుర కబడ్డీ ఛాంపియన్ షిప్ కార్యక్రమాన్ని తెలంగాణ శాసన సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. 12-11-2026 నుండి 14-11-2026 వరకు జరిగే ఈ ఛాంపియన్ షిప్ ను వికారాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ నిర్వహిస్తోంది. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అనుసంధానంతో ఈ పోటీలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్పీకర్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలే యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చెప్పారు.తెలంగాణలో ప్రజా ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని గ్రామీణ, పట్టణ క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన సబ్ జూనియర్ బాలుర కబడ్డీ క్రీడాకారులను స్పీకర్ అభినందించి, ఆల్ ది బెస్ట్ చెప్పారు. తాను క్రీడాకారులకు అండగా ఉంటానని స్పీకర్ హామీ ఇచ్చారు. కబడ్డీ వంటి క్రీడలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ప్రతిభను వెలికి తీయవచ్చని స్పీకర్ అన్నారు. ఈ



పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు సత్తా చాటి, తెలంగాణ పేరును నిలబెట్టాలని స్పీకర్ ఆకాంక్షించారు. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు జె. వెంకట్ రెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు, కోచ్ లు, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దారాసింగ్ గారు, కిషన్ నాయక్, ఎ.ఎం.సి. చైర్మన్ చాపల శ్రీనివాస్, సత్యం సేటు, కొట్ పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు రామచంద్ర రెడ్డి గారు, పరశురామ్ నాయక్, రత్నరెడ్డి, వసంత్ రాజ్, వెంకట్ రెడ్డి, యువ నాయకుడు అన్సారి, ఆల్ హజ్ మహమ్మద్ సలీముద్దీన్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రగతినగర్‌లో ప్రభుత్వ పాఠశాల ఆట స్థలం పరిరక్షణకు కృషి



కుత్బుల్లాపూర్, నవంబర్ 12 (జనం సాక్షి) : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ప్రగతి నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆట స్థలాన్ని కాపాడి, విద్యార్థుల అవసరాల కోసం పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రగతి నగర్ బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని గురువారంమర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసి, ఈ సమస్యపై చర్చించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రగతి నగర్ ప్రభుత్వ పాఠశాల ఆట స్థల పరిరక్షణ కోసం ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లామని, ఈ విషయంపై అనేక పర్యాయాలు మీడియా సమావేశాలు నిర్వహించి ప్రజలకు, ప్రభుత్వానికి సమస్య తీవ్రతను వివరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి, బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు వరగాని వాసు, డీసీసీ కమిటీ సభ్యులు మౌళీశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి మృతి



శేరిలింగంపల్లి, నవంబర్ 12 (జనంసాక్షి) : రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి దుర్మరణం చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఈ మేరకు పోలీసు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం... మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఏ. రాజ్ కుమార్(40) టిఎస్ 15 ఎఫ్.పి 0112 నెంబర్ గల హోండా యాక్టివా పై గచ్చిబౌలి నుండి పటాన్చెరువు వైపు వెళ్తుండగా నల్లగండ్ల ఫ్లై ఓవర్ సిగ్నల్ వద్ద టిఎస్ 08 యుఎ 8274 నెంబర్ గల వాటర్ ట్యాంకర్ పక్కనుండి వేగంగా వచ్చి రాజ్ కుమార్ వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. స్థానికుల కథనం ప్రకారం డ్రైవర్ నిర్లక్ష్యం ధోరణికి తోడు వాటర్ ట్యాంకర్ ను వేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. కాగా తీవ్రంగా గాయపడిన రాజ్ కుమార్ ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాధితుడి బంధువుల ఫిర్యాదుమేరకు గచ్చిబౌలి పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నందిగామలో భారీ అగ్నిప్రమాదం

- ఏఎస్‌కె ప్లాస్టిక్ ఇండస్ట్రీలో ఎగిసిపడిన మంటలు..!
- సుమారు 6 కోట్ల ఆస్తి నష్టం

నందిగామ, నవంబర్ 12 (జనం సాక్షి) : రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలో గురువారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఏ ఎస్ కే ప్లాస్టిక్ ఇండస్ట్రీలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికంగా తీవ్ర భయాందోళన నెలకొంది. ప్లాస్టిక్ పరిశ్రమ కావడంతో మంటలు క్షణాల్లోనే భారీగా వ్యాపించాయి. దట్టమైన నల్లటి పొగ కిలోమీటర్ల మేర వ్యాపించింది. మంటలు, పొగ చూసి చుట్టుపక్కల ఫ్యాక్టరీల కార్మికులు, స్థానికులు భయంతో బయటకు పరుగులు తీశారు.

వివరాల్లోకి వెళితే..మండల కేంద్రమైన నందిగామకు అతి సమీపంలో ఏఎస్కే ప్లాస్టిక్ పరిశ్రమ ఉంది.ఈ పరిశ్రమలో ప్లాస్టిక్ కుర్చీలతో పాటు పలు ప్లాస్టిక్ వస్తువులను తయారు చేస్తుంటారు. ఇటీవల పరిశ్రమ యాజమాన్యం పరిశ్రమలో మరొక షెడ్డు నూతనంగా నిర్మించింది. నూతనంగా నిర్మించిన షెడ్డులో గురువారం పరిశ్రమ యాజమాన్యం ప్రత్యేక పూజలు చేసి ఉత్పత్తులను ప్రారంభించారు. ఈ సమయంలో ఒక్కసారిగా పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ కావడంతో చిన్నగా మంటలు చిల్లరేగాయి. ఈ మంటలు ప్లాస్టిక్ వస్తువులకు, ప్లాస్టిక్ ముడి సరుకులకు అంటుకోవడంతో మంటలు క్షణాల్లో మరింత పెరిగిపోయాయి. దీంతో ఒక్కసారిగా పరిశ్రమలో మంటలు నల్లటి పొగతో ఒక్కసారిగా కమ్ము కోవడంతో పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు సిబ్బంది బయటకు పరుగులు తీశారు.

ఫైర్ సిబ్బంది రంగంలోకి..!

సమాచారం అందిన వెంటనే షాద్ నగర్, మహేశ్వరం నుంచి నాలుగు ఫైర్ ఇంజన్లు సంఘటన స్థలానికి చేరుకున్నాయి.



నాలుగు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండు గంటలకు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.ఇంతలో జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రెండు షెడ్లు,ప్లాస్టిక్ కుర్చీలు, యంత్రాలు, ముడి సరుకుతో సహా అగ్నికి ఆహుతి. ప్రమాదంలో రెండు షెడ్లు, ప్లాస్టిక్ కుర్చీలు,ముడి సరుకు విలువైన యంత్రాలు ఈ ప్రమాదంలో బూడిదైపోయాయి. సుమారు రూపాయలు ఆరు కోట్ల వరకు ఆస్తి నష్టం సంభవించినట్టు పరిశ్రమ నిర్వాహకులు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
13 నవంబర్ 2026

యూనిఫాంలో రాలేదని విద్యార్థులను కొట్టిన టీచర్

నోట్ పుస్తకాల చించివేత

- నలుగురు విద్యార్థులకు గాయాలు
- పాఠశాల ఫర్నీచర్ ధ్వంసం చేసిన తల్లిదండ్రులు

వికారాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి) : విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పవలసిన టీచర్ సహనం కోల్పోయి స్కూల్ కు యూనిఫాంలో రాలేదని విద్యార్థులను చితకబాదిన దారుణ సంఘటన వికారాబాద్ జిల్లా పు దూరు మండలం ఎన్కేపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ లో జరిగింది. విద్యార్థుల బంధువులు విద్యార్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్కేపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ లో చదువుతున్న నలుగురు విద్యార్థులు గురువారం రోజున యూనిఫాం లో పాఠశాలకు రాలేదు.



సివిల్ డ్రెస్ లో విద్యార్థులు పాఠశాలకు వచ్చారనే కారణంతో గణితం బోధించే టీచర్ లక్ష్మీ ప్రసన్న నలుగురు విద్యార్థులను చితక బాదారు. కర్రతో విద్యార్థులను విపరీతంగా చితకబాదారు. తరగతి గదిలోకి వెళ్లి గణితం బోధించే సమయంలో ఇతర సబ్జెక్టు నోట్స్ ఎందుకు రాస్తున్నారని బాలికలను గణితం టీచర్ లక్ష్మి ప్రసన్న చెంపలు వాయించారు. అత్త మీద కోపం దుత్త మీద తీసినట్లు తరగతి గదిలో గణితం మాస్టర్ 10 మంది విద్యార్థులను కొట్టారు. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో వారు పాఠశాలకు వెళ్లి టీచర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాఠశాలలో ఉన్న ఫర్నిచర్ ను ధ్వంసం చేశారు. టీచర్లతో వాద్వివాదానికి దిగి తీవ్రంగా మందలించారు. పాఠశాల ప్రాంగణంలో ఉద్రిక్త వాతావ రణం నెలకొనడంతో పరిస్థితి చేయి జారి పోతుందని గ్రహించిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలియగానే తెలంగాణ మోడల్ స్కూల్ కు పోలీసులు సకాలంలో చేరుకొని విద్యార్థుల తల్లిదండ్రులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. గాడి తప్పిన విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టే ఉపాధ్యాయులే క్లాసులో అమానుషంగా ప్రవర్తిస్తే విద్యార్థులు ఎలా పాఠశాలకు వస్తారు క్రమశిక్షణంగా ఎలా చదువుకుంటారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను కొట్టిన ఉపాధ్యాయుని పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంతో కష్టపడి హోంవర్క్ చేసుకుంటే నోట్ పుస్తకాలను టీచర్ చించి వేయడంతో విద్యార్థులు ఆందోళన గురయ్యారు. సబ్జెక్టుతో సంబంధంలేని వేరే సబ్జెక్ట్ నోట్ పుస్తకాలను చించి వేయడంతో తాము ఎలా చదువుకోవాలి ఎలా రాసుకోవాలని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుని ప్రవర్తన పట్ల రాజకీయ నాయకులు గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



960 సంఘాల మద్దతుతో ఎంబీ కాన్ఫరెన్స్ నూతన నాయకత్వం

- 53 మంది ప్రతినిధుల ఏకగ్రీవ నిర్ణయం
- అధ్యక్షుడిగా రెవ. డా. సి.ఎస్. జోయెల్



హైదరాబాద్ (జనంసాక్షి) : మెనోనైట్ బ్రద్రెన్ (ఎంబీ) కాన్ఫరెన్స్ నూతన పాలక మండలి ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కాన్ఫరెన్స్ పరిధిలోని సుమారు 960 సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వివిధ వర్గాల సమష్టి నిర్ణయంతో మహబూబ్ నగర్‌లోని ఎంబీ మిషన్ ప్రాంగణంలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2 వేల మంది హాజరుకాగా, 53 మంది ప్రతినిధులు పాలక మండలి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా రెవ. డా. సిఎస్ జోయెల్, ఉపాధ్యక్షుడిగా సహో. కె.ఇ. రాజారత్నం, ప్రధాన కార్యదర్శిగా రెవ. ఎ. శ్యామ్‌రావు, సహాయ కార్యదర్శిగా రెవ. ఇ. ప్రసాద్, కోశాధికారిగా రెవ. బండారి ప్రసాద్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సహో. వి. వందనం, సహో. జిజి పాల్ బాధ్యతలు చేపట్టనున్నారు. సంస్థను తిరిగి అభివృద్ధి పథంలో నడిపించడంతోపాటు, నిలిచిపోయిన కార్యక్రమాలను పునరుద్ధ రించడం నూతన నాయకత్వం ప్రధాన లక్ష్యమని అధ్యక్షుడిగా ఎన్నికైన రెవ. డా. సిఎస్ జోయెల్ తెలిపారు. కోల్పోయిన సంస్థ ఆస్తులను తిరిగి పొందేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రస్తుతం ఉన్న ఆస్తులను పరిరక్షిస్తామని చెప్పారు. ఆర్థిక వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత పాటిస్తామని స్పష్టం చేశారు.

కాన్ఫరెన్స్ పరిధిలోని అనుబంధ విభాగాలను బలోపేతం చేసి, విద్యా, వైద్య, సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో నిలిచిపోయిన కార్యక్రమాలను తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. సంస్థ పూర్వ వైభవాన్ని పునరుద్ధరించేందుకు సభ్యులందరి సహకారంతో సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. 960 సంఘాల ప్రాతినిధ్యంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడం సంస్థలో ఐక్యత, సమిష్టి బాధ్యత, పునర్నిర్మాణంపై సభ్యుల ఆకాంక్షకు నిదర్శనంగా నిలిచింది.

అన్నపూర్ణ సేవా రథం సేవలు అభినందనీయం

పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్12 (జనంసాక్షి) : సమాజ సేవే లక్ష్యంగా అన్నపూర్ణ సేవా రథం చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అన్నపూర్ణ సేవా రథం ప్రచార పత్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు, చిన్నాపెద్దా అనే తేడా లేకుండా సేవలు అందించాలనే సంకల్పం గొప్పదన్నారు. కుటుంబంలో ఎవరైనా మృతి చెందిన సమయంలో అంత్యక్రియలకు హాజరయ్యే బంధుమిత్రులకు భోజన సదుపాయం కల్పించడం ద్వారా బాధలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, డీసీసీ ఉపాధ్యక్షుడు పంపరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి జూలూరి సుధాకర్, తాటి ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు జమీల్, సలీం, చింతల రవీందర్ గౌడ్, చాట్ల వంశీ, పిడుగు సాయిబాబా, రంగా రమేష్ గౌడ్, సునీల్ గౌడ్, బండారి శ్రీకాంత్, అరవింద్, బల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విలీనానికి ముందు మౌలిక సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు విశ్వాసం కల్పించాలి : టీఎస్ యూటీఎఫ్

ముషీరాబాద్, నవంబర్ 12 (జనంసాక్షి): ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయడానికి ముందు ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయడాన్ని స్వాగతి స్తున్నప్పటికీ, కేవలం విలీనం చేయడం వల్ల విద్యార్థుల సంఖ్య పెరగదని, విద్యా ప్రమాణాలు మెరుగుపడవని స్పష్టం చేసింది. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే క్యాంపస్‌లో విద్యను అందించడం లేదా పాఠశాల విద్యను నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ప్రాథమిక విద్యగా, 5 నుంచి 8వ తరగతి వరకు సెకండరీగా, 9 నుంచి 12వ తరగతి వరకు హయ్యర్ సెకండరీగా విభజించడం వల్ల ఆశించిన ఫలితాలు రావని అభిప్రాయపడింది. ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తల్లిదండ్రులకు విశ్వాసం కల్పించాలని సూచించింది. ప్రైవేటు విద్యా వ్యాపారాన్ని నియంత్రించకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతను తీర్చకుండా, ఉపాధ్యాయులు, అధ్యాపకుల మధ్య తలెత్తే సర్వీసు సమస్యలను పరిష్కరించకుండా ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేయడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని పేర్కొంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ముందుగా ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. విద్యారంగంలో కీలకమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకునే ముందు ఆ రంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపక సంఘాలతో ప్రభుత్వం సంప్రదింపులు జరపాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్ డిమాండ్ చేశారు. విద్యారంగంలో తీసుకునే నిర్ణయాలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు ఇచ్చేలా సంబంధిత భాగస్వాముల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరారు.

గొల్లూరు ఎక్స్‌రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం

- కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్‌కు స్వల్ప గాయాలు





శంషాబాద్, నవంబర్12 (జనంసాక్షి) : గొల్లూరు ఎక్స్‌రోడ్డు సమీపంలోని పీ1 రోడ్డు వద్ద గురువారం తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ప్రయాణిస్తున్న ఇన్నోవా కారును మహీంద్రా బొలెరో ట్రక్ ఢీకొట్టడంతో కారు పూర్తిగా ధ్వంసమైంది. పెద్ద షాపూర్ ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి కథనం ప్రకారం నవంబర్ 12న ఉదయం 5.20 గంటలకు గొల్లూరు గ్రామ పరిధిలో కార్యక్రమానికి హాజరైన అనంతరం శేఖర్ మాస్టర్, కారు యజమాని కోట మధుసూదన్, ఆయన కుమారుడు శ్రీకర్ బాబుతో కలిసి ఇన్నోవా కారులో బంజారాహిల్స్‌కు బయలుదేరారు. ఉదయం 5.40 గంటల సమయంలో గొల్లూరు ఎక్స్‌రోడ్డు వద్ద సంగిగూడ వైపు వెళ్లేందుకు కారు మలుపు తిరుగుతుండగా, పాలమాకుల వైపు నుంచి వేగంగా వచ్చిన మహీంద్రా బొలెరో ట్రక్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బొలెరో వాహనం ఇన్నోవా కారుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇన్నోవా కారు నెం టిఎస్ 09 ఎఫ్జి 3348 పూర్తిగా ధ్వంసమైంది. బొలెరో ట్రక్ నంబర్ కెఎ 28 ఎసి 3263 గా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో శేఖర్ మాస్టర్‌కు స్వల్ప గాయాలైనట్లు మీడియా కథనాలు వెల్లడించాయి.ఇన్నోవా కారు డ్రైవర్ మతంశెట్టి శ్రీనివాసరావు (56) ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొలెరో డ్రైవర్ మల్లయ్య హిరేమఠ్ పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ సమస్యలకు పరిష్కార మార్గాలు

ప్రజాస్వామ్యం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఏఐ, వాతావరణ మార్పులపై చర్చలు

- 'తెలంగాణ రైజింగ్'పై ప్రత్యేక ప్యానెల్ డిస్కషన్స్
- 'భారత్ సమ్మిట్ 2026' స్వాగత కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రస్తుతం ప్రపంచం అనేక సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంటోందని, వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు 'భారత్ సమ్మిట్-2026' ఒక వేదికగా నిలవనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో వివిధ దేశాల ప్రతినిధులు, మేధావులు ఒకచోట చేరి వాటిపై చర్చించడం ద్వారా అనేక సమస్యలకు పరిష్కార మార్గాలను కనుగొనే అవకాశం కలుగుతుందన్నారు. గురువారం హెచ్‌ఐసీసీ నోవాటెల్‌లో నిర్వహించిన 'భారత్ సమ్మిట్ - 2026' స్వాగత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను ఎదుర్కొం టోందని, తరతరాలుగా ప్రపంచ శాంతిని కాపాడిన అంతర్జాతీయ సంస్థల పాత్రపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే తరాలకు ఎలాంటి ప్రపంచాన్ని నిర్మించాలి? అందుకోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే అంశాలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసర ముందన్నారు. మేధోపరమైన చర్చలకు, ఆలోచనలకు, అంతర్జాతీయ భాగస్వా మ్యాలకు తెలంగాణ ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతుందన్నారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ ఆలోచనల స్ఫూర్తితో సల్మాన్ ఖుర్షీద్ మార్గదర్శకత్వంలో రెండ్రోజుల పాటు వరుసగా రెండో ఏడాది కూడా భారత్ సమ్మిట్ ను హైదరాబాద్ లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. దీనికి వివిధ దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. ప్రజాస్వామ్యం, ఏఐ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపు, వాతావరణ మార్పులు, అంతర్జాతీయ సంస్థల సంస్కరణలు, ప్రపంచ శాంతి, మీడియా భవిష్యత్తు తదితర అంశాలపై 12 అంతర్జా తీయ ప్యానెల్ డిస్కషన్స్ ఉంటాయన్నారు. వీటితో పాటు హైటెక్స్ లో 'తెలంగాణ రైజింగ్' పేరిట 8 ప్రత్యేక చర్చా కార్యక్ర మాలు జరుగుతాయన్నారు. వీటిలో తెలం గాణ డెవలెప్ మెంట్ మోడల్, రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలపై ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకుంటారన్నారు. 'ఇండియా అండ్ ది వరల్డ్' పేరుతో ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నా మన్నారు. శనివారం జరిగే ముగింపు కార్యక్ర మానికి కాంగ్రెస్ అగ్రనేతలు హాజరవుతారని, అదే రోజు 'అవర్ వరల్డ్ ఇన్‌స్టిట్యూట్'ను కూడా ప్రారంభించను న్నట్లుగా మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ ఎప్పటినుంచో విభిన్న సంస్కృతులు, సంప్రదా యాల కలయికకు వేదికగా నిలుస్తోం దన్నారు. రాబోయే రెండు రోజులు ప్రపంచ దేశాల ఆలోచనలు, అభిప్రా యాల కలయి ككూ వేదిక కానుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7 నుంచి 9 వరకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0'లో పాల్గొనాలని విదేశీ ప్రతినిధులను ఆహ్వానించారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సల్మాన్ ఖుర్షీద్, శశిథరూర్ పాల్గొన్నారు.



పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు జిల్లా అధికార ప్రతినిధి ఫిర్యాదు

మంథని, నవంబరు 12 (జనంసాక్షి) : పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీ కృష్ణపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి సెగ్గం రాజేష్ టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులకు సమాచారం ఇవ్వకుండా, ప్రోటోకాల్ పాటించకుండా అయన పర్యటిస్తున్నారని, పరామర్శల పేరుతో భారత రాష్ట్ర సమితి నాయకులతో సన్నిహితంగా ఉంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంతో కాంగ్రెస్ కార్యకర్తల్లో అయోమయం ఏర్పడు తోందని, కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతోందని, వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బెల్లంకొండ సత్యనారాయణ రెడ్డి, రామ్ రాజశేఖర్, ఇందారపు అనిల్, కుడుదుల రవి, కుమార్, రాజేందర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులను బీసీ-ఏలో చేర్చాలి

- 10 లక్షల మందితో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభకు కార్యాచరణ



సికింద్రాబాద్, (జనంసాక్షి): ముదిరాజులను బీసీ-ఏ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే హైదరాబాద్‌లో 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలని ముదిరాజ్ సంఘాల నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ సంఘాలతో చర్చించి భవిష్యత్ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకురాలు అనిత ముదిరాజ్ ఆధ్వర్యంలో ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ముదిరాజ్ సంఘాల నాయకులు, మేధావులు, విద్యావంతులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ జాబితాలోకి మార్చాలని, జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ కోకాపేటలో ముదిరాజుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేయాలని, 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నీలం మధు ముదిరాజ్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని, బీఆర్ఎస్ నాయకుడు కాసాని వీరేష్ ముదిరాజ్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించాలని సమావేశంలో డిమాండ్ చేశారు. ముదిరాజుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం సాధించాలంటే అన్ని సంఘాలు, నాయకులు, యువత ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా సమాజ అభ్యున్నతే లక్ష్యంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని నాయకులు స్పష్టం చేశారు. ముదిరాజుల ఐక్యతతోనే హక్కులను సాధించుకోగలమని అభిప్రాయపడ్డారు.

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకంతో మరోసారి సత్ఫలితాలు

- సివిల్స్ తుది ఇంటర్వ్యూకు 31 మంది ఎంపిక
- ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు మరోసారి
- ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహకం
- అభ్యర్థులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ప్రాంతం నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ సహకారంతో ప్రారంభించిన 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం మరోసారి మంచి ఫలితాలను సాధించింది. ఇటీవల విడుదలైన సివిల్స్ మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణులై 31 మంది అభ్యర్థులు తుది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. సింగరేణి సంస్థ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక ప్రోత్సాహకం అందించేందుకు రెండు నెలల క్రితం దరఖాస్తులను ఆహ్వానించింది. వచ్చిన దరఖాస్తుల్లో 158 మంది అర్హులైన అభ్యర్థులను గుర్తించి, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.1.58 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించింది. ఈసారి ప్రోత్సాహక మొత్తాలను నేరుగా అభ్యర్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేశారు. ఈ ఆర్థిక సహకారంతో అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలకు మరింత ఉత్సాహంతో సిద్ధమయ్యారు. వారిలో 31 మంది తుది ఇంటర్వ్యూకు ఎంపిక కావడం విశేషం.

ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి మరో రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహకం

తుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మంది అభ్యర్థులకు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ త్వరలో ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అదనపు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించనుంది. సివిల్స్ మెయిన్స్ లో ఉత్తీర్ణులై తుది ఇంటర్వ్యూకు ఎంపికైన తెలంగాణ బిడ్డలందరికీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. ఇంటర్వ్యూ దశకు చేరుకున్న అభ్యర్థులందరూ తుది పరీక్షలోనూ విజయం సాధించి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకానికి సింగరేణి సంస్థ రెండేళ్లుగా తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి ఆర్థిక సహకారం అందిస్తోంది. ఈ పథకం ద్వారా మొదటి ఏడాది ఏడుగురు, రెండో ఏడాది 20 మంది చొప్పున మొత్తం 27 మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించడం విశేషం. ఈ ఏడాది కూడా అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు తుది ఇంటర్వ్యూలో విజయం సాధించి సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావాలని, ఈ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించబోతున్నారని, ఈ మాక్ ఇంటర్వ్యూల నిర్వహణకు కూడా సింగరేణి సంస్థ తన సహకారాన్ని అందిస్తుందని సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి తెలిపారు. ఈ ఏడాది తుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మందిలో అత్యధికంగా వరంగల్ జిల్లా నుంచి ఆరుగురు ఉన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి నలుగురు, హైదరాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి ముగ్గురేసి, నల్గొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల నుంచి ఇద్దరేసి చొప్పున ఎంపికయ్యారు. అదిలాబాద్, నారాయణపేట, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మంచిర్యాల జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున తుది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. వీరిలో 18 మంది ఓబీసీ వర్గాలకు చెందిన వారున్నారు. ఎస్టీ అభ్యర్థులు ఇద్దరు, ఎస్సీ అభ్యర్థులు ముగ్గురు, 8 మంది జనరల్ అభ్యర్థులు ఉన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370